ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఒంగోలు, fb.com/vaartha

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,Srikakulam

11-12-2024 బుధవారం సంపుటి: 30 సంచిక: 313 పేజీలు: 12 వెల: 6.50

పార్లమెంటులో అవే నిరసనలు, వాగ్వాదాలున

కర్ణాటక మాజీ సిఎం ఎస్‌ఎం కృష్ణ కన్నుమూత

9లో

# రాజ్యసభ చైర్మన్‌పై అవిశ్వాసం నోటీసు



జగదీప్ ధన్‌ఖడ్

## ఇండియా కూటమి పార్టీల్లో 50 మందికిపైగా సంతకాలు

## బాధాకరమే.. తప్పడం లేదు: జైరామ్ రమేష్

**న్యూఢిల్లీ, డిసెంబరు 10:** కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌పై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టింది. చైర్మన్‌పై ఇచ్చిన అవిశ్వాసం నోటీసుపై 50 మందికిపైగా సంతకాలుచేసారు. కాంగ్రెస్, బెంగాల్ టిఎంసి, ఆమ్ ఆద్మీపార్టీ అరవింద్‌కేజ్రీవాల్, అఖిలేష్‌యాదవ్ సమాజ్‌వాదిపార్టీ, తమిళనాడు డిఎంకె, ఆర్జెడిలకు చెందిన ఎంపిలు సంతకాలుచేసిన నోటీసును రాజ్యసభ సెక్రటేరియట్‌కు పంపించారు. ఇండియా కూటమిలోని అన్ని పార్టీలకు మరో ప్రత్యామ్నాయం లేకనే నోటీసు ఇవ్వాల్సి వచ్చిందని కాంగ్రెస ప్రధాన కార్యదర్శి జైరామ్‌రమేష్ అన్నారు. ఈ నిర్ణయం ఎంతో బాధాకరమే అయినా కూడా తప్పనిపరిస్థితుల్లో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పరిరక్షణకోసం ఈ చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని ఆయన అన్నారు. టిఎంసి ఎంపి సాగరికఘోష్ మాట్లాడుతూ పార్లమెంటును ప్రస్తుత ప్రభుత్వం ఖూనీచేస్తోందని, పార్లమెంటరీ ప్రజాస్వామ్య పరిరక్షణకోసమే అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇవ్వాల్సి వచ్చిందని అన్నారు. అయితే ప్రతిపక్షానికి తగినంతమంది సభ్యులు లేరని టిఎంసి వర్గీయులు చెపుతున్నారు. లోక్‌సభలో వలే కాకుండా ఇక్కడ అంతమంది లేరని, ఉన్నా మరికొందరు విభేదిస్తారని అందువల్ల ఈ తీర్మానం వీగిపోవచ్చన్న అంచనాలుకూడా ఉన్నాయి. ధన్‌కర్‌పై అవిశ్వాస తీర్మానం ముందుకుపోవాలంటే 50శాతంకుపైగా ఒక్కరయినా ఎక్కువ ఉండాలి. లోక్‌సభలో కూడా ఇదే మెజార్టీతో ఆమోదం పొందుతుంది. విపక్షానికి తగినంత మెజార్టీ లేనంతకాలంధన్‌కర్‌ను తొలగించే వీలుండదని అన్నారు.ఇదిలా ఉంటే జార్జిసోరోస్, సోనియా గాంధీకి సన్నిహిత >>2

# మరో 1000 సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు

## జనన మరణాల నమోదుకు కొత్త పోర్టల్

## వచ్చేదంతా వాట్సప్ గవర్నెన్స్

## విభాగాల వారీగా రియల్‌టైమ్ డ్యాష్‌బోర్డులు

## ఆర్టీజీఎస్‌పై సమీక్షలో సిఎం చంద్రబాబు



**విజయవాడ, డిసెంబరు 10,ప్రభాతవార్తప్రతినిధి:** సమర్థవంతమైన పాలన అందించేలా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలు సాంకేతికతను విస్తృతంగా వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రియల్‌టైమ్‌లో సమాచారాన్ని సేకరించి మిగిలిన శాఖలతో అనుసంధానం కావాలన్నారు. అన్ని శాఖల సమాచారాన్ని ఆర్టీజీఎస్ సమీకృతం చేసి, మొత్తంగా పర్యవేక్షించాల్సి ఉంటుందని చెప్పారు. మొదటగా ప్రతిశాఖలో సమాచార సేకరణ జరగాలని, తర్వాత ఆ సమాచారాన్ని సమీకృతం చేసుకోవాలని.. అంతిమంగా వాట్సప్ గవర్నెన్స్ ద్వారా అత్యుత్తమ సేవలు అందించాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. మంగళవారం సచివాలయంలో సీఎంవోతో సహా ఆర్టీజీఎస్‌కు చెందిన అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఇకపై వాట్సప్ వేదికగా సరికొత్త వ్యవస్థను తీసుకుని రావాలనుకుంటున్నామన్నారు. ప్రతి ఒక్కరికికి ప్రయోజనవంతంగా ఈ వ్యవస్థ ఉంటుందన్నారు. కుల ధృవీకరణ దగ్గర నుంచి ఆదాయ ధృవీకరణ పత్రం, ఇతర ధృవపత్రాలను పొందేందుకు వాట్సప్‌ను వేదిక చేసుకునేలా వ్యవస్థను రూపొందించాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా చెప్పారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు ఏఐ, డీప్‌టెక్ వంటి టెక్నాలజీ సేవలు వినియోగించుకుని వేగంగా పరిష్కరించాలని సూచించారు. వినతుల పరిష్కార విధానం, ప్రజల సంతృప్తి స్థాయి కూడా ఆర్టీజీఎస్ పరిశీలించాలని అన్నారు. విజువల్స్ ఇంటిగ్రేషన్ విధానాన్ని మంచి ప్రయోజనకరంగా మనం వినియోగించుకోవాలన్నారు. ఈ దిశలోనే మనం డ్రోన్లు, సీసీ కెమేరాలు, శాటిలైట్లు, ఐవోటీ డివైజ్‌ల ద్వారా సేకరిస్తున్న విజువల్స్‌ను కూడా సమీకృతం చేయాల్సి ఉందని ముఖ్యమంత్రి అధికారులకు చెప్పారు. ఇటీవల గూగుల్ మ్యాప్‌ల ద్వారా గుర్తించిన గంజాయి తోటలను డ్రోన్ల సాయంతో ధృవీకరించుకోవడం జరిగిందన్నారు. దీని వలన మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నియంత్రణకు అత్యంత ఉపయుక్తమవుతుందన్నారు. డ్రోన్లు అన్నిరంగాల్లో మనం వినియోగించుకోవాలనుకుంటున్నాం, ఆ దిశలో మన కార్యాచరణ ఉందన్నారు. ఇక రానున్న రోజుల్లో పంట తెగుళ్లను గుర్తించి, రైతులను అప్రమత్తం చేసేందుకు డ్రోన్లు వినియోగించాలని ముఖ్యమంత్రి సూచించారు. వ్యవసాయరంగంలో మనం ఫలితాలు సాధిస్తామన్నారు. తెగుళ్ళ నివారణతో మనం వ్యవసాయ ఉత్పత్తిరంగంలో మంచి ఫలితాలను సాధిస్తామన్నారు. రాష్ట్రంలోని రహదారులపై జరుగుతున్న ప్రమాదాలకు గల కారణాలను అన్వేషించేందుకు డ్రోన్ల ద్వారా ప్రమాద స్థలాలను గుర్తించి పరిష్కరించాలన్నారు.

**ధాన్యం సేకరణపై రైతుల్లో సంతృప్తి** రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన ధాన్యం సేకరణపై రైతుల్లో సంతృప్తి వ్యక్తమవుతోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఐవీఆర్ఎస్ ద్వారా చేపట్టిన అభిప్రాయ సేకరణలో నాణ్యతకు తగ్గ ధర, 48గంటల్లో డబ్బులు జమ చేయడం, రవాణా సౌకర్యం, గోనె సంచుల లభ్యతపై 90 శాతానికి పైగా రైతులు తమ సంతృప్తి వ్యక్తం చేశారని చెప్పారు. సంతృప్తి స్థాయి తెలుసుకోవడం ద్వారా మరింత మెరుగ్గా సేవలు అందించవచ్చని ముఖ్యమంత్రి అన్నారు. ఒకవేళ ఎక్కడైనా అసంతృప్తి ఉంటే ఎందుకు వ్యక్తమవుతోందనే దానిని పరిశీలించి తక్షణం ఆ >>2



మంగళవారం రాజ్యసభకు నామినేషన్లు దాఖలు చేస్తున్న టీడీపీ అభ్యర్థులు సానా సతీష్, బీదా మస్తాన్‌రావు, బిజెపి అభ్యర్థి ఆర్.కృష్ణయ్య

# మూడు రాజ్యసభ సీట్లకు ముగ్గురి నామినేషన్లు

## టిడిపి అభ్యర్థులుగా సానా సతీష్, బీదా మస్తాన్‌రావు, బిజెపి తరపున ఆర్.కృష్ణయ్య

**విజయవాడ,డిసెంబరు 10,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి రాజ్యసభలో ఖాళీ అయిన మూడు ఎంపి స్థానాల భర్తీకి సంబంధించి టిడిపి అభ్యర్థులుగా బీద మస్తాన్ రావు,సానా సతీష్ బాబు,బిజెపి తరుపువ ఆర్. కృష్ణయ్యలు నామినేషన్లు దాఖలు చేశారు. మంగళవారం అసెంబ్లీ భవనంలో రాజ్యసభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్.వనితారాణి వద్ద రాజ్యసభ ఎంపి అభ్యర్థులుగా వారు నామినేషన్లను దాఖలు చేశారు. మూడు రాజ్యసభ స్థానాలకు ముగ్గురు అభ్యర్థులే నామినేషన్ల దాఖలు చేయడంతో నామినేషన్ల పరిశీలన, ఉప సంహరణల గడువు అనంతరం వారి ఎన్నిక ఏకగ్రీవం కానుంది.

ఈనామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థులు తరపున ఆయా పార్టీల ప్రతినిధులుగా రాష్ట్ర మంత్రులు నాదెండ్ల మనోహర్, కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, కె.అచ్చన్నాయుడు, పి.నారాయణ, పలువురు ఎంఎల్ఏలు తదితరులు పాల్గొన్నారు. ఇక నామినేషన్ల దాఖలు అనంతరం బీదా మస్తాన్ రావు, సానా సతీశ్, ఆర్. కృష్ణయ్య మీడియాతో మాట్లాడుతూ ఏపీ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని >>2



# ముఖ్యమంత్రితో వంగవీటి రాధా భేటీ

**విజయవాడ, డిసెంబరు10,ప్రభాతవార్త ప్రతినిధి:** సీఎంవో నుంచి మాజీ ఎంఎల్ఏ, టీడీపీ నేత వంగవీటి రాధాకృష్ణ(రాధా)కు పిలుపు వచ్చింది. దాంతో వెలగపూడి సచివాలయంలోని సీఎంవో కార్యాలయానికి చేరుకున్నారు. ఆయనతో సీఎం చంద్రబాబుతో రాధా ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. అయితే ఈ సమావేశ వివరాలు వెల్లడి కావాల్సి ఉంది. వంగవీటి రాధా రెండు సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయలేదు. 2019, 2024 ఎన్నికల్లో ఆయన టీడీపీకి విస్తృత ప్రచారం చేసారు. రాధా టీడీపీలో స్థిరమైన నాయకునిగా ఉన్నారు. ఇటీవల ఆయనకు అస్వస్థతకు గురైన సందర్భంలో సీఎం చంద్రబాబు ఆయనను పరామర్శించారు. నారా లోకేష్ నేరుగా ఆయన ఇంటికి వెళ్ళి పరామర్శించారు. రాధాకు టీడీపీ అధిష్టానం గతంలో రెండుపర్యాయాలు శాసనమండలి పదవి ఇవ్వడానికి ఆసక్తి చూపినా ఆయన అంగీకరించలేదుంటున్నారు. అయితే ఇటీవల రాజ్యసభ టిక్కెట్టు ఆయనకు ఇస్తు >>2

# 17న రాష్ట్రపతి రాక

## విస్తృత ఏర్పాట్లకు సిఎస్ ఆదేశం

**విజయవాడ,డిసెంబరు 10,ప్రభాతవార్తప్రతినిధి:** ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ప్రథమ స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 17వ తేదీన రానున్న నేపథ్యంలో అందుకు సంబంధించి విస్తృతమైన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ దుకు ప్రోటోకాల్ నిబంధనల ప్రకారం ఏ చిన్నపాటి పొరపాట్లకు ఆస్కారంలేని రీతిలో కటుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి వివిధశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రాష్ట్రపతి పర్యటన విజయవంతానికి చర్యలు తీసుకోవాలని సిఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు.



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



సిఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్

సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఎయిమ్స్ మంగళగిరిలో ఉంది. ఇక్కడి రాష్ట్రపతి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సిఎస్ ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా సిఎస్ మాట్లాడుతూ దేశప్రథమ పౌరురాలైన రాష్ట్రపతి రాష్ట్రపర్యటన విజయవంతం చేసేం

తాత్కాలిక కార్యక్రమం ప్రకారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 17వ తేదీన ఉ.11.20 గం.లకు భారత వాయుసేన విమానంలో గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంటారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ వెల్లడించారు. తదుపరి అక్కడి నుండి రోడ్డుమార్గంలో బయలుదేరి >>2



మంగళవారం అధికారులతో ఉన్నతస్థాయి సమావేశంలో గృహ నిర్మాణశాఖ పురోగతిపై సమీక్షిస్తున్న మంత్రి పార్థసారథి

# ప్రతి నియోజకవర్గానికి ఒక 'మోడల్ కాలనీ'

## శ్వాశత సదుపాయాలకు అధిక ప్రాధాన్యం: మంత్రి పార్థసారథి

**విజయవాడ,డిసెంబరు10,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి ఒక మోడల్ కాలనీగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణం సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో జరుగుతున్న నిర్మాణాలపై మంగళవారం సచివాలయంలో మంత్రి ఉన్నతస్థాయి సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్న కాల నీలలో శ్వాసిత మౌలిక సదుపాయాలు కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, రహదారులు, మంచినీరు విద్యుత్, డ్రైనేజీ తదితర సదుపాయాలను యుద్ధ ప్రాతిపదికపై ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ మోడల్ కాలనీలలో ఏర్పాటు చేయవలసిన మౌలిక సదుపాయాలు కల్పనకు >>2

# సజ్జలపై తొందరపాటు చర్యలొద్దు: హైకోర్టు

**విజయవాడ,డిసెంబరు10,ప్రభాతవార్తప్రతినిధి:** టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ అగ్రనేత సజ్జల రామకృష్ణారెడ్డికి ఏపీ హైకోర్టులో ఊరట లభించింది. సజ్జల రామ కృష్ణారెడ్డిపై మరో రెండువారాలపాటు తొందరపాటు చర్యలు తీసుకోవద్దని హైకోర్టు పోలీసులను ఆదే శించింది. ఈ కేసులో సజ్జల ముందస్తు బెయిల్ కోరుతూ ఇటీవల పిటిషన్ >>2

# వీధికెక్కిన 'మంచు' జగడం

**హైదరాబాద్, (సరూర్‌నగర్) డిసెంబరు 10, ప్రభాతవార్త:** టాలీవుడ్ సీనియర్ నటుడు మోహన్ బాబు ఇంట్లో ఏర్పడ్డ గొడవలు మరింత ముదిరాయి. సోమవారం వ రకు పోలీసుల ఫిర్యాదుల వరకే పరిమితమైన మోహన్ బాబు ఆయన తనయుడు మనోజ్‌లు మంగళవారం వీధి పోరాటానికి దిగారు. శివార్లలోని జల్‌పల్లిలో గల మో హన్ బాబు ఫాం హౌజ్‌లో రెండు రోజులుగా జరుగుతున్న గొడవలు మంగళవారం రాత్రి అనూహ్యంగా ఒకరిపై మరొకరు దాడిచేసుకునే వరకు వెళ్లాయి. మరోవైపు అ టు మోహన్ బాబు, ఇటు మనోజ్ తమకు భద్రత కల్పించాలని పోలీసు ఉన్నతాధికారులను కోరారు. ఇంకోవైపు మోహన్ బాబు ఆయన తనయుడు విష్ణుల గన్ లైసెన్స్‌లను వెంటనే జప్తు చేసి, తుపాకులను స్వాధీనం చేసుకోవాలని రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్ బాబు సిటీ పోలీసులకు సిఫార్సు చేశారు. ఈ ఆదేశాల నేపథ్య ంలో సిటీ పోలీసులు మోహన్ బాబు, విష్ణులకు ఫోన్ చేసి వెంటనే ఆయుధాలను స్వాధీనం చేయాలని ఆదేశించారు. కాగా జల్‌పల్లిలోని తన ఫాం హౌస్ వద్ద గొడవ ల వివరాలను సేకరించేందుకు వచ్చిన మీడియా సిబ్బందిపై మోహన్ బాబు ధూషణలకు పాల్పడుతూ దాడికి దిగారు. మోహన్ బాబు ప్రవర్తనను నిరసిస్తూ జూబ్లీహి ల్స్‌లోని ఆయన ఇంటి వద్ద మంగళవారం రాత్ర మీడియా సిబ్బంది ధర్నాకు దిగారు. ఇంకోవైపు మోహన్ బాబును బుధవారం ఉదయం తమ ఎదుట హాజరు కావాలని రాచకొండ పోలీసులు ఆదేశించారు. టాలీవుడ్ సీనియర్ నటుడు మోహన్‌బాబు కుటుంబ గొడవలు ముదురుతున్నాయి. సోమవారం నాడు ఫిర్యాదుల వరకు వున్న ఇరువర్గాలు మంగళవారం దాడుల వరకు వెళ్లాయి. సోమవారం సాయంత్రం ఇరువర్గాల మధ్య గొడవలు శాంతించేలా >>2

## మోహన్‌బాబు, మనోజ్‌లపై కేసులు నమోదు

## నేడు తమ ఎదుట హాజరుకావాలని మోహన్‌బాబుకు రాచకొండపోలీసుల ఆదేశం

## దూషణలతో మీడియాపై దాడి చేసిన వైనంన

## జల్‌పల్లిలోని ఫామ్‌హౌస్ వద్ద సడలని ఉద్రిక్తత

## తుపాకులు సరెండర్ చేయాలని మోహన్, విష్ణుకు సిటీ పోలీసులు ఆదేశం



మంగళవారం మీడియాపై దాడి చేస్తున్న నటుడు మోహన్‌బాబు

# ఎన్‌హెచ్30పై కారు దగ్ధం



## పోలీసుబలగాల హైఅలర్ట్

## ముగిసిన మావోయిస్టు వారోత్సవాలు

**చింతూరు, డిసెంబరు 10 ప్రభాతవార్త :** చింతూరు మండలం సర్వేల గ్రామం సమీపంలో మావోయిస్టు మంగళవారం తెల్లవారుజామున కారును దగ్ధం చేశారు. అయితే కారులో ఉన్న వ్యక్తులను మావోయిస్టులు అపహరించారా? లేక భయంతో పారిపోయారా? తెలియాల్సి ఉంది. డిశంబర్ 2నుండి 8వరకు మావోయిస్టుల >>2



# ఆర్జీవీకి ముందస్తు బెయిలు

**విజయవాడ, డిసెంబరు 10,ప్రభాతవార్త ప్రతినిధి:** రాంగోపాల్‌వర్మకు ఏపీ హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. కాగా దర్యాప్తునకు సహకరించాలని, పోలీసులు కోరినప్పుడు విచారణకు హాజరుకావాలని రాంగోపాల్‌వర్మను ఆదేశించింది. సోషల్ మీడియాలో చంద్రబాబు, పవన్, లోకేశ్‌పై అసభ్యకర పోస్టులపై కేసుకు సంబంధించిన పిటిషన్ పై ఏపీ హైకోర్టు ఇవాళ విచారణ చేపట్టింది. ఈ మేరకు వర్మకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. కాంట్రవర్సీలకు కేరాఫ్ రామ్ గోపాల్ వర్మకు ముందస్తు బెయిల్‌తో భారీ ఊరట దొరికిందని చెప్పుకోవచ్చు. గతంలో ఆయన తీసిన వ్యూహం అనే సినిమాను తీసారు. తర్వాత చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్, ఆయన సతీమణిలను కించపర్చే విధంగా పోస్టులను పెట్టారని ఇటీవల ఏపీలో పలు పోలీస్ స్టేషన్ లలో ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలో పోలీసులు కేసుల్ని నమోదు చేసి విచారణకు రావాల్సిందిగా పోలీసులు నోటీసులు జారీ చేశారు. కానీ ఆర్జీవీ మాత్రం పోలీసులకు చిక్కకుండా తనకు టైమ్ కావాలని, సినిమాల్లో బిజీగా ఉన్నానని రిక్వెస్ట్ లెటర్ సైతం పంపించారు. మరోవైపు ఏపీ హైకోర్టులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కూడా పిటిషన్ దాఖలు >>2

11-12pg2exHMNWJQEK.qxd:11-12pg2exHMNWJQEK.qxd 01/01/01 10:43 AM Page 1






బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై దాడులకు నిరసనగా ప్రదర్శన జరిపిన హిందూ సంస్థల సభ్యులు

# ఆధార్ కేంద్రాలు

>> సమస్యను పరిష్కరించాలని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే సమాచార ప్రామాణికతను విశ్లేషించి, అవసరమైతే తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. **95 శాతం దాటిన హౌసహోల్డ్ ట్యాగింగ్ :** రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్ చివరి దశకు వచ్చిందని, ఇప్పటికే 95 శాతం కుటుంబాల జియో ట్యాగింగ్ పూర్తిచేశామని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ట్యాగింగ్ సక్రమంగా జరిగిందా, లేదా అనేది సరిచూసుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు. **రూ.20 కోట్లతో వెయ్యి ఆధార్ కిట్ల కొనుగోలు :** ఆధార్ సంబంధిత సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఇందుకు అవసరమైన మరో వెయ్యి ఆధార్ కిట్ల కొనుగోలుకు సంబంధించిన రూ.20కోట్ల నిధుల మంజూరుకు ముఖ్యమంత్రి అనుమతిచ్చారు. వీలైనంత త్వరగా గ్రామ-వార్డు సచివాలయాల్లో వెయ్యిఆధార్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. **ప్రత్యేక పోర్టల్ నందు భారీ ప్రాజెక్టుల ప్రగతి :** రాష్ట్రంలో రూ.100 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టిన వివిధ ప్రాజెక్టుల పర్యవేక్షణకు ఒక పోర్టల్‌ను రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ పోర్టల్‌లో కేంద్ర ప్రభుత్వ పరిధిలో చేపడుతున్న 80 ప్రాజెక్టుల సమాచారాన్ని రియల్‌టైమ్‌లో అప్డేట్ చేయాలని చెప్పారు. **జననమరణ ధృవ పత్రాలకు కొత్త పోర్టల్ :** రాష్ట్రంలో జనన - మరణ ధృవపత్రాలు పొందేందుకు తలెత్తుతున్న ఇబ్బందులను శాశ్వత పరిష్కారంగా తీసుకువస్తున్న నూతన వెబ్ పోర్టల్‌ను వచ్చే ఏడాది జనవరి 1న ప్రారంభించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. పంచాయతీ రాజ్ - పట్టణాభివృద్ధి శాఖల సమన్వయంతో ఈ పోర్టల్ కొనసాగాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.



మంగళవారం న్యూఢిల్లీలో మానవ హక్కుల దినోత్సవాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న రాష్ట్రపతి ముర్ము

## రాజ్యసభ ఛైర్మన్‌పై అవిశ్వాసం నోటీసు

>> సంబంధాలున్నాయన్న వివాదంపై పార్లమెంటు మంగళవారం కూడా వాయిదాపడింది. బిజెపి ఎంపీలు సభలో ఒక్కసారిగా లేచి సభను సజావుగా సాగనీయడంలేదని ఆరోపించారు. విపక్ష ఎంపీలు ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌మసీదు సర్వే పరంగా తలెత్తిన హింస, రైతుల కనీసమద్దతుధర ఆందోళన, మణిపూర్ హింస వంటి వాటిపై చర్చించాలంటూ పట్టుబడుతుండటంతో మంగళవారంకూడా వాయిదా పడ్డాయి. ప్రతిరోజు కూడా చర్చజరగాలని మేం పట్టుబడుతున్నాకే ఉన్నప్పటికీ ఇప్పటివరకూ తాముచేవ నెత్తిన అంశాలపై చర్చజరగలేదని కాంగ్రెస్ సభ్యురాలుప్రియాంక గాంధీ వాద్రా మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. ఇక బిజెపి పరంగా మంత్రి గిరిరాజ్‌సింగ్ మాట్లాడుతూ కాంగ్రెస్ కపటనాటకం ఆడుతున్నారని, జార్జిసోరోస్‌తో సోనియాకు ఉన్న సంబంధాలపై ఎందుకు స్పష్టత నివ్వడంలేదంటూ విమర్శించారు. గడచిన రెండురోజులుగా సోరోస్ అంశం రాజ్యసభను కుదిపేస్తోంది. స్వతంత్రకాశ్మీర్ కావాలన్న వివాదాస్పదమైన వార్తలురావడంతో ఈ లింకు భారత ప్రతిష్టకు మచ్చతెస్తోందని, దేశ భద్రత ఆందోళనకరం అవుతుందని అన్నారు. నడ్డా లేవనెత్తిన వివాదాన్ని మల్లికార్జునఖర్గే తూర్పారబట్టారు.దీనితో ఇరుపక్షాల ఎంపిలు లేచి నిరసనలు తెలపడంతో పదేపదే వాయిదాలుపడుతూ వచ్చాయి. రాజ్యసభ ఛైర్మన్ చర్చకు విముఖత ప్రకటించడంతో కాంగ్రెస్ ఆయనపై అవిశ్వాసం ప్రవేశపెట్టింది. జగదీప్‌ధనకర్ సోనియాపై వచ్చిన అన్ని వ్యాఖ్యలను ఆమోదించారని, బిజెపి ఎంపిలు ఇచ్చిన 11 నోటీసులను అనుమతించారని, తాము లేవనెత్తిన అంశాలను మాత్రం తిరస్కరించారన్నారు. సభాపక్ష నాయకుడు అబద్దాలు చెపుతున్నారని కాంగ్రెస్ వాదించింది.బిజెపి ఎంపిలు అక్కడితో ఆగకుండా రాహుల్‌గాంధీ దేశద్రోహి అని మాట్లాడుతూ సోరోస్‌తోపాటు కొనిన అమెరికా ఏజెన్సీ లమద్దతుతో భారత్‌ను నిర్వీర్యంచేసే కుట్రలుజరుగుతున్నాయన్నారు. అయితే అమెరికా ప్రభుత్వం మాత్రం బిజెపి చేస్తున్న వాదనలపై స్పందించింది. అవి ఎంతమాత్రం వాస్తవం కావన్నారు. భారత్‌లోని అధికార పార్టీ ఇలాంటి ఆరోపణలుచేయడం తీవ్రఅసంతృప్తిని కలిగించిందని అన్నారు. ప్రభుత్వం స్వతంత్ర సంస్థలతో కలిసి పనిచేస్తుందని వృత్తిపరమైన అభివృద్ధి, సామర్థ్యం పెంపు వంటివాటికి ప్రోత్సాహం ఇస్తుం దన్నారు.అంతేకాకుండా సంపాదకీయనిర్ణయాల్లో ఎట్టిపరిస్థితుల్లోను జోక్యం చేసుకోలేదన్నారు.

## మూడు రాజ్యసభ సీట్లకు ముగ్గురి నామినేషన్లు

>> చెప్పారు. చంద్రబాబు ఆధ్వర్యంలో ఏపీ అన్ని రంగాల్లో ముందుకెళ్లేందుకు ప్రయత్నం జరుగుతుందని, వారికితోడు మేముకూడా తమవంతు సహకారం అందిస్తామని చెప్పారు. రాజ్యసభ సభ్యులుగా తమకు అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ తరుపున రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన ఆర్. కృష్ణయ్య మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఏపార్టీలో ఉన్నా నేను బీసీల సంక్షేమంకోసం పనిచేస్తానని స్పష్టం చేశారు. నేను ఏ పార్టీలో చేరలేదు నన్ను పిలిచి సీటిచ్చారని పేర్కొన్నారు. బీజేపీనే తనను ఆహ్వానించి రాజ్యసభ సీటు ఇచ్చిందని ఆర్. కృష్ణయ్య తెలిపారు. తనను రాజ్యసభకు ఎంపిక చేసిన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరికి ఆర్. కృష్ణయ్య అభినందనలు తెలిపారు.

## సజ్జలపై తొందరపాటు చర్యలొద్దు: హైకోర్టు

>>దాఖలు చేశారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తమను వేధిస్తున్నారని సజ్జల ఆరోపించారు. ముఖ్యంగా, తనపై 41ఎ నోటీసులకు అవకాశం లేని సెక్షన్లతో కేసులు పెట్టి అరెస్ట్‌చేయాలని ప్రయత్నిస్తున్నారని వివరించారు.అందుకే తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని సజ్జల కోర్టును కోరారు. ఈ పిటిషన్‌పై ఉన్నత న్యాయస్థానం నేడు విచారణ చేపట్టింది. ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు గతఆదేశాలను మరోరెండువారాలు పొడిగించింది.తదుపరివిచారణను రెండువారాలకు వాయిదా వేసింది.

## ఎన్‌హెచ్30పై కారు దగ్ధం

>> వారోత్సవాలు ఉండటంతో ఎటువంటి అవాంచ నీయ ఘటనలు జరగకుండా డిశంబర్1 నుంచే జాతీయ రహదారి యన్.హెచ్.30పై రాత్రి సమయంలో రాకపోకలను పోలీసులు పూర్తి స్థాయిలో నిలిపివేశారు.ఎటపాక మండలం నెల్లిపాక వద్ద పోలీసులు,సిఆర్‌పియఫ్ బలగాలు విధులు నిర్వహిస్తూ భద్రాచలం వైపు నుంచి చింతూరు వచ్చే అన్ని వాహనాలను వయా కూనవరం వైపుగా మళ్ళిస్తున్నారు.చింతూరు మండలం చట్టి సమీపంలో కూనవరం జంక్షన్ వద్ద చింతూరు పోలీసులు పోలీస్ పికెట్ ఏర్పాటు చేసి చింతూరు వైపు నుండి జాతీయ రహదారిపై భద్రాచలం వైపు వెళ్ళే అన్ని వాహనాలను కూనవరం మీదుగా భద్రాచలం వెళ్ళవలసిందిగా సూచిస్తున్నారు.రాత్రి సమయంలో తిరిగే అన్ని బస్సు సర్వేసులను నిలిపివేశారు.అయినా చింతూరు మండలం సర్వేల వద్ద మావోయిస్టులు కారును దగ్ధం చేయటం,ఘటన స్థలం వద్ద ఎటువంటి లేక దొరకకపోవటం,కారుకు సంబంధించి ఏ వ్యక్తులు కూడా ఇప్పటి వరకు ఎటువంటి సమాచారం తెలియకపోవటం,ఘటన స్థలంలో కారు డీజిల్ ట్యాంక్ మూత తీసి అందులో డీజిల్‌తో కారును దగ్ధం చేసినట్టు స్పష్టం అవుతుంది.కారులోకి రోడ్డు ప్రక్కన ఉండే మొద్దులు వేసి కారును దగ్ధం చేయటం సంచలనంగా మారింది.కారుకు సంబంధించిన ఎటువంటి ఆనవాళ్ళు అక్కడ లభించలేదు.మావోయిస్టుల పనే అయితె గత ఏడాది డిశంబర్ 20న ఇదే జాతీయ రహదారిపై వీరాపురం వద్ద కారును దగ్ధం చేసిన మావోయిస్టులు కరపత్రాలను ఆ ప్రాంతంలో వెదజల్లారు.కాని సర్వేల వద్ద జరిగిన ఘటన స్థలంలో ఎటువంటి ఆనవాళ్ళు లభించలేదు. కారు నెంబర్ కాని,ఎటువంటి వివరాలు లేకపోవటంతో పోలీసులు ఇంజన్ నెంబర్ సహాయంతో చిరునామా తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. చింతూరు వైపు నుంచి భద్రాచలం వెళ్ళే వాహనాలు జాతీయ రహదారిపై వెళ్ళకుండా ,కూనవరం మీదుగా వెళ్ళలని సూచిస్తున్నా ఈ ప్రాంతంలో రహస్య రహదారులపై అవగాహన ఉన్న కొందరు చట్టి వద్ద రెడ్‌క్రాస్ భవనం వెనకవైపు నుంచి ఉన్న రోడ్డు మీదుగా జాతీయ రహదారిపైకి సింగనగూడెం వద్ద ప్రవేసిస్తున్నారు.మరో రహదారి ఛత్తీస్‌ఘడ్‌లోని కుంటకు సమీపంలో ఉన్న చిడుమూరు మీదుగా వయా బుర్కనకోట నుండి జాతీయ రహదారి మీదకు వచ్చి భద్రాచలం వైపు వెళ్ళుతున్నారు. ఈ రెండు మార్గాల్లో వెళ్ళే వాళ్ళు పోలీసుల ఆదేశాలను దిక్కరించి ,కూనవరం మీదుగా వెళ్ళ లేక,పోలీసుల కూనవరం చెక్‌పాయింట్‌కు సంబంధంలేని ప్రాంతం నుంచి ప్రయాణిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఈ ఘటన చోటుచేసుకుంది. కారులో ప్రయాణిస్తున్న వ్యక్తులు ఎంతమంది. వాళ్ళు ఎక్కడ ఉన్నారు.భయంతో పారిపోయారా లేక కారును దగ్ధం చేసిన మావోయిస్టులు వారిని అపహరించారా?,కారు ఇన్సురెన్స్ కోసం ఏమైనా కారుకు సంబంధించిన వ్యక్తులే ఏమైనా దగ్ధం చేశారా? అనే అనుమానాలతో అనేక కోణాల్లోపోలీసులు కూపిలాగుతున్నారు. పోలీసు బలగాలు హై అలర్ట్ ప్రకటించాయి. సాయంత్రం 5గం॥లనుంచే జాతీయ రహదారిపై వాహనాలు వెళ్ళకుండా నిలిపివేశారు.నిత్యం వందలాది వాహనాలతో కళకళలాడే జాతీయ రహదారిపై ఒక్క వాహనం కూడా లేకపోవటంతో నిశబ్ద వాతవరణం నెలకొంది.ఇది తాజా పరిస్థితి.

## సచివాలయంలో ఆశ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

### ఎంఎల్‌హెచ్‌పి వేధింపులతో తీవ్ర మనస్థాపం

**ఉరవకొండ, డిసెంబరు 10 ప్రభాతవార్త:** అనంతపురం జిల్లా ఉరవకొండ పట్టణంలోని లక్ష్మీనరసింహ కాలనీలోగల సచివాలయం-5 పరిధిలో పనిచేసే శర్మస్‌బీ అనే ఆశ కార్యకర్త మంగళవారం సచివాలయంలోనే ఆత్మహత్యాయత్నం చేయడం కలకలం రేపింది. సాయంత్రం సచివాలయంలో ఉద్యోగులందరూ చూస్తుండగానే ఆమె వివిధ రకాల మాత్రలు మింగి ఆత్మహత్యా యత్నం చేసి కుప్పకూలిపోగా తోటి ఉద్యోగులు ఆమెను స్థానిక ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. బీపీ మీటర్ కనబడకుండా పోయినప్పటి నుంచి అదే సచివాలయం పరిధిలో పనిచేసే ఎంఎల్‌హెచ్‌పీ శర్మస్‌బీను ఇష్టారాజ్యంగా తిడుతూ అందరి ముందు అవమానపర్చేలా వ్యవహరిస్తుండటం, మంగళవారం కూడా ఇదే విషయమై దూషించడంతో తీవ్ర మనస్థాపంతో ఆమె ఆత్మహత్యా యత్నం చేసినట్లు తోటి ఆశ కార్యకర్తలు మీడియాకు తెలిపారు. ఆత్మహత్యా యత్నం చేసిన శర్మస్‌బీ ప్రస్తుతం కోలుకొంటుండగా ఘటనపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు విచారణ చేపట్టినట్లు తెలిసింది. పోలీసులు బాధితురాలి స్టేట్‌మెంట్ రికార్డు చేసినట్లు సమాచారం.

## నేడు,రేపు కలెక్టర్ల సమావేశం

### ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండో సారి

**విజయవాడ, డిసెంబరు 10,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో బుధవారం నుంచి రెండు రోజుల పాటు కలెక్టర్ల సమావేశం జరగనుంది. వెలగపూడి సచివా లయంలో సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన బుధ,గురువారాల్లో ఈ సదస్సు జరగనుంది. ఆరు నెలల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్, నూతనంగా తీసుకొచ్చిన పాలసీలు, వంటి అంశాలపై సీఎం దిశానిర్దేశం చేయనున్నారు. రానున్న నాలుగున్నరేళ్ల ఏ విధమైన లక్ష్యాలతో ముందుకెళ్లాలన్న అం శంపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. 26 జిల్లాల కలెక్టర్లు, 40 శాఖల అధిపతులతో జరిగే ఈ సదస్సులో వారి అభిప్రాయాలను సీఎం తెలుసుకోనున్నారు. అయితే గత ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం ఒకే ఒకసారి మాత్రమే కలెక్టర్లతో సమా వేశం నిర్వహించగా కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ ఆరు నెలల్లోనే రెండవ సారి సమావేశం నిర్వహిస్తోంది.

## ముఖ్యమంత్రితో రాధా భేటీ

>> న్నారనే ప్రచారం జరిగింది.అనుహ్యంగా ఆ సీటు ఆయనకు దక్కలేదు,ఈ క్రమంలో జనసేన రాజ్యసభ సీటుకు పోటీకి రాకపోవడంతో నాగేంద్రబాబు ఏపీ కేబినెట్‌లో బెర్తు ఖాయం చేసినట్లు చంద్రబాబు ప్రకటించారు.ఈ అంశంపై రాధా ఏ విధంగా స్పందించకపోగా, అధిష్టానం అవసరాన్ని బట్టి తనను వినియోగించుకుంటుందని ఈ విషయంలో తనకు ఎటువంటి ఇబ్బంది లేదని తెలికగా తీసివేసారు.అయితే రాధాకు ప్రభుత్వపరంగా బాధ్యత అప్పగించడం బాగుంటుందనే అభిప్రాయం మంత్రి నారా లోకేష్ సీఎం చంద్రబాబు వద్ద వ్యక్తం చేసినట్లు ఈ ఉదయం కథనాలు విస్తృతంగా ప్రచారంలోకి వచ్చాయి.ఈ పరిణామాలనడుమ రాధాను సీఎంవోకు పిలిపించడం రాధా వర్గీయుల్లో ఆశ్చర్యం కలిగిస్తోంది,ఆయనను ఎందుకు సీఎం పిలిపించి మాట్లాడారనే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు.రాధా సేవలు పార్టీకి, ప్రభుత్వానికి అవసరమని చంద్రబాబు వారిద్దరి భేటీలో వ్యాఖ్యానించినట్లు కథనం.

## ఆర్జీవీకి ముందస్తు బెయిలు

>> చేశారు. ఈ క్రమంలో ప్రస్తుతం ఏపీ హైకోర్టు మాత్రం. కీలక ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆర్జీవీపై నమోదైన కేసులపై ముందస్తు బెయిల్ ఇస్తు ఏపీ హైకోర్టు తాజాగా, ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తోంది. అయితే అప్పుడెప్పుడో తాను మాట్లాడిన మాటలపై వారు స్పందించకుండా మరేవరో స్పందించి ఫిర్యాదులు చేయడం ఏంటని ఆర్జీవీ ఫైర్ అయ్యారు. దీని వెనకాల ఎవరో ఉన్నారని మండిపడ్డారు. అంతేకాకుండా తాను ఆన్‌లైన్ లో పోలీసుల ఎదుట హాజరవుతానని చెప్పారు.

# ఒక 'మోడల్ కాలనీ'

>> అవసరమైన నిధులు పై వెంటనే నివేదికను తయారు చేయాలని,ఆ నివేదిక ప్రకారం ఈ కాలనీల అభివృద్ధికి అవసరమైన నిధులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరుకు ప్రయిత్నం చేద్దామని మంత్రి తెలియజేశారు.ప్రస్తుతం ప్రతి లబ్ధిదారునికి తక్కువ వడ్డీకి ఇస్తున్న 35 వేల రూపాయలు రుణాన్ని లక్ష రూపాయలకు పెంచేవిధంగా ప్రణాళిక తయారు చేయాలని మంత్రి ఆదేశించేరు.లబ్ధిదారుకులకు ఇళ్ళ నిర్మాణాలలో ఇసుక,ఇతర సామాగ్రికి ఏవిధమైన ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాలని మంత్రి సూచించేరు. ఇప్పటికే నిర్మాణాలు ప్రారంభించిన ఇళ్లను త్వరగా పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని,సకాలంలో గృహనిర్మాణాలు పూర్తికాకపోతే భవిష్యత్తులో ఇల్లు మంజూరు కానీ పరిస్థితి ఉన్నందున లబ్ధిదారులకు అధికారులు అవగాహన కల్పించాలని మంత్రి శ్రీ పార్ధ సారధి కోరేరు.పిఎంవై2 పథకం కింద ఇళ్ళు నిర్మించటానికి కేంద్రంతో ఒప్పందం పూర్తీ అయినందున లబ్ధిద్దరులను ఎంపిక చేయటానికి చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. అధికారులు నిత్యం కాలనీలలో పర్యటిస్తూ ఇళ్ళ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలని మంత్రి శ్రీ పార్ధసారథి ఆదేశించేరు.

**నాణ్యతకు అధిక ప్రాధ్యాన్యత:** గృహనిర్మాణాలులో నాణ్యతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని,నిర్మాణాలులో ఉపయోగించే ఇసుక సిమెంట్ స్టీల్ తదితర సరుకులలో నాణ్యత ఉండాలని లాబ్ లలో పరిక్షలు నిర్వహించాలని మంత్రి సూచించేరు.పెద్ద కాలనీలలో డ్రోన్లద్వారా నాణ్యతను పరిశిలించాలని మంత్రి సూచించారు.లబ్ధిదారులకు నిర్మాణా సామాగ్రి అందుబాటులో ఉంచాలని, నిర్మాణ సామగ్రి దుర్వినియోగం కాకుండా చూడాలని ఆయన అన్నారు.అదేవిధంగా లబ్ధిదారులకు సకాలంలో నిధులను విడుదల చేయాలని మంత్రి ఆదేశించేరు, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రాజబాబు రాష్ట్ర రాష్ట్రంలో నిర్మాణాల పురోగతిని మంత్రికి వివరించారు ఈ సమావేశంలో గృహ నిర్మాణ సంస్థ చీఫ్ ఇంజనీర్ జ్రీవి ప్రసాద్ సూపరిడెంట్ ఇంజనీర్లు నాగభూషణం, జయ రామాచారి తదితర అధికారులు పాల్గొన్నారు.

## వీధికెక్కిన 'మంచు' జగడం

>> కనిపించడం తెలిసిందే.అయితే మంగళవారం ఉదయం నుంచి పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. మొదట జల్‌పల్లి ఫాం హౌస్ వద్ద విష్ణు, మనోజ్ తరపున వచ్చిన బౌన్సర్లు గొడవకు దిగారు. అయితే పోలీసులు ఇరువర్గాలను సము దాయించారు. దీని తరువాత మంచు మనోజ్ తన సతీమణి మౌనికారెడ్డితో కలిసి కారులో నేరుగా డిజిపి కార్యాలయంలో అదనపు డిజి (శాంతి భద్రతలు) కలిసి తనకు భద్రత కల్పించాలని కోరారు. ఆ తరువాత నేరుగా కారులో జల్‌పల్లిలోని మోహన్ బాబు ఫాం హౌస్‌కు వెళ్లగా అక్కడి సెక్యూరిటీ సిబ్బంది గేట్లు తెరిచేందుకు ని రాకరించారు. దీంతో మనోజ్ కారుదిగి సెక్యూరిటీ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఏడు నెలల తమ కుమార్తె ఇంట్లో వుందని మోనిక ఆందోళన వ్యక్తం చేసినా సె క్యూరిటీ సిబ్బంది పట్టించుకోలేదు. దీంతో మంచు మనోజ్ తన బౌన్సర్లతో గేట్లను బద్దలు కొట్టుకుంటూ లోపలికి వెళ్లాడు. ఇదే సమయంలో మోహన్ బాబు వెంట వుండే సెక్యూరిటీ సిబ్బంది మనోజ్ బౌన్సర్లను అడ్డుకోవడంతో పాటు వారిని నెట్టివేశారు. ఈ సమయంలో మీడియా సిబ్బంది అక్కడ జరుగుతున్న ఘటనల వివరాలను సేకరించేందుకు రాగా మోహన్ బాబు ఒక్కసారిగా వారిపై ధూషణలకు పాల్పడుతూ ఇష్టానుసారం రెచ్చిపోయి దాడికి పాల్పడ్డారు. మోహన్ బాబు దాడిలో రెండు ఛా నళ్ల విలేఖరులకు గాయాలు తగలగా వారి కెమెరాలు ధ్వంసం అయ్యాయి. దీంతో జల్‌పల్లిలోని ఫాం హౌస్‌లో ఒక్కసారిగా ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనడంతో పహాడి షరీఫ్ పోలీసులు వెంటనే ఘటనా స్థలికి చేరుకుని మోహన్ బాబు, మనోజ్‌ల బౌన్సర్లను ఫాం హౌస్ నుంచి బయటకు తరలించారు. కాగా అటు మోహన్ బాబు ఇటు మనోజ్‌లు ఇచ్చిన ఫిర్యాదులపై పహాడి షరీఫ్ పోలీసు స్టేషన్‌లో తండ్రీ కొడుకులు మోహన్‌బాబు, మనోజ్‌లపై మంగళవారం రెండు కేసులు నమోదు చేశారు. మోహన్‌బాబు ఫిర్యాదుతో మంచు మనోజ్, అతని భార్య భూమా మౌనికపై ఐపిసి 329, 351(బీ.ఎన్.ఎస్ ) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అలాగే మనోజ్ ఫిర్యాదు మేరకు మోహన్‌బాబు అనుచరులపై 329, 351, 115(బీ.ఎన్.ఎస్) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఇదిలాఉంటే.. మంగళవారం ఉదయం మంచు విష్ణు దుబాయి నుంచి హైదరాబాద్ చేరుకున్నారు. జల్‌పల్లిలోని ఇంటికి వెళ్లే మార్గమధ్యంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తమ కుటుంబంలో చిన్నపాటి సమస్యలు తలెత్తాయని, త్వరలోనే అన్నీ పరిష్కారం అవుతాయని విష్ణు అన్నారు. **మౌనికతో పెళ్లి ఇష్టంలేదు:** మంచు ఫ్యామిలీ గొడవలపై మోహన్‌బాబు ఫాంహౌస్‌లో పనిచేసే మహిళ చెప్పిన విషయాలు ఏమిటంటే...మోహన్‌బాబు, మంచు మనోజ్ గొడవపడ్డారు.. తండ్రీ కొడుకులు నెట్టుకున్నారు. మనోజ్‌కు దెబ్బలు తగల్లేదు. ఈ నేపథ్యంలో మంచు లక్ష్మీ వచ్చి నచ్చచెప్పారు. అని పనిమనిషి చెప్పడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

# 17న రాష్ట్రపతి రాక

>> మధ్యాహ్నం 12.05 గం.లకు మంగళగిరి ఎయిమ్స్ కు చేరుకుని అక్కడ జరిగే ఎయిమ్స్ ప్రథమ స్నాతకోత్సవంలో పాల్గొన్న అనంతరం గన్నవరం విమానాశ్రయం నుండి తిరిగి ప్రయాణం అవుతారని తెలిపారు. భారత రాష్ట్రపతి పర్యటనలో రాష్ట్ర గవర్నర్,రాష్ట్ర ముఖ్యమంత్రి,కేంద్ర,రాష్ట్ర మంత్రులు తదితర ప్రముఖులు పాల్గొనున్నందున అందుకనుగుణంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులను సిఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదేశించారు.

THE GOVERNMENT OF BODOLAND

Results of 10/12/2024

M.R.P. ₹.2/-

Bodoland Territorial Council Secretariat, KOKRAJHAR

| FUTURE SERIES Dr No:24 | |
|---|---|
| 1st Prize Rs.100000/- | 097661 |
| 2nd Prize Rs.7000/- | 38678 |
| 3rd, 4th, 5th, 6th Prizes | [illegible] |

| SINGAM SERIES Dr No:24 | |
|---|---|
| 1st Prize Rs.100000/- | 456392 |
| 2nd Prize Rs.7000/- | 57168 |
| 3rd, 4th, 5th, 6th Prizes | [illegible] |

| DEAR SERIES Dr No:24 | |
|---|---|
| 1st Prize Rs.100000/- | 739142 |
| 2nd Prize Rs.7000/- | 70427 |
| 3rd, 4th, 5th, 6th Prizes | [illegible] |

| THANGAM SERIES Dr No:24 | |
|---|---|
| 1st Prize Rs.100000/- | 284144 |
| 2nd Prize Rs.7000/- | 50665 |
| 3rd, 4th, 5th, 6th Prizes | [illegible] |

| KUIL SERIES Dr No:24 | |
|---|---|
| 1st Prize Rs.100000/- | 025647 |
| 2nd Prize Rs.7000/- | 08315 |
| 3rd, 4th, 5th, 6th Prizes | [illegible] |

| ROSA SERIES Dr No:24 | |
|---|---|
| 1st Prize Rs.100000/- | 199291 |
| 2nd Prize Rs.7000/- | 83850 |
| 3rd, 4th, 5th, 6th Prizes | [illegible] |

| ABBLE SERIES Dr No:24 | |
|---|---|
| 1st Prize Rs.100000/- | 418346 |
| 2nd Prize Rs.7000/- | 72904 |
| 3rd, 4th, 5th, 6th Prizes | [illegible] |

| NALLANERAM SERIES Dr No:24 | |
|---|---|
| 1st Prize Rs.100000/- | 246146 |
| 2nd Prize Rs.7000/- | 72420 |
| 3rd, 4th, 5th, 6th Prizes | [illegible] |

| KUMARAN SERIES Dr No:24 | |
|---|---|
| 1st Prize Rs.100000/- | 523288 |
| 2nd Prize Rs.7000/- | 43847 |
| 3rd, 4th, 5th, 6th Prizes | [illegible] |

| VISHNU SERIES Dr No:24 | |
|---|---|
| 1st Prize Rs.100000/- | 632760 |
| 2nd Prize Rs.7000/- | 36103 |
| 3rd, 4th, 5th, 6th Prizes | [illegible] |

| SWARNALAXMI SERIES Dr No:24 | |
|---|---|
| 1st Prize Rs.100000/- | 948193 |
| 2nd Prize Rs.7000/- | 83271 |
| 3rd, 4th, 5th, 6th Prizes | [illegible] |

| LION SERIES Dr No:24 | |
|---|---|
| 1st Prize Rs.100000/- | 836781 |
| 2nd Prize Rs.7000/- | 82824 |
| 3rd, 4th, 5th, 6th Prizes | [illegible] |


## వారం - వర్జ్యం

తేది : 11-12-2024, బుధవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయనం,
హేమంత ఋతువు, శుక్లపక్షం,
ఏకాదశి రా.1.10
రేవతి ఉ.11.47
వర్జ్యం : ఉ.6.11-7.39
దు.ఉ.11.46-12.30
శుభసమయం : ఉ.6.30-7.15,
సా.5.30-6.30
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** విలాసవంతమైన జీవితాన్ని గడపాలనుకుంటారు. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం లభిస్తుంది.

**వృషభం :** ఊహించని ఒడిదుదుకులను ఒక సందర్భంలో మీలో ధైర్యానికి మీరే ఆశ్చర్యపోతారు.

**మిథునం:** ధనాదాయ మార్గాలను మెరుగుపరచుకోవడానికి విదేశాలకి వెళ్ళనవసరం లేదని భావిస్తారు.

**కర్కాటకం :** రాని మొండి బాకీల పైన దృష్టిని సారిస్తారు. వాహనం కొనుగోలు సూచనలు గోచరిస్తున్నాయి.

**సింహం:** స్నేహితులకు మీ వంతు సహాయ సహకారాలను అందిస్తారు. ఇంటా బయటా అనుకూలం.

**కన్య :** వ్రాతపూర్వక ఒప్పందాలలో ఆర్థిక వ్యవహారాలలో మధ్యవర్తిగా వ్యవహరించక పోవడం ఉత్తమం.

**తుల :** ఎంతోకాలం మీరు అనుకుంటున్న విధంగా ఒక కొత్త గ్రంథ రచనకు పూనుకుంటారు.

**వృశ్చికం:** ప్రయాణాలకు అనుకూలమైన సమయం కాదు. శ్రమానంతరం కాంట్రాక్టులు దక్కుతాయి.

**ధనుస్సు:** కళాసాహిత్య సాంస్కృతిక సినీరంగాలలోని వారు వ్యూహాత్మకంగా వ్యవహరించడం మంచిది.

**మకరం:** ప్రకృతి వైద్యం పట్ల మక్కువ చూపుతారు. జీవిత భాగస్వామితో స్వల్ప విభేదాలు ఏర్పడుతాయి.

**కుంభం:** పిల్లలకు పెంపుడు జంతువులను బహుమతిగా ఇచ్చే సూచనలు ఉన్నాయి.

**మీనం :** గతంలో దూరమైన వారు తిరిగి మీకు చేరువ అయ్యే సూచనలు ఉన్నాయి. ధనలాభం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



కృష్ణాతరంగ్ అంతర కాలేజీ యువజనోత్సవ వేడుకలు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

## యువతలోని ప్రతిభాపాటవాలకు విద్యార్థి దశ నుంచే పునాది

### మంత్రి కొల్లు రవీంద్ర

**- కృష్ణాతరంగ్ అంతర కాలేజీ యువజనోత్సవాలు ప్రారంభించిన మంత్రి**

**విజయవాడ,డిసెంబరు 10,ప్రభాతవార్తప్రతినిధి:** యువతలోని ప్రతిభాపాటవాలు వెలుగులో రావాలంటే అందుకు విద్యార్థి దశ నుంచే పునాది పడాలని ఏపీ ఎక్సైజ్‌శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.సాంస్కృతిక కళలు,క్రీడా నైపుణ్యతను పెంచడానికి తమ ప్రభుత్వం సీఎం చంద్రబాబు నేతృత్వంలో స్థిరచిత్తంతో పనిచేస్తోందన్నారు. విజయవాడ కాకరపర్తి భావనారాయణ కాలేజీలో కృష్ణాతరంగ్ అంతర కాలేజీ యువజానోత్సవ వేడుకలు మంత్రి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలనతో ఘనంగా ప్రారంభమయ్యాయి. యువతలో ఉన్న కళలను బయటకు తీయడం, ప్రోత్సహించడంలో యువజా నోత్సవాల పాత్ర చాలా కీలకం 2008లో కృష్ణా యూనివర్శిటీ ఏర్పాటు చేసుకోవడం, నా నియోజక వర్గంలో ఉండటం ఆనందంగా ఉంది కృష్ణా యూనివర్సిటీలో మెరుగైన సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. యువతలో ఉన్న కళలపై ఉన్న ఆశక్తిని ప్రపంచానికి చాటి చెప్పే అవకాశం ఈ కార్యక్రమం ద్వారా కలిగింది. రాష్ట్ర యువతకు మెరుగైన ఉద్యోగ ఉపాధి కల్పించాలని ప్రభుత్వం తాపత్రయ పడుతోంది. గత ఐదేళ్ల విద్యా వ్యవస్థ అధ్వాన్నంగా తయారైంది. అందుకే ఇప్పుడు విద్యార్థులకు అన్ని రకాలుగా సహకరించి విద్యా పరంగా అండగా నిలవాలని నిర్ణయించాం. గతంలో క్రీడల మంత్రిగా పని చేశాను. యువత క్రీడలు, కళలపై ప్రత్యేక శ్రద్ధ చూపేలా ప్రోత్సహించాను. యువతలో ఉన్న స్కిల్ అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. యువతలో స్కిల్ డెవలప్మెంట్ చేయాలని అనుకుంటు న్నామన్నారు ప్రతి విశ్వ విద్యాలయంలో క్రీడా.సాంస్కృతిక రంగాలకు సంబంధించి ఏపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. భారతీయ సంప్రదాయక కళల పరిరక్షణ బాధ్యత యువతపై ఉందన్నారు. ఆధునీక నాట్యాల కన్నా సంప్రదాయ నాట్యరీతులైన కూచిపూడి,భారత నాట్యం,ఆంధ్ర నాట్యం వంటి అపూర్వమన్నారు. సాంస్కృతిక ప్రక్రియలు ఉత్తేజాన్ని అందిస్తాయన్నారు.



## గోవా మద్యం డంప్ పై ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం

**- దీని వెనుక ఎవరున్నారన్నది నిగ్గు తేల్చాలి**

**అనంతపురం, డిసెంబర్ 10, (ప్రభాతవార్త బ్యూరో)** రాప్తాడు రైల్వే గేట్ సమీపంలోని ఒక తోటలో భారీగా గోవా మద్యం డంపు దొరకడంపై ఎమ్మెల్యే పరిటాల సునీత తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగ మద్దయ్య, అసిస్టెంట్ కమీషనర్ మునిస్వామితో ఎమ్మెల్యే సునీత ఫోన్లో మాట్లాడారు. అసలు గోవా నుంచి మద్యం ఎలా వచ్చింది... ఇక్కడ ఎవరెవరు డంప్ చేశారు... దీని వెనుక ఉన్న సూత్రధారులు, పాత్ర దారులు ఎవరన్నది ఆరా తీశారా అని ఎక్సైజ్ అధికారులను ప్రశ్నించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నందున పూర్తి వివరాలు త్వరలో తెలుస్తాయని ఎక్సైజ్ అధికారులు తెలియజేసారు. సాంకేతిక వ్యవస్థను ఉపయోగించి కచ్చితంగా దీని వెనక ఉన్న సూత్రధారులు, పాత్ర దారులు ఎవరన్నది మూలాలతో సహా నిగ్గు తేల్చాలన్నారు. ఎంతటి వారైనా సరే ఉపేక్షించవద్దని ఆమె స్పష్టం చేశారు. నిష్పక్షపాతంగా విచారణ చేసి వాస్తవాలు బయట పెట్టాలన్నారు. రాప్తాడు పోలీసులు కూడా ఇలాంటి వాటిపై గట్టి నిఘా ఉంచాలన్నారు. రాప్తాడు పరిసర ప్రాంతాల్లో అక్రమ మద్యం, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూడాలని ఎమ్మెల్యే సునీత ఆదేశించారు.

# తిరుమల సమాచారం

## 17నుండి సుప్రభాతసేవ రద్దు

**- ధనుర్మాసంలో గోదాతిరుప్పావై ప్రవచనాలు**



**తిరుమల,డిసెంబర్ 10ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి మాసోత్సవాల్లో అత్యంత విశిష్టమైన ధనుర్మాసం ఈనెల 16వతేదీ నుండి ప్రారంభం కానుంది. ఆ రోజు ఉదయం 6.57 గంటలకు ధనుర్మాసఘడియలు మొదలు కానున్న నేపథ్యంలో ఈనెల 17వతేదీ మంగళవారం నుండి వేకువజామున తిరుమల వేంకటేశ్వరునికి నిర్వహించే సుప్రభాతసేవ రద్దుచేశారు. ఆ సేవ స్థానంలో గోదాదేవి తిరుప్పావై ప్రవచనాలు నివేదిస్తారు. తిరుప్పావైతోనే నెలరోజులు తిరుమల ఆలయంలో ఆలయ అర్చకులు,పండితులు స్వామివారిని మేల్కొలుపుతారు. 2025 జనవరి 14వతేదీ మంగళవారంతో ధనుర్మాసఘడియలు ముగుస్తాయి. ధనుర్మాసం పురస్కరించుకుని తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి నిత్యకైంకర్యాలు నిర్వహిస్తారు. బిల్వపత్రాలతో సహస్రనామార్చన చేస్తారు. శ్రీవిల్లిపుత్తూరు చిలుకలను ప్రతి రోజూ స్వామివారికి అలంకరిస్తారు. ధనుర్మాసం సందర్భంగా శ్రీవారికి విశేష నైవేద్యాలుగా దోశ,బెల్లందోశ,సుండలు,సీరా,పొంగల్ వంటి ప్రసాదాలను నివేదిస్తారు. ధనుర్మాసానికి విశేష ప్రాధాన్యం ఉంది. దేవతలు సూర్యోదయానికి ఒకటిన్నర గంటముందుగా నిద్రలేచి బ్రహ్మ ముహూర్తంలో శ్రీమహావిష్ణువును ప్రత్యేకంగా ప్రార్థిస్తారు. ఈ మాసానికి సౌరమానంలో ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. 12మంది ఆళ్వార్లలలో ఆండాళ్(గోదాదేవి)ఒకరు. ఈమెను నాచియార్ అని కూడా పిలుస్తారు. శ్రీవేంకటేశ్వరస్వామిని స్తుతిస్తూ ఆండాళ్ రచించిన 30 పాశురాలను కలిపి తిరుప్పావై అంటారు. ఆళ్వార్ దివ్యప్రబంధంలో తిరుప్పావై ఒకభాగం, ఈ తిరుప్పావై పఠనం ఆలయంలో నెలరోజులు పూర్తిగా ఏకాంతంగా జరుగుతుంది.

## 15న వెంకన్న ఆలయంలో కార్తీకదీపం



**తిరుమల,డిసెంబర్ 10ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన పౌర్ణమి ఘడియల్లో కలియుగవైకుంఠవాసుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో 15వతేదీ ఆదివారం సాయంత్రం కార్తీకదీపోత్సవాలు వెలిగిస్తారు. ప్రతి ఏటా కార్తీకదీపాలను శ్రీవారి ఆలయంలో ఆగమోక్తంగా వేడుకగా జరిపిస్తారు. సాయంత్రం నిత్యకైంకర్యాలు ముగిసిన తరువాత ఆలయంలో నేతిదీపాల వత్తులతో ఆలయ అర్చకులు,అధికారులు శాస్త్రోక్తంగా ఛత్రచామర ,మంగళవాయిద్యాల నడుమ ఈ నేతిదీపాలు వెలిగిస్తారు. తొలుత ఆలయంలోపల సన్నిధి నుండి బంగారువాకిలిలోపల కులశేఖరపడి, రాములవారిమేడ, ద్వారపాలకులు, బంగారువాకిలి, వెండివాకిలి, యోగనరసింహ స్వామి ఆలయం, వరదరాజస్వామి సన్నిధి, ధ్వజస్తంభం, మహద్వారం, రంగనాయకుల మండపం, అఖిలాండం, బేడి ఆంజనేయస్వామి ఆలయం, పుష్కరిణి పరిసరాల్లో నేతి దీపాలు వెలిగిస్తారు. అనంతరం ఆలయంలోపల స్వామివారికి విశేష పూజలు, హారతి ఇస్తారు. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం సహస్రదీపాలంకార సేవ రద్దయ్యింది.

## 15న దత్తజయంతి మహోత్సవం

**- మొగలిచెర్ల మందిరంలో విశేషపూజలు**

**తిరుపతి,డిసెంబర్ 10ప్రభాతవార్తప్రతినిధి:** మార్గశిరమాసం పౌర్ణమిఘడియల్లో ఆదివారం 15వతేదీ దత్తజయంతి మహోత్సవం నిర్వహిస్తున్నారు. నెల్లూరుజిల్లా లింగసముద్రం మండలం మొగలిచెర్లగ్రామంలో కొలువైన అవధూత దిగంబర దత్తాత్రేయమందిరంలో ఈ ప్రత్యేక కార్యక్రమాలు ఉదయం 5గంటల నుండి రాత్రి పల్లకీసేవ వరకు జరగనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్‌తెలిపారు. ఆదివారం ఉదయం 5గంటల నుండి మందిరంలో బృందావన అభిషేకం, 11రకాల భోగ హారతులతో విశేష ప్రభాతసేవ జరుగుతుంది. ఉదయం 9.30గంటల నుండి దత్తహోమం, రాత్రి 7గంటలకు పల్లకీసేవ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులకు ఆరోజు మధ్యాహ్నం, రాత్రి అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు. భక్తులు విశేష పూజలకు 9908973699,9948742865నంబర్లకు సంప్రదించ వచ్చన్నారు.

## జనవరి 10నుండి వైకుంఠద్వార దర్శనం

**తిరుమల,డిసెంబర్ 10ప్రభాతవార్తప్రతినిధి:** ప్రముఖ వైష్ణవాలయాలలో వైకుంఠద్వార దర్శనాలకు సమయం సమీపిస్తోంది. పవిత్రమైన ధనుర్మాసంలో వచ్చే ఏకాదశిని వైకుంఠ ఏకాదశిగా, ద్వాదశిని వైకుంఠద్వాదశిగా ప్రసిద్ధి. కలియుగవైకుంఠం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో మోక్షమార్గం వైకుంఠద్వారం రానున్న జనవరి 10వతేదీ తెల్లవారుజామున 1.45గంటలకు తెరచుకోనుంది. రానున్న ఏడాదిలో కూడా పదిరోజులుపాటు వైకుంఠద్వారం తెరచి భక్తులకు మోక్షమార్గం దర్శనం చేయించేలా టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. పదిరోజులపాటు దాదాపు 7లక్షలమంది భక్తులు ఆరోజుల్లో వైకుంఠద్వార దర్శనం చేసుకునేలా తిరుమల తిరుపతి దేవస్థానం ఏర్పాట్లు చేయనుంది. జనవరిలో వైకుంఠద్వారం తెరచి ఉంచే 10వతేదీ నుండి జనవరి 19వరకు పదిరోజుల పాటు ఎలాంటి సిఫార్సులేఖలు స్వీకరించరు. దర్శన టిక్కెట్, టోకెన్లు లేని భక్తులను ఆలయంలోపలకు అనుమతించరు. రాజ్యాంగ పరిధిలోని ప్రోటోకాల్ విఐపిలు స్వయంగా వస్తేనే పరిమితంగా బ్రేక్ దర్శనాలు జారీ చేస్తారు. ప్రత్యేక దర్శనాలు చంటిపిల్లలు, దివ్యాంగులు,వృద్దులు, ఎన్ఆర్ఐలు అన్ని ప్రత్యేక దర్శనాలు రద్దుచేశారు. వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శనం, శ్రీవాణి ట్రస్ట్, తిరుపతిలో ఆఫ్‌లైన్‌లో టోకెన్లు జారీచేయనున్నారు.

పవిత్రమైన ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన జనవరి 10వతేదీ శుక్రవారం ఉదయం 9గంటల నుంచి 10గంటల వరకు స్వర్ణరథం జరుగుతంది. శ్రీదేవిభూదేవి సమేతంగా మలయప్పస్వామి వారు విశేష అలంకరణలో స్వర్ణరథాన్ని అధిరోహించి ఆలయ మాఢవీదుల్లో ఊరేగనున్నారు. 11వతేదీ ద్వాదశిరోజు పవిత్ర పుష్కరిణిలో స్వామివారి చక్రత్తాళ్వార్‌కు చక్రస్నాన మహోత్సవం జరిపిస్తారు.

## తిరుపతి కేంద్రంగా బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలి

**- పార్లమెంట్‌లో తిరుపతి ఎంపి డాక్టర్ గురుమూర్తి**



**తిరుపతి,డిసెంబర్ 10ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచంలోనే హిందూ పుణ్యక్షేత్రంగా, యాత్రాస్థలంగా ఖ్యాతిచెందిన తిరుపతినగర ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని, ఇక్కడకు వస్తున్న యాత్రికుల సంఖ్యతో తిరుపతి కేంద్రంగా బాలాజీ రైల్వేడివిజన్ ఏర్పాటుచేయాలని తిరుపతి ఎంపి డాక్టర్ గురుమూర్తి కోరారు. పార్లమెంట్ సమావేశాల్లో మంగళవారం ప్రశ్నోత్తరాలు సమయంలో ఆయన తిరుపతి కేంద్రంగా బాలాజీ రైల్వేడివిజన్ ఏర్పాటుపై విజ్ఞప్తి చేశారు. తిరుపతి,తిరుమల విశిష్టతను దృష్టిలో ఉంచుకుని కేంద్రం సహాయసహకారాలు అందించాలని కోరారు. పారిశ్రామికంగా తిరుపతిజిల్లా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న సమయంలో రైల్వే డివిజన్ ఏర్పాటుతో తిరుపతి ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.

## పులి సాగర్‌పై పోలీసుల దౌర్జన్యం

**జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ మానవ హక్కుల సంఘాలకు వైఎస్సార్సీ ఫిర్యాదు**

**విజయవాడ,డిసెంబరు10,ప్రభాతవార్తప్రతినిధి:** రాజమహేంద్రవరంలో దళిత యువకుడు పులి సాగర్‌పై పోలీసులు అమానవీయంగా వ్యవహరించిన ఘటనలో బాధ్యులైన పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధిత యువకుడితో కలిసి వైయస్సార్‌సీపీ ప్రతినిధి బృందం, ఢిల్లీలో జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా, జాతీయ మానవ హక్కుల సంఘం ఛైర్‌పర్సన్ విజయభారతి సాయానీని కలిసి వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. వైయస్సార్‌సీపీ ఎంపీ గురుమూర్తి, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబురావు, పిల్లి సుభాష్ చంద్రబోస్, మాజీ ఎంపీలు మార్గాని భరత్, గోరంట్ల మాధవ్‌తో కలిసి, జాతీయ ఎస్సీ కమిషన్, ఎన్‌హెచ్ఆర్‌సీని కలిసిన పులి సాగర్, తనపై జరిగిన దౌర్జన్యాన్ని వివరించారు. నగరంలోని ఒక కాలనీలోని స్థానిక సమస్యపై సోషల్ మీడియాలో పోస్ట్ పెడితే, ప్రకాశ్‌నగర్ పోలీసులు తనను స్టేషన్‌కు పిలిపించి, అర్ధనగ్నంగా సెల్‌లో నిలబెట్టారని, పైగా అక్కడ మహిళా కానిస్టేబుళ్లను కాపలాగా పెట్టారని పులి సాగర్ తెలిపారు. తన విద్యార్హతలు, కులంతో పాటు ఇతర వివరాలతో స్టేట్‌మెంట్ తీసుకున్న తర్వాత, సీఐ ఎస్‌కె బాజీ తీవ్ర దుర్భాష లాడారని, కులం పేరుతో దూషించారని.. చివరకు హతమారుస్తామని కూడా బెదిరించారని చెప్పారు. పార్టీ ఓటమితో సైకోగా మారి, సోషల్ మీడియాలో పోస్ట్ చేశానంటూ, పోలీసులు ఒక కాగితంపై రాసి, తనతో బలవంతంగా సంతకం చేయించుకున్నారని పులి సాగర్ వెల్లడించారు. కాగా, ఫిర్యాదుల అనంతరం ఎంపీలు గొల్ల బాబూరావు, గురుమూర్తి, మాజీ ఎంపి మార్గాని భరత్ మాట్లాడుతూ, విద్యావంతుడైన దళిత యువకుడు పులి సాగర్ పట్ల రాజమహేంద్ర వరం, ప్రకాశ్‌నగర్ స్టేషన్ పోలీసులు దారుణంగా వ్యవహరించారని గుర్తు చేశారు. అధికార తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేను సోషల్ మీడియా పోస్ట్ ద్వారా ప్రజా సమస్యపై ప్రశ్నించడాన్ని నేరంగా పరిగణించారని, కేసు నమోదు సందర్భంలో చట్ట పరంగా అనుసరించాల్సిన నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించారని వారు తెలిపారు.

## కార్మికుల సంక్షేమం, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ

**కార్మిక, ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ మంత్రి వాసంశెట్టి సుభాష్**



**సచివాలయం,డిసెంబర్ 10,ప్రభాతవార్త :** రాష్ట్రంలోని కార్మికుల భద్రతకు,సంక్షేమానికి,ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తుందని రాష్ట్ర కార్మిక,ఫ్యాక్టరీలు,బాయిలర్స్ ,ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు.మంగళవారం రాష్ట్ర సచివాలయం పబ్లిసిటీ సెల్లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్మాగారాలో ల్ల ప్రమాదాల నివారణకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా వసుధా మిత్రి కమిటిని ఏర్పాటుచేశారన్నారు.ఈ కమిటి రాష్ట్రంలోని అన్ని పరిశ్రమలను పరిశీలించి,ప్రభుత్వానికి త్వరలోనే నివేదిక అందజేసే అవకాశముందని,అది అందినవెంటనే తగు చర్యలు చేపడతామన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశంతో కార్మికశాఖపై ఎప్పటిప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ ముందుకెళ్ళడం జరుగుతోందన్నారు.రాష్ట్రంలో 96డిస్పెన్సరీలు,4ప్రాంతీయ ఆస్పత్రులు,4డయాగ్నస్టిక్ సెంటర్లు ఉన్నాయన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోనికి రాగానే యలమంచిలి,గుణదలలో ఈఎస్ఐ ఆస్పత్రులను ప్రారంభించామన్నారు. అదేవిధంగా రాజధాని అమరావతిలో 150 మరియు 500పడకల ఆస్పత్రికి కర్నూలు,నెల్లూరు తదితర ప్రాంతాల్లో ఈఎస్ఐ ఆస్పత్రుల ఏర్పాటుకు కేంద్రం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిందన్నారు.త్వరలోనే ఇవి అన్నీ కార్యరూపం దాల్చేలా చర్యలు చేపడతామన్నారు.గత ప్రభుత్వ హాయాంలో సేఫ్టీ ఆడిటింగ్ ఏజెన్సీలు కలెక్షన్ ఏజెన్సీలుగా మారిపోయాయన్నారు.

## అన్నదాతకు అండగా వైఎస్సార్సీ పోస్టర్ల ఆవిష్కరణ



**అనంతపురం, డిసెంబర్ 10, (ప్రభాతవార్త బ్యూరో)** అనంతపురం రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 13వ తేదీన జిల్లా కేంద్రంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించనున్నారు."అన్నదాతకు అండగా వైఎస్ఆర్సిపి" అనే నినాదంతో ర్యాలీకి సంబంధించి పోస్టర్లును మంగళవారం అనంతపురంలో వైసిపి నేతలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకట రామిరెడ్డి, కళ్యాణదుర్గం, ఉరవకొండ, శింగనమల నియోజకవర్గాల వైసిపి సమన్వయకర్తలు తలారి రంగయ్య, విశ్వేశ్వరరెడ్డి, వీరాంజనేయులు, ఎమ్మెల్సీ మంగమ్మ, జిల్లా పరిషత్ చైర్పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం , డిప్యూటీ మేయర్ లు కోగటం విజయ భాస్కర్ రెడ్డి, వాసంతి, వైసీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు వెన్నపూస రవీంద్రారెడ్డి, వైసీపీ నేతలు చాకలి రంగన్న, బీసీ రమేష్, మదన్ మోహన్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, శ్రీదేవి, కృష్ణవేణి ఇతర వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈనెల 13న జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న వైయస్సార్ విగ్రహం వద్ద నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించనున్నారు.. ఈ కార్యక్రమం విజయవంతం కోసం వైసీపీ నేతలు సన్నాహాలు చేస్తున్నారు.. వైఎస్ఆర్సిపి నాయకులు , కార్యకర్తలు , ప్రజాప్రతి నిధులు, రైతులు, పెద్ద ఎత్తున తరలి రావాలని నేతలు పిలుపునిచ్చారు.

## ఎస్సీ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందిస్తాం

సాంఘిక సంక్షేమ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి



**విజయవాడ, డిసెంబరు 10,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోఎస్సీ సంక్షేమ పథకాలన్నీ అర్హులైన వారికి అందిస్తామని, గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ఎస్సీ సంక్షేమ పథకాలన్నింటినీ తిరిగి పునరుద్ధరిస్తామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి తెలిపారు.. విజయవాడ నాలుగవ డివిజన్ వరలక్ష్మీ నగర్ లో రూ. 80 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాలు ను మంగళ వారం మంత్రి బాల వీరాంజనేయ స్వామి ప్రారంభించారు.. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో ప్రారంభించిన కమ్యూనిటీ హాల్స్ ను జనరల్ నిధులతో పూర్తి చేసి ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.. గత ప్రభుత్వం కమిటీ హాల్స్ ను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహించారని, రాష్ట్ర వ్యాప్తంగా అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్స్ ను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు.. త్వరలోనే రాష్ట్రంలోని క్రిస్టియన్స్ అందరికీ క్రిస్మస్ కానుక అందిస్తామన్నారు. అంబేద్కర్ విదేశీ విద్యా దీవెన పథకాన్ని పునరుద్ధరిస్తామన్నారు. రాష్ట్రంలో రూ. 340 కోట్లతో నూతన ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను నిర్మిస్తామన్నారు.. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా డిసెంబర్, జనవరి నెలలోనే రుణాలు అందిస్తామన్నారు. గత ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ని మూడు ముక్కలు చేసి నిధులు అందివ్వకుండా నిర్లక్ష్యం చేశారన్నారు.. లిడ్ కాప్ కు నిధులు అందించి రుణాలు అందిస్తామన్నారు.. ఆటోనగర్ లో విలువైన భూములను అన్యాక్రాంతం చేశారని, అక్కడ పిపిపి మోడల్ లో వాటిని అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా హాస్టల్స్ రిపేరుకు రూ.140 కోట్లు కేటాయించా మన్నారు.. ఈ ఐదు నెలల పాలనలో హాస్టల్ విద్యార్థులకు కార్పొరేట్ వైద్యం అందించి, వారి ఆరోగ్యానికి కాపాడే చర్యలు తీసుకున్నా మన్నారు. అమరావతిలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహానికి స్థలం కేటాయిస్తే గత ప్రభుత్వం స్థలాన్ని మార్చి విజయవాడ స్వరాజ్ మైదానంలో ఆ విగ్రహం పెట్టారన్నారు.. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాజెక్టుకు సంబంధించి అసంపూర్తిగా ఉన్న హాల్స్ , తదితర పనులను పూర్తి చేస్తామన్నారు.. విజయవాడ నగరంలో ఉన్న హాస్టల్స్ రిపేర్ కి రూ. 42 లక్షల నిధులు కేటాయించామన్నారు. గత ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన హాస్టల్ బకాయిలను కూడా చెల్లించకుండా విద్యార్థులను పట్టించుకోలేదన్నారు.ఏ విద్యార్థిని ఇబ్బంది పెట్టకుండా డిసెంబర్ నెలలోనే బకాయిలు చెల్లిస్తామన్నారు.. నాణ్యతతో కూడిన యూనిఫామ్స్ , బ్యాగులను పాఠశాలలు ప్రారంభానికి ముందే విద్యార్థులకు అందిస్తామన్నారు.

## లోన్ యాప్ నిర్వాహకుల వేధింపులకు యువకుడు బలి

**ఫోటోలు మార్ఫింగ్, అవమానంతో ఆత్మహత్య**

**విశాఖపట్నం, డిసెంబర్ 10, ప్రభాతవార్త:** ఒక్క క్లిక్ తో లోను మీ సొంతం అంటూ ప్రచారం చేస్తున్న లోను యాప్ వలన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆధార్ కార్డు ఉంటే చాలు, సిబిల్ కూడా అక్కర్లేదు అని చెప్తూ కష్టాల్లో ఉన్నవారిని ఆకర్షించి వారి జీవితాలతో ఆటలు ఆడుకుంటున్నారు. ఫోన్ యాప్ డౌన్లోడ్ చేసుకుంటే మోసగాళ్ల చేతికి చిక్కినట్లే కాంటాక్ట్ నంబర్లు తోపాటు ఫోటోలు డేటా కూడా వారు సేకరిస్తారు. పొరపాటున లోను తిరిగి చెల్లించకపోతే ఈ డేటాతో వారి జీవితాలను నాశనం చేస్తున్నారు. ఈ కోవలోనే పెళ్లయి నెలకే తన జీవితాన్ని ఓ యువకుడు నాశనం చేసుకున్నాడు. వివరాల్లోకెళ్తే మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నరేంద్ర (21) కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. అతనికి వివాహం జరిగి 40 రోజులు గడిచింది. లోన్ యాప్ ద్వారా ఆయన కొంత లోన్ తీసుకున్నట్లు సమాచార. అయితే అందులో 2000 రూపాయలు చెల్లించలేదని కంపెనీ వారు ఫోన్ కాల్ చేసి వేధించే వారిని తెలుస్తుంది. అతను తోపాటు ఆయన భార్య ఉన్న ఫోటోలు మార్ఫింగ్ చేసి కుటుంబ సభ్యులకు పంపించడంతో వారు నరేంద్రకు సమాచారం అందించారు.

అది భరించలేని నరేంద్ర ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు మహారాణిపేట పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు అక్కడ చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సిపిఐ రెడ్ షర్ట్ వలంటీర్స్ జన సేవాదళ్ శిక్షణ శిబిరం ప్రారంభం



అరుణ పతాక ఆవిష్కరణలో సీపీఐ నాయకులు

**విజయవాడ,డిసెంబరు10,ప్రభాతవార్తప్రతినిధి:** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ శతజయంతోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న రెడ్ షర్ట్ వాలంటీర్స్ జన సేవాదళ్ శిక్షణా శిబిరాన్ని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు జిల్లా కార్యదర్శి దోనెపూడి శంకర్ తో కలిసి మంగళవారం ప్రారంభించారు ఎన్టీఆర్ జిల్లా నందిగామ సాంస్కృతిక సమావేశ ప్రాంగణంలో శిక్షణ శిబిర ప్రారంభ సూచక గా సిపిఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ పతాకాన్ని ఆవిష్కరించారు.అయ్యదేవర కాళేశ్వరరావు ట్రస్టు మైదాన ప్రాంగణానికి భారీ ర్యాలీగా చేరుకున్నారు జన సేవాదళ్ శిక్షణ శిబిరాన్ని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు ప్రతాకావిష్కరణ తో ప్రారంభించారు ఈ సందర్భంగా ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ సుదీర్ఘ ఉద్యమాల పోరాట చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ శతజయంతోత్సవాల సందర్భంగా నిర్వహించ తలపెట్టిన జన సేవదళ్ కార్యక్రమం గురించి వివరించారు ఈనెల 20 వ తారీఖున సిపిఐ పార్టీ 100వ జయంతోత్సవాల నిర్వహణలో భాగంగా ప్రజా పోరాటాలను ముమ్మరం చేస్తూ కార్మిక కర్షక సమస్యలను ఎదుర్కొంటూ డిసెంబర్ 26 వ తేదీ నాటికి 99 సంవత్సరాలు నుండి 100 వ సంవత్సరంలో అడుగెడుతున్న సందర్భంలో జరుగుతున్న ఉత్సవాలనుగా ఘనంగా నిర్వహించుకోవాలన్నారు బ్రిటిష్ వారి నుండి దేశ రక్షణకు ఎన్నో పోరాటాలు చేసామన్నారు.

## నేటి నుంచి జయంతికి రాజంపేటలో స్టాపింగ్!

**గుంతకల్లు రైల్వే,డిసెంబరు 10,ప్రభాతవార్త** రాయలసీమలోని ఉమ్మడి కడప జిల్లా రాజంపేట ప్రాంత వాసులకు ఉపశమనం కలిగించే వార్త..! ప్రజల,ప్రయాణికుల సౌకర్యార్థం తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు పూణే-కన్యాకుమారి-పూణేల మధ్య తిరిగే జయంతి జనతా ఎక్స్‌ప్రెస్‌కు దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ పరిధిలోని రాజంపేట రైల్వేస్టేషన్‌లో ఈ నెల బుధవారం నుంచి ఒక నిమిషం పాటు నిలిపేందుకు రైల్వే శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు సంబంధిత ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కన్యాకుమారి నుంచి పూణే వెళ్లే నెంబర్ 16382జయంతి జనతా డైలీ ఎక్స్‌ప్రెస్ రైలు రాజంపేటలో ప్రతిరోజు తెల్లవారుజామున 5-44/45గంటలకు బయలుదేరుతుంది. అలాగే పూణే నుంచి కన్యాకుమారి వెళ్లే నెంబర్ 16381జయంతి జనతా ఎక్స్‌ప్రెస్ అదేరోజు నుంచి మధ్యాహ్నం 1-34/35గంటలకు బయలుదేరుతుందన్నారు. ఇదిలావుండగా ఈ విషయమై స్థానిక పార్లమెంటు సభ్యుడు పివి మిథున్‌రెడ్డి రైల్వే జనరల్ మేనేజర్‌కు విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే.

వార్త

శత్రువుల నుంచి కాపాడుకోవాలంటే వాళ్లని మిత్రులుగా మార్చుకోవడమే ఉత్తమమైన మార్గం.

-స్వామి వివేకానంద

# రైతులంటే ఇంత అలుసా!?

దేశంలో ఇప్పటికీ 70 శాతం మందికి ప్రధాన వ్యాపకం వ్యవసాయమే. మిగిలిన అన్ని రంగాలనూ ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం వ్యవసాయదారుల విషయానికి వచ్చేసరికి ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. వ్యవసాయాన్ని లాభసాటిగా కాకపోయినా, కనీసం పెట్టుబడులు వచ్చినా చాలునని అల్ప సంతోషులుగా రైతులు వ్యవసాయాన్ని కొనసాగిస్తుంటే వారిపై సర్కారు వారికి ఇసుమంతైనా జాలి లేదు. ఈ విషయాలు స్పష్టంగా కనపడుతున్నవే. వ్యవసాయ రంగంలో సమూలమైన మార్పుల కోసం సుప్రసిద్ధ శాస్త్రవేత్త డాక్టర్ స్వామినాథన్ సిఫార్సులను అమలు జేస్తామంటూ బేషరతుగా కేంద్రంలో, రాష్ట్రాల్లో అధికారంలో నాయకులు మంతనాలు చేస్తుంటారే తప్ప, అమలులో ఒక్క అడుగు ముందుకు పడలేదు. ఏటా కంటితుడుపుగా మద్దతు ధరకు ప్రకటిస్తారే తప్ప, దానిని చట్టబద్ధం చేయమని రైతు అడిగితే పట్టించుకోరు. అన్నింటికన్నా మద్దతు ధర చట్టబద్ధత డిమాండ్ విషయంలోనే ఈసారి రైతులు మళ్ళీ ఉద్యమాన్ని మొదలెట్టారు. అప్పట్లో ఉద్యమించినా సంయుక్త కార్యాచరణ సమితి ఒత్తిడి మేరకు మోడీ పూర్వపు ప్రభుత్వంలో వ్యవసాయ మంత్రి నరేంద్రసింగ్ తోమార్ హామీ ఇచ్చారు. ఆయన రైతు సంఘాల కార్యాచరణ సమితి నాయకులతో పలుసార్లు చర్చలు జరిపారు. ఉత్పత్తి ధరకంటే 50శాతం అధికంగా చెల్లించాలన్న స్వామినాథన్ సిఫార్సులను అమలు జేయాలన్న రైతు నాయకుల డిమాండ్‌ను ఆమోదించలేమని గతంలోనే యూపీఏ ప్రభుత్వం స్పష్టం చేసారు. గత ఫిబ్రవరిలో రైతుల ఆందోళనకు భారత కిసాన్ యూనియన్ అధ్యక్షుడు రాకేష్ తికాయత్ నేతృత్వం వహించారు. దేశవ్యాప్తంగా రైతులు ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కొక్క సమస్యపై ఆందోళన సాగిస్తున్నారు. ఎక్కడా వారికి సంతృప్తికరమైన ముగింపు లభించలేదు. అందరి ఏకైక డిమాండ్ మాత్రం మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలన్నది. గతంలో ఆందోళన సందర్భంగా రైతు సంఘాల్లో చీలిక తేవడానికి ప్రభుత్వం ప్రయత్నించింది. తాజాగా ఆహార ధాన్యాల మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ పంజాబ్, హర్యానా సరిహద్దుల్లో శంభు వద్ద రైతులు మళ్ళీ ఆందోళన ప్రారంభించారు. చలో ఢిల్లీ నినాదంతో వారు ఈసారి ట్రక్కులు, ట్రాక్టర్లతో కాకుండా కాలినడకన బయలుదేరారు. తమ డిమాండ్ల సాధనకు రైతులు ఢిల్లీకి కొనసాగించిన పాదయాత్రను పోలీసులు మరోసారి భగ్నం చేశారు. పంజాబ్ హర్యానా సరిహద్దులో ప్రారంభించిన పాదయాత్రపై పోలీసులు బాష్పవాయు గోళాలు ప్రయోగించడంతో పలువురు గాయపడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 8 మంది వరకూ రైతులు గాయపడ్డారు. గతంలో తమ ఆందోళనకు ప్రభుత్వం దిగివచ్చి మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేసిందనీ, ఆ సందర్భంలోనే మద్దతు ధరఅంశంపై స్పష్టమైనహామీ ఇచ్చారని కిసాన్‌మోర్చా నాయకుడుసర్వన్‌సింగ్ పంధేర్ వివరించారు. కానీ అదేమీ జరగ లేదు. మాట తప్పిన ప్రభుత్వంపై మళ్ళీ పోరునకు సిద్ధమయ్యామని ఆయన ప్రకటించారు. రైతులంటే ప్రభుత్వానికి ఎంతో చిన్నచూపు ఉందన్నవిషయం ఇప్పుడు తేటతెల్లం అవుతోందని, అందుకే, తాము పదేపదే ఆందోళనలకు సిద్ధం కావల్సివస్తోందనీ పంధేర్ ప్రకటించారు. మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించకపోవడం వల్ల రైతులను వంచించడమేనని ఆయన అన్నారు. రైతులు ప్రతిసారి జరిపి ఆందోళనల ప్రభావం. ఇతర నిత్యావసర వస్తువులధరలపై కనిపిస్తోంది. ప్రభుత్వం ఎటువంటి హామీ ఇవ్వకపోవడంతో రైతులు ప్రతిసారి ఆందోళనకు దిగుతున్నారు. అంతిమంగా వినియోగదారులైన పౌరులు ఇబ్బందులకు గురి అవుతున్నారు. అయితే ఈసారి ఆందోళనలో హర్యానా పోలీసులు చాలా నాటకీయంగా వ్యవహరించారు. 101మంది రైతులు తిరిగియాత్ర ప్రారంభించగా, వారికి పోలీసులు టీ, బిస్కెట్లు పంచడం విస్మయం కలిగింది. అంతేకాకుండా వారిపై పూరేకులను కూడా చల్లడంతో రైతులు విస్తుపోయారు. అటుపై రైతులు ఢిల్లీ వైపువెళ్లడానికి ప్రయత్నించగా, అప్పటివరకు తాము ఆడిన డ్రామాకు తెరదించి పోలీసులు వారిని అడ్డుకోవడం ప్రారంభించారు. రైతులను చెదరగొట్టడానికి నిర్దాక్షిణ్యంగా బాష్పవాయు గోళాలు, జల ఫిరంగులు ప్రయోగించారు. ఈఘటనలో 8 మంది రైతులు గాయపడగా, ఒకరిని దవాఖానకు తరలించినట్టు రైతు నేత శర్వణ్‌సింగ్‌పంధేర్ తెలిపారు. పాలకులు దిగిరావాలని, చివరికి న్యూఢిల్లీ వీధుల్లో ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉన్నా తమ డిమాండ్లు నెరవేరే వరకు దీక్ష చేస్తామని రైతులు స్పష్టం చేశారు. ప్రకృతి వైపరీత్యాల వల్లవాటిల్లే నష్టాలను భరిస్తూ ఎప్పటికప్పుడుపెట్టుబడుల కోసం సొంత ఆస్తులను విక్రయించుకుంటూ వ్యవసాయన్ని వదలలేక పంటలను పండిస్తున్న రైతులకు పెద్దగా లాభాలులేకపోయినా, పెట్టుబడులైనా వచ్చేట్టుచూడటం ప్రభుత్వం కనీస ధర్మం. విపక్షాలనుంచి తమ ఆందోళనలకు సరైన వత్తాసు లభించడంలేదని రైతు సంఘాలు భావిసున్నాయి. సంయుక్త కిసాన్ మోర్చాపేరిట రైతు సంఘాలు బలమైన ముందడుగు దిశగా నడవాలనుకుంటున్నాయి. ఎన్ని రాయితీలు, భరోసా కల్పించినా మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తే చాలన్న రైతాంగపు కోరికల్ని తీర్చగలిగితే కేంద్రప్రభుత్వా నికి పోయేదేమీలేదు. మద్దతు ధర విషయంలో స్పష్టంగా ఉన్నామన్న ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించాలి. పంజాబ్, హర్యానాల నుండి ఢిల్లీపురవీధుల్లోకి ప్రవేశించడానికి వీలులేకుండా పోలీసులు ఆటంకపరచడం పట్ల రైతునేలు ఖండిస్తున్నారు.

మనిషికి నిలబడడం తేలిక, పరిగెత్తడం కష్టం. కాని మనసుకి పరుగెత్తడం తేలిక, నిలబడటం కష్టం.



మహాత్మాగాంధీ

మాటకు మాట ప్రతీకారం కాదు. మౌనమే దానికి సమాధానం.



ప్లినీ

# ప్రజావాక్కు



## ఊహా చిత్రాలే

తెలంగాణా తల్లి విగ్రహాన్నిగతంలో బి.ఆర్.ఎస్. ప్రతిష్టించినా, ఇప్పుడు కాంగ్రెసు ప్రభుత్వం కొత్త రూపంతో నిర్మించినా అవన్నీ ఊహాచిత్రాలే. దీని కోసం వివాదం ఎందుకు? మరలప్రభుత్వం మారితేవిగ్రహం రూపురేఖలు మారతాయా? ప్రస్తుతం కాంగ్రెసు వారు డిజైన్ చేసిన విగ్రహం ఆకుపచ్చ చీర, గాజులతో ఎడమ చేతిలో జొన్న, మొక్కజొన్న, వరికంకులతో, అభయహస్తం తోకుడిచేయి, మెడలోహారాలతో చక్కగానే మలచారు. కాళ్లకు పట్టాలు, కాలివేళ్లకుమెట్టెలు పెట్టినిండు ముత్తైదువుగా అలంకరణ చేసినప్పుడుమెడలోమంగళసూత్రం కూడా ఉంటే ఇంకా శోభాయమానంగా ఉండేది.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ఠ?

మన రాష్ట్ర శాసనసభ నుంచి మూడు రాజ్యసభ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్న సందర్భంగా అభ్యర్థుల ఎంపికలో కూటమి భాగస్వామ్య పక్షం బిజెపి అభ్యర్థిగా తెలంగాణా రాష్ట్రానికి చెందిన బీసీ నేత ఆర్.కృష్ణయ్య ఎంపిక దిగజారుడురాజకీయాలకుపరాకాష్ట అని చెప్పాలి! ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి యోగ్యత కలిగిన ఒక్క బీసీ నేత కూడా ఆ పార్టీకి లేదనుకోవాలి? ఆర్ కృష్ణయ్య గారికి కనీసం బిజెపిపార్టీ సభ్యత్వం కూడా లేదు. గతంలో ఆయన రాజ్యసభలో ఏ ఒక్కసమస్య గురించి ప్రస్తావించిన దాఖలాలు కూడా లేవు? ఒక రకంగాఆయన ఎంపిక రాష్ట్ర ప్రజలను మరోసారి అవమా నించడమే!

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు,ఏలూరు జిల్లా

## బడిలో నీరు సురక్షితమేనా ?

బడి ఈడు పిల్లలందరూ బడికి వెళ్లాలని, వారికి ఉచిత నిర్బంధవిద్యఅందించాలని విద్యాహక్కు చట్టం చెబుతుంది. మధ్యాహ్న భోజనాన్నివండి పెట్టే బాధ్యతలను ఏజెన్సీలకు అప్పగించారు. అలాగే విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందజేసేందుకు నాడునేడు పథకం కింద శుద్ధ జలం ప్లాంట్లు ఏర్పాటుచేశారు. అవి తరచుగా మరమ్మతులకు గురువుతున్నాయి. పలుచోట్ల ట్యాంకు నుంచి వచ్చే నీటినే వంట వండేందుకుఉపయోగిస్తున్నారు. ఈ ట్యాంకులు ఏళ్లతరబడి శుభ్రంచేయక, బ్లీచింగ్ చేయకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

- చల్లా చంద్రశేఖర్ రెడ్డి, కలువాయి, నెల్లూరు జిల్లా

## బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు ఆపాలి

బంగ్లాదేశ్‌లో మహమ్మద్ యూనస్ ఆపద్ధర్మ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత అల్పసంఖ్యాకులైన హిందువులపై నానాటికీదౌర్జన్యాలు పెచ్చుమీరుతున్నాయి. హిందువులు లక్ష్యంగా పెట్టుకొని బంగ్లాదేశ్‌లో అత్యాచారాలు, దోపిడీలకు పాల్పడుతున్నారు. దీంతో అక్కడ ఉండడానికి హిందువులు భయపడే పరిస్థితి దాపురించింది. మైనార్టీలుభయభయంగా జీవించాల్సిన దుస్థితి ఏర్పడింది. దేశంలో సర్వ మతాలను సమాన దృష్టితో చూసే మన హిందువులపై ఈ విధంగా దాడులు జరగడం చాలా బాధాకరం. ఈమధ్యనే లేని పోని ఆరోపణలతో ఇస్కాన్ చిన్మయి కృష్ణదాస్‌ను అరెస్ట్ చేశారు. రాష్ట్రపతి, ప్రధానమంత్రి ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించి, అక్కడి ప్రభుత్వం పై గట్టిగా ఒత్తిడి తెచ్చి హిందువులకు రక్షణ కల్పించాలి.

-దాసం వెంకటరెడ్డి, ఊరదాళ్ళపాలెం,ప.గో జిల్లా

## కఠిన శిక్షలే పరిష్కారం

తరగతి గదిలోనే ఉపాధ్యాయుడిని అంతమొందించిన విద్యార్థులను అరెస్టు చేయించడంలో ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం పనితీరు సరి అయినది అయినప్పటికీ, పక్క క్లాస్‌కు నిర్ణీత సమయానికి చేరుకోని టీచర్ ని సస్పెండ్ చేయడం, ప్రతి క్లాస్కు టీచర్లు నిర్ణీత సమయానికి చేరుకోవడంలో విఫలమైన హెడ్మాస్టర్ గారికి షోకాజు నోటీసు ఇవ్వడంసరైనది కాదేమో ఆలోచించాలి. ఇవి క్షమించరాని నేరాలు కాదు. మానవ సహజమైన తప్పిదాలు. మహా అయితే పొరపాటు. తప్పులు కానే కాదు. పరీక్షల్లో చూసి రాస్తున్నందుకు ఇన్విజిలేషన్ డ్యూటీ చేస్తున్న టీచర్ మీద చర్య తీసుకోవడం కూడా అలాంటిదే. దాని కంటే అలా చూసి రాసిన పిల్లలకు, అలాంటి పిల్లలను కన్నందుకు తల్లిదండ్రులకు కూడా శిక్ష వేయాలి. క్లాస్ రూమ్ లో టీచర్ మరణానికి కారణమైన ఈ సందర్భంలో, ఆ పిల్లలతో పాటు ఆ పిల్లల్ని కన్న తల్లిదండ్రులకు కూడా శిక్ష పడాలి.

-వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## తెలుగు తల్లిపై ఎందుకు లొల్లి

రాష్ట్రం ఏర్పడి పదేళ్లు దాటినా ఇంకా పార్టీల మధ్య తెలంగాణా తల్లి విగ్రహంపై స్పష్టతలేదు. గతప్రభుత్వం పదేళ్లు పాలించినా కనీసం ఒకచిన్న తెలంగాణా తల్లి విగ్రహాన్ని కూడా అసెంబ్లీలో పెట్టలేదు. తెలంగాణా తల్లి విగ్రహంపై విమర్శలు చేస్తున్నారు భారసానేతలు. రాష్ట్రాభివృద్ధి గురించి ఆలోచించాల్సిన నేతలు విగ్రహాలకోసం లేనిపోనివంతాలకు పొయి పరువు తీస్తున్నారు.

-శ్రీష్టి శేషగిరి, సికింద్రాబాద్

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఇండో - చైనా సమస్యలకు అంతం ఎప్పుడు?

*అశోక్ కె. కాంత ఒకప్పటి మన దేశ రాయబారిగా చైనాలో ఉన్న వ్యక్తి. చైనాకు సంబంధించిన వ్యవహారాలలో ఆరితేరిన నిపుణుడు. ఆయన మన విదేశాంగ శాఖ మంత్రి చేసిన ప్రకటనలోని విషయాలను నిర్దిష్టంగా విశ్లేషించటమే కాకుండా ఆయన అనుభవాన్ని కూడా ఒక వ్యాసంలో ఉదహరించారు. ప్రభుత్వ పారదర్శకతతోపాటు, ప్రతిపక్షాలు కేవలం విమర్శలకు పరిమితం కాకుండా స్నేహ హస్తాన్ని, దేశ ప్రయోజనాల దృష్ట్యా ఇచ్చినప్పుడే ఇండో, చైనా సమస్యకు సరైన పరిష్కారం లభిస్తుందన్న విషయాన్ని సూచనప్రాయంగా తెలియచేసారు. విశ్వాసాన్ని పెంపొందించే ప్రతిపాదనను చైనా విషయంలో తయారు చేయసంకల్పించి ఇండో చైనా బౌండరీ సెటిల్‌మెంట్ విధాన విషయంలో (2005 ఏప్రిల్‌లో) ఆయనను ప్రతిపక్ష నాయకులతో సంప్రదింపులు జరపాల్సిందిగా ప్రభుత్వం కోరింది. తర్వాత ప్రతిపాదనలను రహస్యంగా ఉంచాల్సిందిగా ప్రతిపక్ష నాయకులను కోరాలని ఆయనను ఆదేశించింది.*



రావులపాటి సీతారాంరావు

చీనీ భారత్ భాయీభాయీ' స్లోగన్, రెండు దేశాల మధ్య పెరిగిన పొరపొచ్చాలతో, అంతర్జాతీయ సంబంధాల హెచ్చుతగ్గులతో మసకబారినా, కొన్నాళ్ల నుంచీ, మళ్లీ ఇరుపక్షాల స్నేహపూర్వక సంకేతాలు-సంబంధాలను మెరుగుపరుస్తాయా అన్న ఆశ చిగురిస్తున్నది. డిసెంబర్ 3, 2024న మన విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ పార్లమెంట్‌లో ఇచ్చిన ప్రకటన ఈ దిశగా ఆశలు నెలకొల్పుతున్నది. ఇండియా, చైనాల మధ్య సంబంధాల విషయంలో అలాంటి అవగాహన 2020సంవత్సరంలోతూర్పు లడక్‌లో చైనా జొరబాట్ల నేపథ్యం దృష్ట్యా వచ్చిన మంచి సంకేతంగా భావించాలి. ఆయన ప్రకటన కొన్ని అంశాలలో స్పష్టతనిచ్చింది. కానీ చాలా ప్రశ్నలు, ప్రశ్నలుగానే మిగిలిపోయాయన్న విషయాన్ని మాత్రం కాదనలేం. చైనా మిలటరీ దళాలను హెచ్చు సంఖ్యలో చేర్చటం దానికి జవాబుగా రెండింతలుగా ఎక్కువ దళాలను మన దేశం ఆ ప్రాంతాలలో ఉంచటం ఇరుపక్షాల సంబంధాలను దిగజార్చిన విషయం తెలిసినదే. కానీ ఎడతెరిపి లేని చర్చల ఫలితంగా ఇరుదేశాలు సైనిక దళాలను వెనక్కి తీసుకున్నాయి. కానీ మంత్రి ప్రకటనలో డిప్లాయమెంటు ఏ విధంగా వెనక్కు తీసుకోబడిన వివరణ లేదు. కేవలం ఫ్రిక్షన్ పాయింట్స్ నుంచి మాత్రమే వెనక్కు తీసుకోవడం జరిగిందని ఆ ప్రకటన చెబుతున్నది. చైనా చొరబాట్లను తక్కువ చేసే రీతిలో 'ఫ్రిక్షన్ పాయింట్లు'గా విధాన పరంగా వ్యక్తపరుస్తున్నారా అన్న సందేహం కూడా కలుగుతున్నది. లోకల్ కండిషన్లను దృష్టిలో ఉంచుకొని ఫ్రిక్షన్ పాయింట్ల విషయంలో ఈ చర్యలు తీసుకోవటం జరిగిందన్న విషయంవరకే స్పష్టత లభించింది. ఇలాంటి చర్యలను తాత్కాలిక పరిమితులతో కూడిన అడుగులుగానే భావించాల్నా లేక తక్షణ అవసరంగా అనుకోవాలన్నా అన్న విషయం ఇంకా ప్రశ్నార్థకంగానే మిగిలిపోయింది. తక్షణ అవసరంగా దళాలను వెనక్కు తీసుకోవటం జరిగిందన్నది మాత్రమే ఆయన ప్రకటనలోని సారాంశం. శాంతి కోసం తీసుకొన్న చర్యగానే ఈ ప్రకటన తెల్పకనే తెలుపుతున్నది. ఎంతగా భారతదేశం స్నేహపూర్వక సంబంధాలు పెంచుకోవాలని ప్రయత్నిస్తున్నప్పటికిని చైనా ఒక అడుగు ముందుకు వేస్తూ రెండు అడుగులు వెనక్కు తీసుకుంటున్న వైనం అంతర్జాతీయ స్థాయిలోని నిపుణులు గమనిస్తూనే ఉన్నారు. సాధారణ సంబంధాలు నెలకొల్పబడ్డాయని అనుకోవటానికి వీలులేదు. ఇరుపక్షాలు ఎడమొహం పెడమొహం వైఖరినే అవలంబిస్తున్నాయని స్పష్టంగా తెలుస్తూనే ఉంది. అయిదు సంవత్సరాల నుంచి ముఖ్యంగా చలికాలం సమయాలలో ఎక్కువ సంఖ్యలో ఇరుపక్షాలు మిలటరీ దళాలను ఈ ప్రాంతాలలో ఉంచే విషయంలో సరైన నిర్ణయం తీసుకున్న సంకేతాలు లేవు. అందువల్లనే 'నర్మాలసీ'కి సంబంధాలు రాలేదని అనుకోవాల్సివస్తుంది. ఇండో-చైనా విషయంలో అన్ని పార్టీల వారిని ప్రభుత్వం పిలిచి అక్కడున్న పరిస్థితులు సాకల్యంగా చర్చించినప్పుడే దేశంలోని పార్టీల మధ్య విదేశాంగ విధానంలో స్పష్టత లభించటమే కాకుండా చైనా లాంటి దేశాలను అంతర్గతంగా విభేదాలు ఉన్నా అంతర్జాతీయంగా భారతదేశంలోని వారందరూ ఒక్క త్రాటిమీదనే ఉన్నారు అన్న విషయం బహిర్గతమవుతుంది. లేకపోతే ఆధారాలు లేని అపోహలూ, ఆరోపణలూ, అటు ప్రభుత్వం, ఇటు ప్రతిపక్షాల మధ్య రోజురోజుకూ పెరుగుతాయి. చైనా వారు ఇండియా కూటమికి డబ్బు సమకూరుస్తున్నారని ఒకరంటే అమెరికావారు ప్రభుత్వానికి ఇచ్చే సహ



కారం షరతులతో కూడినది అని ప్రతిపక్షాలు ఆరోపణలు చేయడం ప్రజలకు విడ్డూరంగానే ఉంటుంది. కానీ బయట ఎంత హాని ఇలాంటి ఆరోపణలు వల్ల దేశ ప్రయోజనాలకు జరుగుతున్నదో రాజకీయ వేడి తగ్గిన తర్వాత తెలుస్తుంది. ఇండో చైనా సంబంధాల విషయంలో కొన్ని ముఖ్య సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయి. ముఖ్యంగా 'యాక్చువల్ లైన్ ఆఫ్ కంట్రోల్ (ఎ.యల్.సి) విషయంలో 2020 సంవత్సరం తర్వాత స్పష్టత రోజురోజుకూ కరువైపోతున్నది. పార్లమెంట్‌లో విదేశాంగ మంత్రి వాడిన పదం 'తాత్కాలిక పరిమితులతో కూడిన చర్యలు స్టెప్స్ ఆఫ్ టెంపరరీ అండ్ లిమిటెడ్ నేచర్) ఎంతవరకు బేసిక్ సమస్యలను పరిష్కరిస్తాయి? పెట్రోలింగ్ ఎప్పుడూ చేసే ప్రాంతాలలో మొదలు పెడ్తున్నాం అని విదేశాంగ మంత్రి చెప్పారు కానీ కో ఆర్డినేటెడ్ పెట్రోలింగ్ అనేమాట గూడా ఈ సందర్భంలో చర్చల్లో వచ్చింది. అంటే 'ట్రెడిషనల్ పెట్రోలింగ్ పాయింట్స్' లో పరిమితులు లేకుండా మన దళాలు పెట్రోలు చేయొచ్చా లేదా అన్న విషయంలో ఆయన ప్రకటన స్పష్టపర్చలేదు. వై జంక్షన్ తర్వాత డెస్పాంగ్ ప్రాంతాలలో పెట్రోలింగ్ సాధ్యపడుతుందా? ట్రెడిషినల్ ప్రాంతాలు అయినడెస్పాంగ్, డెమ్‌చోంక్ ప్రాంతాలలో ఈ గస్తీ ప్రయత్నాలు ఫలిస్తాయా? 'కో ఆర్డినేటెడ్ పెట్రోలింగ్' అనే ప్రక్రియ కొత్తగా వాడుకలో వినపడుతున్నది. ఇండో చైనా బార్డర్ మానేజ్‌మెంట్‌లో ఇది సాధ్యపడుతుందా? గాల్వాననవాలీలో ఎలాంటి గస్తీకి అవకాశం ఉంది? లైన్ ఆఫ్ పక్చునల్ కంట్రోల్ (ఎల్.ఎ.సి) ఎప్పటికప్పుడు మారుస్తున్నా చైనా ఈ కో ఆర్డినేటెడ్ పెట్రోలింగ్' మిషతో మరింత మన భూభాగాల్లోకి చొచ్చుకొని పోతుందా! ఈ సమస్య సమస్యగానే మిగిలిపోతుందేమో అన్న సందేహం విదేశాంగ నిపుణులను వేధిస్తున్నది. ఎల్.ఎ.సి అనేది ప్రెసిడెంట్ జిన్‌పింగ్ దృష్టిలో సార్వభౌమాధికార పరధులలో ఒక్క ఇంచ్ కూడా కోల్పోని పరిస్థితిగాభావించటం! ఆ ఆలోచనతో అవసరాల మేర తీయని మాటలతో చర్చల పేరుతో ఇండియాను ఏమార్చటం అలవాటుగా మారింది. సత్సంబంధాలు సదాసాగిస్తూనే ఉండాలి కానీ భూభాగాల విషయంలో అంత్యనిష్ఠూరం కంటె ఆది నిష్టూరమే మేలు అన్నది మనం గ్రహించకతప్పదు. అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చైనా ఆక్రమించుకున్న ప్రాంతంలో ఒక్క గడ్డి మొక్క కూడా మొలవదు అని చెప్పిన మాటకు మూల్యం చెల్లించుకోక తప్పలేదు. అశోక్ కె. కాంత ఒకప్పటి మన దేశ రాయబారిగా చైనాలో ఉన్న వ్యక్తి. చైనాకు సంబంధించిన వ్యవహారాలలో ఆరితేరిన నిపుణుడు. ఆయన మన విదేశాంగ శాఖ మంత్రి చేసిన ప్రకటనలోని విషయాలను నిర్దిష్టంగా విశ్లేషించటమే కాకుండా ఆయన అనుభవాన్ని కూడా ఒక వ్యాసంలో ఉదహరించారు. ప్రభుత్వ పారదర్శకతతోపాటు, ప్రతిపక్షాలు కేవలం విమర్శలకు పరిమితం కాకుండా స్నేహహస్తాన్ని, దేశ ప్రయోజనాల దృష్ట్యా ఇచ్చినప్పుడే ఇండో, చైనా సమస్యకు సరైన పరిష్కారం లభిస్తుందన్న విషయాన్ని సూచనప్రాయంగా తెలియచేసారు. విశ్వాసాన్ని పెంపొందించే ప్రతిపాదనను చైనా విషయంలో తయారు చేయసంకల్పించి ఇండో చైనా బౌండరీ సెటిల్‌మెంట్ విధాన విషయంలో (2005 ఏప్రిల్‌లో) ఆయనను ప్రతిపక్ష నాయకులతో సంప్రదింపులు జరపాల్సిందిగా ప్రభుత్వం కోరింది. తర్వాత ప్రతిపాదనలను రహస్యంగా ఉంచాల్సిందిగా ప్రతిపక్ష నాయకులను కోరాలని ఆయనను ఆదేశించింది. ప్రతిపక్ష నాయకులను విశ్వాసంలోకి తీసుకోవడం వల్ల ఏ విషయమూ నాయకులు బయటకు పొక్కనివ్వలేదు. అంతేకాదు ప్రభుత్వం తమ మీద ఉంచిన బాధ్యతను విశ్వాసాన్ని అమితంగా మెచ్చుకుంది. ఇలాంటి సున్నిత విషయాల్లో ఓర్పు, నేర్పు అన్ని పక్షాలకు ఉండాలని కూడా అభిప్రాయపడడం వల్ల సమస్య అప్పట్లో ఒక స్థాయిలో పరిష్కార దిశగా అడుగేసింది. ముఖ్యమైన అగ్రిమెంట్లు కుదిరాయి కూడా. ఏకాభిప్రాయం ఉంటేనే చైనా ఇండియా లాంటి సున్నిత సమస్యలకు పరిష్కారం లభ్యమవుతుంది. భేదాభిప్రాయాలున్నా వాటిని తొలగించుకొనే అవకాశం చర్చల ద్వారా లభిస్తుంది. అది ప్రస్తుత పరిస్థితుల్లో సాధ్యపడుతుందా? ఈ ప్రశ్నకు జవాబు దొరకాలని ఆశిద్దాం. ●

# ఆహార, ఆవాస కేంద్రాలు మన పర్వతాలు

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

పర్యావరణ పరిరక్షణ, వాతావరణ సకారాత్మక మార్పులు, పేదరిక నిర్మూలన, జీవవైవిధ్య సంరక్షణ, జీవ వ్యవస్థల నియంత్రణ లాంటి పలు ప్రయోజనాలకు పర్వతాలు ఎంతగానో సహకరిస్తున్నాయి. ప్రకృతి ప్రసాదించిన శాశ్వత, సుందర పర్వతాల పరిరక్షణ ప్రాధాన్యాన్ని అవగాహన పర్చడం, పర్వతాల పరిరక్షణ కారణాలను వివరించడం, సుస్థిరాభివృద్ధికి తోడ్పడడం లాంటి అంశాలను విస్తృతంగా చర్చించడానికి ప్రతి యేటా 11 డిసెంబర్‌న ఐరాస నేతృత్వంలో ప్రపంచ దేశాలు అంతర్జాతీయ పర్వతాల దినం (ఇంటర్నేషనల్ మౌంటేయిన్ డే) పాటించుట జరుగుతున్నది. ఈ వేదికను పర్వత విజ్ఞాన శాస్త్ర వినిమయం, ఉత్తమ నియంత్రణ మార్గాల చర్చ, సమైక్యంగా పర్వతాల పరిరక్షణ యజ్ఞాలను కొనసాగించడం లాంటి ప్రధాన అంశాలను తీసుకోవడం కొనసాగుతున్నది. ఐరాస నిర్ణయం ప్రకారం 2002 ఏడాదిని అంతర్జాతీయ పర్వతాల సంవత్సరం"గా పాటించడం, 2003 నుంచి ప్రతి యేటా 11 డిసెంబర్‌న అంతర్జాతీయ పర్వతాల దినం"గా వేడుకలు జరుపుకోవడం కొనసాగుతున్నది. అంతర్జాతీయ పర్వతాల దినం2024 థీమ్‌గా సుస్థిర భవిష్యత్తుకు పర్వతాల పరిష్కారాలు ఆవిష్కరణ, అను సరణ, యువత" అనబడే అంశాన్ని తీసుకోవడం జరిగింది. ఇన్నొవేషన్‌ను జోడిస్తూ పర్వతాల సంక్లిష్ట సమస్యలకు సమాధానాలు వెతకడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పర్వతాలను కాపాడుకోవటం, డిజిటల్ వేదికగా పర్వతాలను పర్యవేక్షణ చేయడం, సృజనశీల ఆలోచనలతో సమస్యలను పరిష్కరించడం, వాతావరణ మార్పులకు అనుగుణంగా నూతన వ్యవసాయ



పద్ధతులను పాటించడం, పర్వతాల పరిరక్షణ నిర్వహణతో పాటు నిధులు ఏర్పాటు చేయడం కొనసాగడం నేటి కనీస అవసరమని భావిస్తున్నాయి ఐరాస సభ్యదేశాలు. పర్వతాల పరిరక్షణతో సంబంధం ఉన్న వాతావరణ సానుకూల మార్పులు, లింగ సమానత్వ సాధన, సామాజిన న్యాయం, ఆవిష్కరణలు, సాంస్కృతిక వికాసం, ఔషధాల కొలువులు, శక్తివనరుల కేంద్రాలు, సమ్మిళిత అభివృద్ధి, పని కల్పన, ఉద్యోగ ఉపాధుల కల్పన, జీవనోపాధికి మార్గాలు, సుజల నిధుల భండాగారాలు, వ్యవ సాయ నెలవులు, గిరిజన జాతులకు అమ్మఒడి, నేలకోతను అరికట్టడం, హరిత క్షేత్రాలుగా నిలవడం, ఆహార పదార్థాల కేంద్రాలు, ఔత్సాహికులను ప్రోత్సహించడం లాంటి లక్ష్యాలను తీసుకొని ప్రపంచవ్యాప్త యువత సుస్థిరాభివృద్ధికి బాటలు వేయాలని ప్రపంచ మానవాళి కోరుకుంటున్నది. పర్వత ప్రదేశాలు 15శాతం ప్రపంచ జనాభాకు ఆవాసాలుగా నీడనిస్తూ, దాదాపు 50 శాతం జీవవైవిధ్య కేంద్రాలుగా మహోన్నత సేవలు చేస్తున్నాయి. మహోన్నత పర్వతాలు 311 మిలియన్ల ప్రపంచవ్యాప్త నిరుపేదల పుట్టినిళ్లు. ప్రకృతి అంటేనే ఎత్తైన పర్వతాలు, జరజరా జారే జీవ నదులు, చల్లగా వీచే శీతల పవనాలు, ధరణిమాత చుట్టిన అందమైన హరిత చీరలు అని మనకు తెలుసు. నేడు పర్యాటకంఅనేక రెట్లు పెరగడంతో పర్వత ప్రాంతాలు తమ సహజత్వాన్ని కోల్పోతూ, కార్బన్ కాలుష్య కూపాలు, హరిత ప్రాంతాల క్షీణత, నేల నాణ్యత పడిపోవడం లాంటి అవాంఛనీయ మార్పులు చోటు చేసుకోవడం విచారకరం. పర్వతాలను కాపాడకపోవడం అంటే మన ఉజ్వల భవిష్యత్తుకు మనమే పునాదులు వేసుకోవడమని తెలుసుకొని సన్మార్గంగా నడుద్దాం, పర్వతాలను ప్రేమతో ఆలింగనం చేసుకుందాం. ●

# పిల్లల జీవన ప్రమాణాల పెంపునకు యునిసెఫ్ కృషి

ఎస్.ఆర్. కిష్టయ్య

అభివృద్ధి చెందుతున్న దేశాలలో పిల్లలు, వారి తల్లుల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి ఈ సంస్థ కృషి చేయడమే లక్ష్యంగా యునిసెఫ్ ఏర్పాటు జరిగింది. ఐక్య రాజ్య సమితి సంబంధిత అంతర్జాతీయ బాలల అత్యవసర నిధి లేదా ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ బాలల అత్యవసర నిధి యునిసెఫ్ 1946 డిసెంబరు 11న సంస్థ ఏర్పాటైంది. ప్రధాన కార్యాలయం న్యూయార్క్ నగరంలో ఉంది. మొదట దీనిని ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ పిల్లల అత్యవసర నిధి (యునిసెఫ్)అని పిలిచారు. ప్రస్తుతం దీని పేరులో అంతర్జాతీయ, అత్యవసర అనే పేర్లను తొలగించి ఐక్యరాజ్య సమితి బాలల నిధి అని వ్యవహరిస్తున్నారు. రెండవ ప్రపంచ యుద్ధానంతరం 1946 నుండి 1950 వరకు, "అత్యవసర అవసరాల విధానం" అంటే పిల్లల ఆహారం, దుస్తులు, ఆరోగ్య అవసరాలను, ముఖ్యంగా ఐరోపాలో యునిసెఫ్ పన్నెండు దేశాలలో ఐదు మిలియన్ల పిల్లలకు వివిధ రకాల దుస్తులను పంపిణీ చేసింది. క్షయ వ్యాధికి వ్యతిరేకంగా ఎనిమిది మిలియన్లకు టీకాలు వేసింది. పాల ప్రాసెసింగ్, పంపిణీ సౌకర్యాలను పునర్నిర్మించింది. ఐరోపాలో మిలియన్ల మంది పిల్లలకు రోజువారీ అనుబంధ భోజనాన్ని అందించింది. 1951-1960 మధ్య కాలంలో, యునిసెఫ్ అత్యవసర అవసరాలను తీర్చడం కొనసాగించింది. అదే సమయంలో దీర్ఘకాలిక ప్రాయోజిత కార్యక్రమాలకు చేపట్ట నిర్ణయించింది. పిల్లల ఆరోగ్యాన్ని కాపాడటానికి, యునిసెఫ్ క్షయ, కుష్టు వ్యాధి, మలేరియాకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించింది. పర్యావరణ పారిశుద్ధం కోసం నిబంధనలు రూపొందించింది. తల్లి, పిల్లల ఆరోగ్య సంరక్షణ విద్యను ప్రోత్సహించింది. పిల్లలకుపోషక ప్రమాణాలను పెంచడానికి, యునిసెఫ్ దేశాలకు తక్కువ ధర, అధిక ప్రోటీన్ కలిగిన ఆహార పదార్థాలను ఉత్పత్తి చేయడానికి, అలాగే పంపిణీ చేయడానికి సహాయ పడింది. ప్రజలను వారి ఉపయోగంలో అవగాహన కల్పించడానికి ప్రోత్సహించింది. పిల్లల సాంఘిక సంక్షేమం కోసం, యునిసెఫ్ పిల్లల పెంపకం, గృహ మెరుగుదలపై తల్లులకు అనధికారిక శిక్షణ, డేకేర్, పొరుగు కేంద్రాలు, కుటుంబ సలహా, యువజన క్లబ్‌ల ద్వారా పిల్లలకు సహాయక సేవలను ఏర్పాటు చేసింది. 19611970 కాలంలో యునిసెఫ్ పిల్లలకు దేశ అభివృద్ధికి సహాయం చేసే భావనను పెంపొందించే కార్యక్రమాలకు అనుసరించింది. జాతీయ విధానం, పిల్లలకు సహాయపడే కార్యక్రమాల మధ్య పరస్పర సంబంధాన్ని గుర్తించి, దేశం విధానం" అని పిలువబడే ఈ విధానం, యునిసెఫ్ పిల్లల అవసరాలను తీర్చడంలో ప్రతి దేశం తాను ఏర్పాటు చేసిన ప్రాధాన్యతలను తగిన మార్గాల్లో అమలు చేయడానికి అనుమతించింది. పర్యవసానంగా,





పిల్లల మేధో, మానసిక, వృత్తిపరమైన అవసరాలతో పాటువారి శారీరక అవసరాలనుతీర్చడం, యుని సెఫ్ ఉపాధ్యాయ విద్య, పాఠ్యాంశాల సంస్కరణలకు సహాయం అందించింది, పూర్వ వృత్తిశిక్షణ కోసం నిధులు కేటాయించింది. సాంకేతికం విద్యను, సమాచారాన్ని ప్రోత్సహిం చింది. డెబ్బైల దశాబ్దంలో, యునిసెఫ్ అభివృద్ధి చెందు తున్న దేశాలలో పిల్లల జీవన ప్రమాణాలను పెంచడానికి ప్రయత్నించింది. దాని ప్రయత్నాలను సంబంధిత ప్రభుత్వాలతో సమన్వయం చేసింది. అంతర్జాతీయ, బహుళజాతి, ఆదాయ వనరుల సమకూర్పుకు ప్రభుత్వేతర ఏజెన్సీల నుండి మద్దతును పొందాలని యునిసెఫ్ భావించి, తదను గుణ చర్యలు చేపట్టింది. యునిసెఫ్ 70సంవత్సరాల చరిత్రకు సంబంధించినగణాంకాలు సాధించిన నిర్మాణాత్మక పనిని స్పష్టంచేస్తుంది. కోట్లాదిమంది పిల్లలు పరీక్షించబడ్డారు. చికిత్సపొందారు. చికిత్సకోసం పరీక్షించబడ్డారు. క్షయవ్యాధికి నివారణ టీకాలు, మలేరియా, కుష్టు వ్యాధి నుండి అనేక మిలియన్లమంది రకించబడ్డారు. గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, ప్రసూతి వార్డులు, ఉపాధ్యాయ శిక్షణా పాఠశాలలు, ప్రాథమిక మాధ్యమిక పాఠశాలలు, ప్రీవృత్తి శిక్షణాపాఠశాలలు, ప్రీవొకేషనల్ బోధకులకు శిక్షణ ఇవ్వడానికి పాఠశాలలు, ఆహార సిబ్బందికి శిక్షణ ఇవ్వడానికి పాఠశాలలు, పోషకాహార కేంద్రాలు కమ్యూనిటీగార్డెన్స్, పాఠశాల తోటలు, క్యాంటీన్లు, డే కేర్ సెంటర్లు, మహిళా క్లబ్‌లు కమ్యూనిటీ సెంటర్లకు ఇచ్చిన పరికరాలు, బిలియన్లలో దుస్తు పంపిణీ, అనుబంధ భోజనం వరదలు, భూకంపాలు, ఇతర ప్రకృతి వైపరీత్యాలకు గురైన లక్షలాది మందికి అత్య వసర సహాయం అందించబడింది. యునిసెఫ్ పిల్లల ప్రద ర్శనల కోసం సినిమాలను విడుదల చేసింది. ఈ చిత్రాలలో ఆంగ్లంలో నాలుగు ఉన్నాయి. పిల్లలను ప్రభావితం చేసేపట్టణీకరణ సమస్యలపైఒక డాక్యుమెంటరీ, డిజైన్ నుండి అమ్మకం వరకు యునిసెఫ్ గ్రీటింగ్‌కార్డ్ కథలో ఒకటి ఉన్నా యి. 2019లో, యునిసెఫ్ 137 ప్రభుత్వ భాగస్వాముల తో పాటు, ఇంటర్ గవర్నమెంటల్ సంస్థలు, అంతర్‌సంస్థా గత ఏర్పాట్ల ద్వారా 4.7 బిలియన్ల డాలర్లు అందించాయి. ప్రైవేటు రంగాలతో భాగస్వామ్యాలు ప్రాముఖ్యతను పెంచుకుంటూ, 1.5 బిలియన్ల డాలర్లను అందించాయి. కోవిడ్19 మహమ్మారితో సహా అత్యవసర పరిస్థితుల్లో రెగ్యులర్ వనరుల నిధులతో ప్రపంచవ్యాప్త పిల్లలకు సహకరించింది. యునిసెఫ్ వార్షిక నివేదిక 2019 ద్వారా 2019 చివరినాటికి, యునిసెఫ్ 2018-2021 వ్యూహాత్మక ప్రణాళిక మిడ్‌టర్మ్ మార్క్, నిర్దేశించిన లక్ష్యా లలో 74 శాతం సాధించబడింది. ఇందు లో 5 సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్న 307 మిలియన్ల మంది పిల్లలు పోషకాహార లోపాన్ని నివారించ డానికి, 17 మిలియన్ల మంది పాఠశాల నుండి బయట పిల్లలు, నైపుణ్యాల అభివృద్ధితో 4 మిలియన్ల పిల్లలు, యువకులు లాభోక్తులైనారు. సురక్షితమైన తాగునీరు 18.3 మిలియన్ల ప్రజలు, ప్రాథమిక పారిశుధ్య సేవలతో 15.5 మిలియన్లు, 96 దేశాలలో281 అత్యవసర పరిస్థితుల్లో మానవతా సహాయం పొందారని నివేదిక స్పష్టం చేసింది. ●

## ముఖ్యమంత్రి నారా చంద్రబాబుతో ఎమ్మెల్యే దామచర్ల భేటీ

**ఒంగోలు, ప్రభాతవార్త**



ఒంగోలు నియోజకవర్గ సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చర్చించారు. మంగళవారం సాయంత్రం సచివాలయంలో కలిసి పలు సమస్యలు పై చర్చించడం జరిగినది. ముఖ్యంగా ఒంగోలు నగరానికి యువగళం పాదయాత్రలో నారా లోకేష్ హామీ మేరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మంజూరు చేయాలని కోరడం జరిగినది, అసంపూర్తిగా వున్న త్రాగునీటి పథకంకు కూడా నిధులు మంజూరు, పోతురాజు కాలువ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలిని కోరారు. ఒంగోలు నియోజకవర్గంలో జగనన్న లేవుట్స్ లో పనులు చేయకుండా బిల్లులు డ్రా చేసుకున్న విధానాన్ని వారికి వివరించి వాటిపై విజిలెన్స్ విచారణ చేయాలి కోరడం జరిగినది. దానికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. ఒంగోలు నగరంలో జరుగుతున్న వార్డుకో వారం, ఇంటికికీ సమగ్ర సర్వే యొక్క వివరాలను వారికి వివరించగా..దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు జనార్దన్ అభినందించారు.



తెలుగుదేశం పార్టీ తరుపున రాజ్యసభ సభ్యులుగా ఎంపికై నామినేషన్లు వేస్తున్న బీద మస్తాన్‌రావు, సానా సతీష్‌లను మంగళవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ మర్యాదపూర్వకంగా టీడీపీ ప్రజాప్రతి నిధులుతో కలిసి అభినందనలు తెలిపారు.

## ఘనంగా ఏ.బి.యం. జూనియర్ కాలేజి సెమీ క్రిస్మస్ వేడుకలు

**ఒంగోలు టౌన్, ప్రభాతవార్త**




ఏ.బి.యం. జూనియర్ కాలేజి హైస్కూలు నందు ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు మంగళవారం జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న హైస్కూలు కరస్పాండెంట్ కొమ్ముర్రి రవిచంద్ర మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ ప్రపంచ వ్యాపితంగా జరుగుతుందని, పాపులను రక్షించుటకు ప్రభువైన యేసుక్రీస్తు ఈ లోకములో మనుష్య కుమారునిగా జన్మించాడని, ఆయన పుట్టుక కు చారిత్రక ఆధారాలు ఉన్నాయి కాబట్టే క్రీస్తుకు పూర్వం, క్రీస్తు శకం అని కాలాన్ని విడదేశారని చెప్పారు. ముందుగా పాస్టర్ కే. డేనియెల్ గారు వాక్యపరిచర్య చేసినారు. తదుపరి రవిచంద్ర గారు కేక్ కట్ చేసి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ పుష్పరాజు, ప్రిన్సిపాల్ శ్రీవాణి, విధుల్లత, నిర్మల, హైస్కూలు కాలేజి స్టాఫ్ మరియు విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

## చట్టం ముందు ప్రతి ఒక్కరూ సమానులే : వి.సి ప్రొఫెసర్ మూర్తి

**ఒంగోలు,ప్రభాతవార్త**





నేటి సమాజంలో కంప్యూటర్ రంగం నందు విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకున్నప్పటికి మానవ హక్కుల పరిరక్షణ విషయంలో ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అదే సమయంలో చట్టం ముందు ప్రతి ఒక్కరూ సమానులే అనే విషయాన్ని కూడా యావత్ సమాజం గుర్తించాల్సిన అవసరం ఉందని ఆంధ్ర కేసరి యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి అన్నారు. మంగళ వారం స్థానిక ఆంధ్ర కేసరి యూనివర్శిటీ సెమినార్ హాల్ నందు నిర్వహించిన అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవ వేడుకల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఆంధ్ర కేసరి యూనివర్శిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజ మోహన్ రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణ అనేది అందరి భాధ్యత అని అన్నారు. అదే సమయంలో మానవ హక్కుల ఉల్లంఘన జరగకుండా జరగకుండా కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం అందరిపైనా ఉందని పేర్కొన్నారు. ఏ.కే.యూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మూర్తి మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణ విషయంలో భారత రాజ్యాంగంలో పొందుపరచ బడిన ఆర్టికల్ 14, ఆర్టికల్ 19 లు భారత దేశంలో సాధారణ స్థాయి పౌరుల దగ్గర నుంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న పెద్దల వరకు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయని తెలిపారు. ఒక్కో సందర్భంలో మానవ హక్కుల విషయంలో ఏది వాస్తవం, ఏది అవాస్తవమో తెలుసునే ప్రయత్నంలో తలెత్తే పలు సందేహాల గురించి సభికులకు పలు సంఘటనలను విశ్లేషణ చేయడం ద్వారా వివరించారు. బాలికల విషయంలో 18 సంవత్సరాల వయస్సు వచ్చేంత వరకు తల్లి సంరక్షణలో జీవించాలనేదే ప్రధాన ఉద్దేశంగా పేర్కొన్న వచ్చునని ఆయన అన్నారు. ఆర్టికల్ 21 ద్వారా భారత దేశంలోని ప్రతి పౌరుడు స్వేచ్ఛగా జీవించే హక్కును కలిగి ఉన్నాడని అయితే అదే సమయంలో ఇతరుల హక్కులకు భంగం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం కూడా ఉందన్నారు.ఇప్పటికీ కూడా మానవ హక్కుల భావన గురించి ఖచ్చితత్వాన్ని పూర్తి స్థాయిలో ప్రజలకు వివరించేందుకు ఇంకా చర్చోపచర్చలు కొనసాగుతూనే ఉన్నాయనీ అన్నారు.గత 30 సంవత్సరాల కాలంతో పోల్చి చూసి నట్లయితే నేడు భారతావనిలో మానవ హక్కుల పరిరక్షణ,అభివృద్ధి విషయంలో ఎంతగానో అభివృద్ధి జరిగిందని ప్రొఫెసర్ మూర్తి సూచించారు. అంతే కాకుండా భాలికావిద్యను బాగా అభివృద్ధి చేయాల్సిన అవసరం గురించి ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా పాల్గొన్న ఏ.కే.యూ వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్ నిర్మలా మణి మాట్లాడుతూ నేడు భారతావనిలో ప్రతి ఒక్కరికీ జీవించే హక్కు ప్రధానంగా ఉందన్నారు. ఆ హక్కుకు అనుసంధానంగా మాట్లాడే హక్కు, సమానత్వపు హక్కులనేవి ప్రతి పౌరునికి స్వతహాగా లభించిన వేనని ఆమె పేర్కొన్నారు.1948 అంతర్జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సమితి ఇచ్చిన డిక్లరేషన్ ప్రకారం భారతావనిలో మానవ హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం, పాలకులు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారని నిర్మలామణి పేర్కొన్నారు. ఎవరికి వారు తమ పొరుగు వారిని ప్రేమతో చూడటం, చేతనైన సహాయం చేయడం వంటివి చేపట్టినట్లయితే ప్రతి ఒక్కరూ స్నేహ పూర్వకంగా జీవిస్తారని, అందరిలోనూ అవినాభావ సంబంధం పెంపొందుతూ ఉంటుందని ఆమె తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆంధ్ర కేసరి యూనివర్శిటీ ఎన్.ఎస్.ఎస్ విభాగం కో ఆర్డినేటర్ డాక్టర్ మండే హర్ష ప్రీతం దేవ్ కుమార్ మానవ హక్కుల పరిరక్షణ గురించి పలు విషయాలను సభికులకు వివరణాత్మకంగా తెలియ జేయడం జరిగింది. అనంతరం ఆయన ఆద్వర్యంలో వందన సమర్పణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర కేసరి యూనివర్శిటీకి చెందిన బోధన, బోధనేతర సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నైపుణ్యతను ప్రదర్శిస్తేనే ఉత్తమ శిఖరాలు అధిరోహిస్తారు..

### - కళాశాల కార్యదర్శి అన్నా కృష్ణ చైతన్య

**మార్కాపురం, ప్రభాతవార్త**




విద్యతో పాటు నైపుణ్యతను ప్రదర్శించినప్పుడే విజయం సొంతమై ఉన్నత శిఖరాలకు ఎదగలుగుతారని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల కార్యదర్శి అండ్ కరస్పాండెంట్ అన్నా కృష్ణ చైతన్య అన్నారు, కిట్స్ శిక్షణ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ప్రత్యేక సెమినార్ కార్యక్రమం ఆయన పాల్గొని మాట్లాడారు, ఇంజనీరింగ్ తరగతి గది లో బోధన వ్యూహాలు, సమర్థవంతమైన కమ్యూనికేషన్ నైపుణ్యాలపై సెమినార్, విజయానికి మార్గదర్శకంపై ఫ్యాకల్టీ డెవలప్మెంట్ కార్యక్రమం నిర్వహించారు, మొదటి సంవత్సరం విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ పై నిర్వహించిన సెమినార్ ఉపయోగకరంగా ఉందని కృష్ణ చైతన్య తెలిపారు, ఫ్యాకల్టీ డెవలప్మెంట్ కార్యక్రమం రిసోర్స్ పర్సన్‌గా డాక్టర్ ఎస్ కే సలీం బాబు (త్రిబుల్ ఐటీ నూజివీడు) పాల్గొని మెలకువలను వివరించారు,, తరగతి గదిలో బోధించవలసిన తీరు , ఉపాధ్యాయ వృత్తి, కమ్యూనికేషన్ స్కిల్స్ పై పట్టు సాధించే విధానం, అంశాల గురించి విద్యార్థులకు వివరించారు, స్కూల్ ఆఫ్ బిజినెస్ పూణే నుండి హాజరైన డాక్టర్ పి వై నవీన్ మాట్లాడుతూ విద్యార్థులకు నైపుణ్యతపై ఉండవలసిన ప్రావీణ్యత, ఉద్యోగాలు సాధించాలంటే కావలసిన స్కిల్స్, తదితరాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డాక్టర్ వి కృష్ణారెడ్డి వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కళాశాల ఏవో బి ప్రభాకర్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి పివి అనిల్‌కుమార్ విభాగాధిపతులు విద్యార్థులు పాల్గొన్నారు.




# ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త


## పొదిలిలో భారీగా రేషన్ బియ్యం పట్టివేత

**పొదిలి, డిసెంబర్ 10, ప్రభాతవార్త**



పొదిలి అడ్డరోడ్డు సమీపంలోని ధనలక్ష్మి రైస్ మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన 300 బస్తాల రేషన్ బియ్యాన్ని ఆర్డిఓ కేశవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఎన్ ఫోర్స్ మెంటు అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. అందిన సమాచారం మేరకు కనిగిరి ఆర్డిఓ ఆధ్వర్యంలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిలవ ఉంచిన ప్రాంతాన్ని ఎన్ ఫోర్స్మెంట్ డిటి సురేఖ, ఎఫ్ ఐ ప్రమోదు, ఆర్ ఐ,వి ఆర్ ఓ లు చేరుకొని తనిఖీలు చేశారు. ఆ బియ్యాన్ని స్వాధీనము చేసుకొని సీజ్ చేశారు. కేసు నమోదు చేశారు.

## కూటమి సర్కారుపై డోర్ డెలివరి ఎఫెక్ట్ ఎంత

**ఒంగోలు, ప్రభాతవార్త**

వైసీపీ అధినేత మాజీ సీఎం జగన్ తన హయాం గురించి మాట్లాడుతూ ప్రజలకు అన్ని డోర్ డెలివరి చేశామని, కానీ ఇప్పుడు చేయడం లేదని వ్యాఖ్యానించారు. దీనిపై ప్రజల్లో తీవ్రమైన చర్చ సాగుతుందని, జగన్ వదులుకుని తప్పులు చేశామని ప్రజలు భావిస్తున్నారని కూడా ఆయన చెప్పుకొచ్చారు. దీంతో కూటమి సర్కారు దాదాపు ఎత్తేసిన డోర్ డెలివరి విధానాలపై ఇప్పుడు మేధావులు సైతం దృష్టి పెట్టారు. నిజంగానే డోర్ డెలివరి లేకపోతే వ్యతిరేక పెరుగుతుందా అనే ఆలోచన చేస్తున్నారు. వైసీపీ హయాంలో వాలంటీర్ల ద్వారా ప్రజలకు, ప్రభుత్వం నుంచి సమాచారం అందిన మాట వాస్తవం. దీనిని కూటమి నాయకులు కూడా గతంలో అంగీకరించారు. వాలంటీర్లు భాగానే పని చేస్తున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు వంటి వారు గతంలో చెప్పుకొచ్చారు. అంతే కాదు. ప్రజలకు ఏదీ అవసరం అయినా వాలంటీర్లు చేదోడుగా ఉన్నారు. అయితే కూటమి సర్కారు వచ్చాక వాలంటీర్లను దాదాపు పక్కన పెట్టేసింది. తీసుకుంటామని చెప్పున్నా ఆ దిశగా ఎలాంటి కార్యచరణ లేదు. ఇక రేషన్‌బియ్యాన్ని కూడా డోర్‌డెలివరి చేసిన విషయాన్ని ప్రస్తావించారు. జిల్లాలో ఎండీయూ 385 ఉన్నాయి. ప్రస్తుతం వాహనాలను పూర్తిగా నిలిపివేసి దుకాణాలకే లబ్దిదారులను పంపుతున్న విషయాన్ని ఆయన చెప్పున్నారు. ఇది అందరికి తెలిసిందే. రేషన్ వాహనాల కారణంగా రేషన్ దుకాణాలు మూతపడ్డాయని, దీని వలన ఆయా దుకాణాలపై ఆధారపడిన వారి కుటుంబాలు రోడ్డు పడ్డాయన్నది ప్రభుత్వం చెప్పున్న మాట. అందుకే వాహనాలు తీస్తున్నామని అంటున్నారు. అదే సమయంలో ఇంటికే డాక్టర్ కాన్సెప్ట్‌ను వైసీపీ అమలు చేసింది. కానీ ఇప్పుడు దానిని కూడా తీసేశారని జగన్ చెప్పున్నారు. అయితే జగన్ చెప్పున్న విషయాల్లో నిజం ఉన్నప్పటికి ప్రజలు ఇవేమి కోరుకోవడం లేదన్నది సూస్పష్టంగా తెలుస్తుంది. ఎందుకంటే రేషన్ అయినా, పథకమైనా వారికి అందితే చాలని కోరుతున్నారు. అంతే తప్ప నేరుగా నోట్లో పెట్టినట్లు ఇంటికే అన్నింటిని తీసుకుని రావాల్సిన అవసరం లేదన్న భావన కూడా కనిపిస్తుంది. దీంతో డోర్ డెలివరి పథకాలు నిలిపివేసిన కూటమి సర్కార్‌పై పెద్ద ప్రమాదం అయితే పడే అవకాశం కనిపించడం లేదని మేధావి వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



# ఘనంగా ముగిసిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

### - విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యేలు బియన్, ఉగ్ర, ఇంటూరి, ఎన్నారై రాఘవేంద్రప్రసాద్‌లు





**సంతనూతలపాడు, ప్రభాతవార్త**

సంతనూతలపాడులోని సూదనగుంట కోటయ్య చౌదరి, ఆదిలక్ష్మీ మెమోరియల్ హైస్కూల్లో 71వ సీనియర్స్ రాష్ట్రస్థాయి స్త్రీ పురుషుల కబాడీ పోటీలు మంగళవారం రాత్రి తో ఘనంగా ముగిసాయి. ఈనెల 7వ తేదీన ప్రారంభమైన రాష్ట్రస్థాయి స్త్రీ పురుషుల కబాడీ పోటీలు పదో తేదీతో వైభవంగా ముగిసాయి. సుదనగుంట ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండర్ ఎన్నారై తానా మాజీ అధ్యక్షులు సూదున గుంట రాఘవేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా జిల్లా కబాడీ అసోసియేషన్ పర్యవేక్షణలో రాష్ట్రస్థాయి స్త్రీ, పురుషల కబాడీ పోటీలు జరిగినవి. ఈ పోటీల్లోని విజేతలకు కనిగిరి, సంతనూతలపాడు, కందుకూరు శాసనసభ్యులు ఉగ్ర నరసింహారెడ్డి, బిఎన్ విజయ్‌కుమార్, ఇంటూరి నాగేశ్వరరావులు, తానా మాజీ అధ్యక్షులు ఎన్నారై డాక్టర్ రాఘవేంద్ర ప్రసాద్, ఫౌండేషన్ నిర్వాహకులు సూదనగుంట కృష్ణమూర్తి, వారి కుటుంబీకులు వెంకట సుబ్బారావు, వేణుబాబు, కళ్యాణ్ ప్రసాద్, రాఘవమ్మ, జనసేన పార్టీ అధికార ప్రతినిధి రాయపాటి అరుణ, రాష్ట్ర కబాడీ అసోసియేషన్ అధ్యక్షులు జి వెంకటరెడ్డి, కార్యదర్శి వై శ్రీకాంత్, జిల్లా అధ్యక్షులు కుర్రా భాస్కర్ రావు, జాతీయ కబాడీ క్రీడాకారుడు, హైదరాబాద్ డి.ఎస్.పి అన్ను వేణుగోపాల్ తదితరులు వీరికి బహుమతులు అందజేశారు. మహిళ విభాగంలో కృష్ణ టీం విన్నెర్స్ గారు, విజయనగరం టీం రన్నర్స్‌గా గెలుపొందారు. ఒక్క పాయింట్ తేడాతో కృష్ణ టీం గెలుపొందినది. మహిళలు విభాగంలో టి అశ్విని కృష్ణ టీం ఆల్ రౌండ్ ఛాంపియన్‌షిప్ సాధించారు. ఫ్లడ్ లైట్స్ వెల్తురు మాట్స్ మధ్య నాలుగు రోజులు పాటు సంతనూతలపాడు హై స్కూల్లో వైభవంగా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను ఎన్ఆర్ఐ డాక్టర్ రాఘవేంద్ర ప్రసాద్ పర్యవేక్షణలో విజయవంతంగా జరిగినవి. ఈ సందర్భంగా డాక్టర్ రాఘవేంద్ర ప్రసాద్, కళ్యాణి ప్రసాద్, ఎస్ కృష్ణమూర్తి, రాఘవమ్మ, సోదరుడు ఎస్ వెంకట సుబ్బారావు ఘనంగా సత్కరించారు. విజయవంతంగా కబాడీ పోటీలను రాష్ట్రస్థాయిలో ఏర్పాటు చేసేందుకు గాను డాక్టర్ రాఘవేంద్ర ప్రసాద్‌ను ఎమ్మెల్యేలు నరసింహారెడ్డి, విజయ్ కుమార్, నాగేశ్వర రావులు అభినందించారు. ఈ పోటీలను ఫౌండేషన్ నిర్వాకులు సూ దనగుంట కృష్ణమూర్తి పర్యవేక్షణలో ఎస్ వేణుబాబు, మందాడి వెంకటేశ్వర్లు, ముప్పరాజు శ్రీనివాసరావు, పి నారాయణస్వామి చౌదరి, బొడ్డు శంకర్ బాబు, చిట్టెం శెట్టి శ్రీనివాసరావు, సాదినేని శ్రీరామ్ మూర్తి తదితరులు పర్యవేక్షించారు. జెంట్స్ విభాగంలో ప్రకాశం ఈస్ట్ గోదావరి జట్టు మధ్య ఫైనాన్స్ రసవత్తరంగా జరుగుతున్నది. మొదట సంతనూతలపాడు లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో తానా మాజీ అధ్యక్షులు డాక్టర్ రాఘవేంద్ర ప్రసాద్ కళ్యాణ్ ప్రసాద్ దంపతులు వారి కుటుంబీకులు పూజలు నిర్వహించారు. ఒంగోలు ఇందిరా ప్రియదర్శిని లా కళాశాల వారు గెలుపొందిన వారికి ఒక్కొక్కరికి 15000 వంతున ప్రోత్సహ నగదును అందజేశారు. ఈ సందర్భంగా గెలుపొందిన టీములకు మెమెంటోలు, ప్రశంసాపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి అడకా స్వాములు, మండల టిడిపి అధ్యక్షులు మద్దినేని హరిబాబు, సూదనగుంట కుటుంబీకులు కెవి రమణయ్య, కళ్యాణ్ చక్రవర్తి, గ్రానైట్ అధినేత చలువా ది బద్రీనారాయణ, జిల్లా ఆర్యవైశ్య నాయకులు పబ్బిశెట్టి శ్రీనివాసరావు, మాజీ జెడ్పిటిసి తన్నీ,రు శ్రీనివాసరావు, మాజీ సర్పంచి ఆర్ అంకారావు, మండల టిడిపి మహిళా అధ్యక్షురాలు ఎన్ మాధవి లత, టిడిపి నాయకులు ఆర్వి సురేష్ బాబు టి నరసింహారావు, మార్పుడి జనార్ధన్, ఆళ్ల రాము, చెరుకూరి వెంకటసుబ్బయ్య, మండల టిఎన్టియుసి అధ్యక్షులు మందాడి వెంకటేశ్వర్లు, మండల తెలుగు యువత అధ్యక్షులు ముప్పరాజు శ్రీనివాసరావు జిల్లా కబాడీ అసోసియేషన్ కార్యదర్శి వై పూర్ణచంద్రరావు కోఆర్డినేటర్ వై సీనయ్య,రాష్ట్ర, జిల్లా కబాడీ అసోసియేషన్ ప్రతినిధులు అర్జున్ రావు, రమేష్, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

**ప్రకాశం టీమ్ విన్నర్స్...**

పురుషులు విభాగంలో ప్రకాశం, ఈస్ట్ గోదావరి టీములు ఫైనల్‌లో జట్టు గెలుపొందినది. ప్రకాశం జట్టుకు 51 పాయింట్స్, ఈస్ట్ గోదావరి జట్టుకు 40 పాయింట్స్ వచ్చినవి. ప్రకాశం టీమ్ విన్నర్స్ గాను, ఈస్ట్ గోదావరి జట్టు రన్నర్స్‌గా గెలుపొందారు. వీరికి ఎమ్మెల్యేలు బి ఎన్ విజయ్‌కుమార్, ఉగ్ర నరసింహారెడ్డి, రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల ప్రధాన కర్త దాత ఎన్నారై డాక్టర్ సూదనగుంట రాఘవేంద్ర ప్రసాద్ తదితరులు బహుమతులు పంపిణీ చేశారు. విజేతలను వారు అభినందించారు.







## జిల్లా జైలును పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి

**ఒంగోలు, ప్రభాతవార్త**



అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మంగళవారం జైలులోని ఖైదీలకు అవగాహనా సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఒంగోలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ శ్యాం బాబు పాల్గొని జైలులో ఖైదీల సదుపాయాలని పరిశీలించారు. అనంతరం అవగాహనా సదస్సులో పాల్గొని మానవ హక్కులు వాటి పరిరక్షణ గురించి వివరించడం జరిగింది. గౌరవ జిల్లా న్యాయమూర్తి వారు మాట్లాడుతూ జైలులో ఉన్న ఖైదీలకు అయినను వారికి ఉన్న అన్ని హక్కులు కల్పించడానికి న్యాయస్థానాలు సహకరిస్తాయన్నారు. ఖైదీలకు ఆహారము, ఇతర మౌళిక సదుపాయాలు కల్పించడం, వారి కుటుంబ సభ్యులను కలవడానికి ములాఖాత్ సదుపాయం వాటి ప్రభుత్వము వారు కల్పించారు అని వివరించారు. సెక్రటరీ, న్యాయ సేవాధికార సంస్థ ఒంగోలు మాట్లాడుతూ అవసరమున్న ఖైదీలకు ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామన్నారు. జిల్లా జైలు, ఒంగోలులో ఏర్పాటు చేసి ఉన్నా గ్రంధాలయంలో ఎన్నో రకాల పుస్తకములు అందుబాటులో ఉన్నాయని అవి చదువుకొని జీవితమును మంచి మార్పునకు దోహదపడే లా ఉపయోగించుకోవాలని ఆయన ఖైదీలకు సూచించారు. ఈ కార్యక్రమంలో జైలు పర్యవేక్షణాధికారి( ఇన్చార్జి) వి. రమేష్, శ్రీనివాసరావు, జైలు మెడికల్ ఆఫీసర్, బ్రహ్మ తేజ, చీఫ్ హెడ్ వర్డర్, అర్జున్‌రావు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.




## చర్చి పాస్టర్‌ను కఠినంగా శిక్షించాలి

**ఒంగోలుటౌన్, ప్రభాతవార్త**

నెల్లూరు జిల్లా ఆదూరుపల్లి చర్చి పాస్టర్‌ను గిరిజన బాలికను హత్య చేసినందుకు వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి హేతువాద సంఘం డిమాండ్ హేతువాద సంఘం జాతీయ అధ్యక్షులు నార్నె వెంకటసుబ్బయ్య, రాష్ట్ర అధ్యక్షులు యం. కె. బేగ్ లు డిమాండ్‌చేశారు. నెల్లూరు జిల్లా చేజర్ల మండలం ఆదూరుపల్లి చర్చిలో చనిపోయిన ఎనిమిదేళ్ల గిరిజన బాలికకు స్వస్థత ప్రార్థనలతో అనారోగ్యాన్ని తొలగిస్తానని చెప్పి ఎటువంటి వైద్య సహాయం అందకుండా చేసి నెల రోజులు తన దగ్గరే ఉంచుకుని గిరిజన బాలిక చనిపోవటానికి కారణమైన ఆదూరుపల్లి చర్చి పాస్టర్‌ను హత్యానేరం కింద వెంటనే అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు.

## ఈ పంట నమోదు తప్పని సరిగా చేయించుకోవాలి

**అద్దంకి, డిసెంబరు 10, ప్రభాతవార్త**




ఈ పంట నమోదు తప్పని సరిగా చేయించుకోవాలని అద్దంకి సహాయ వ్యవసాయ సంచాలకులు కె. ధన్‌రాజ్ అన్నారు. మణి కేశ్వరం మరియు కొంగపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో మాట్లాడుతూ ఈనెల 15 తేది లోపు అందరూ పంటల భీమా చేయించుకోవాలని, వరి పంటకు ఈనెల 31వ వరకు సమయం ఉందని తెలిపారు. శనగకు ఎకరాకు 84 రూపాయలు, మొక్కజొనకు 105 రూపాయలు, వరికి 126 రూపాయలు చెల్లించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ వర్షాలకు రైతులు అప్రమత్తంగా వుండాలని తెలిపారు. నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. తేమ అధికంగా వున్నచోట యూరియా చల్లుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి ఎస్.దీప్తి, గ్రామ వ్యవసాయ సహాయకులు రాణి, కరిముల్లా, గుడిపూడి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

## రోటరీ ఆధ్వర్యంలో రక్తదానం

**అద్దంకి, డిసెంబరు 10, ప్రభాతవార్త**




రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి వారి ఆధ్వర్యంలో రక్త హీనత సమస్యతో బాధపడుతున్న షేక్ ఫాతిమా(32)కు వైద్యులు అత్యవసరంగా బి.నెగటివ్ రక్తం అసరం కాగ, రోటరీ బ్లడ్ బ్యాంకు డైరెక్టర్, కార్యదర్శి చుండూరి మురళీ సుధాకరరావు అద్దంకికి చెందిన పొన్నూరి సాయి సురేష్‌ని ప్రోత్సహించి రక్తదానం చేయించారు. బి.నెగటివ్ అరుదుగా లభించే గ్రూప్. ఇది సాయి సురేష్ చేసిన 8వ రక్తదానం. చుండూరి మురళీ సుధాకరరావు ప్రోత్సహించిన 436వ రక్తదానం కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మురళీ సుధాకరరావుని, రక్తదాత సాయి సురేష్‌ని రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య అభినందించారు.

## కాబోయే రాజ్యసభ సభ్యులకు అభినందనలు తెలిపిన ముత్తుముల

**గిద్దలూరు, డిసెంబర్ 10 ప్రభాతవార్త :**



విజయవాడ అసెంబ్లీ నందు తెలుగుదేశంపార్టీ తరపున రాజ్యసభ సభ్యులుగా ఎంపికై నామినేషన్లు వేస్తున్న సందర్భంగా బీదా మస్తాన్ రావు, సానా సతీష్‌లను టిడిపి ప్రజా ప్రతినిధులతో కలిసి గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీద మస్తాన్ రావు, సానా సతీష్‌లు టిడిపి తరపున రాజ్యసభ సభ్యులుగా ఎంపిక కావడంపట్ల టిడిపి ముఖ్య నాయకులతో కలిసి ఆయన ఎమ్మెల్యే అశోక్ రెడ్డి వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## కస్టర్ ఇన్చార్జి రాము ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం

**బేస్తవారిపేట, డిసెంబర్ 10 ప్రభాతవార్త :**



గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి సూచనల మేరకు బేస్తవారిపేట పంచాయితీ 7వవార్డులో కస్టర్ ఇన్చార్జి ముప్పూరి రాము ఆధ్వర్యంలో మంగళవారం తెలుగుదేశంపార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త సభ్యత్వాల నమోదు మరియు సభ్యత్వాలను రెన్యూవల్ చేసే ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా బేస్తవారిపేట క్లస్టర్ ఇన్చార్జి ముప్పూరి రాము మాట్లాడుతూ టిడిపి సభ్యత్వం వలన ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి సూచనల మేరకు పంచాయితీలో సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రతిఒక్క టిడిపి కార్యకర్త తెలుగుదేశంపార్టీ సభ్యత్వాలను తీసుకోవాలని మరియు ఇంతకుముందే సభత్వాలు తీసుకునట్లయితే వాటిని రెన్యూవల్ చేయించుకోవాలని ముప్పూరి రాము తెలిపారు. ఈ కార్యక్రమంలో 83వ బూత్ కన్వీనర్ అవ్వారి రామకృష్ణ, 7వ వార్డు సభ్యులు దూదేకుల శివ, దూదేకుల నాగూర్, గుంటి సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## కొమ్మునూరు, కొత్తకోటలో పొలం పిలుస్తోంది


**గిద్దలూరు రూరల్, డిసెంబర్ 10 ప్రభాతవార్త :**



మండలంలోని కొమ్మునూరు, కొత్తకోట గ్రామాల్లో మండల వ్యవసాయ శాఖాధికారి విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖాధికారి విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ 2024-25 రబీ సీజన్కు సంబంధించి ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజనా పథకం క్రింద రైతులు స్వతహాగా వారే పంట భీమాకి రైతువాటా ప్రీమియం చెల్లించాలని తెలిపారు. ఈ సీజన్‌లో ప్రకాశం జిల్లాలో శనగ, మినుము, వరి, జొన్న, మొక్కజొన్న, ఎండు మిరప మొదలైన పంటలు పంటల భీమా పథకం క్రింద వర్తిస్తాయని తెలిపారు. పంట భీమా శనగ, జొన్న, మొక్కజొన్న, ఎండు మిరప, మినుములు పంటలకు ఈనెల 15వ తేదీ వరకు, వరి పంటకు ఈనెల 31వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. పంటలు భీమా చేయదలచిన వారు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకాలు, పంట ధృవీకరణ పత్రం, బ్యాంకు అకౌంట్, ఫోన్ నెంబర్, మొదలైనవి తీసుకొని దగ్గరలోని మీ సేవ, సిఎస్సి సెంటర్ బ్యాంకులలో మొదలైన చోట్ల పంట భీమా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. రైతులు తమ పంటలకు నిర్ణయించిన ధరలను చెల్లించి పంటబీమాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఉద్యానవన శాఖాధికారిణి విష్ణుప్రియ మాట్లాడుతూ ప్రస్తుతం మిరపలో నల్ల నల్లి మరియు తామర పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని గమనించడం జరిగిందని కావున రైతులు ప్రొఫెక్లో 57శాతం ఈసి 400-500మి.లీ స్పైరోమెసిఫెన్ 240 ఎస్‌సి 200మి.లీ ఎకరాకు పిచికారి చేయాలని సూచించారు. గ్రామ సభ అనంతరం కంది, టమాటో, మొదలైన పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. కార్యక్రమంలో కొమ్మునూరు సర్పంచ్ రామసుబ్బారెడ్డి, విస్తరణాధికారి శ్రీనివాస రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు నబీ యూనస్, మస్తాన్ వలి మరియు రైతులు పాల్గొన్నారు.

## స్థానిక సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణా కార్యక్రమం

**బేస్తవారిపేట, డిసెంబర్ 10 ప్రభాతవార్త :**



మండలంలోని ఎంపిడిఓ కార్యాలయంలో మంగళవారం మొదటి బ్యాచ్‌కు స్థానిక సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, అధికారులకు గ్రామ పంచాయితీలు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, ప్రాముఖ్యతలు గురించి వివరించారు. సుస్థిర లక్ష్యాలు సాధించుటలో సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తగిన పాత్ర పోషించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని పంచాయితీల సర్పంచ్‌లు, గ్రామ సచివాలయాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రాచర్లలో ఘనంగా అయ్యప్ప స్వాముల విళక్కి ఉత్సవం

**రాచర్ల, డిసెంబర్ 10 ప్రభాతవార్త :**



మండల కేంద్రమైన రాచర్లలో హరిహరసుతుడు శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి విళక్కి ఉత్సవ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. రాచర్ల గ్రామంలోని పురవీధులలో కోలాటాలు చేసుకుంటూ ఈ కార్యక్రమం వైభవంగా సాగింది. కార్యక్రమం అనంతరం అయ్యప్ప మాలాధారులు మెట్లపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వామి మాలాధారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మెట్లపూజ కార్యక్రమాన్ని తిలకించారు.

## అనుములపల్లిలో పొలం పిలుస్తోంది

**రాచర్ల, డిసెంబర్ 10 ప్రభాతవార్త :**



మండలంలోని అనుములపల్లి, సత్యవోలు గ్రామాలలో మండల వ్యవసాయ శాఖ అధికారి షేక్ అబ్దుల్ రఫిక్ మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముందుగా రైతులతో ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రకాశం జిల్లాలో ఆరు పంటలకు ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజనా పథకం వర్తించే విధంగా ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఆ పథకం పొందేందుకు రైతులు దగ్గర్లోని సిఎస్సి సెంటర్లలో ప్రీమియం చెల్లించి అర్హత పొందాలన్నారు. వరి, మిరప, మొక్కజొన్న, జొన్న, పప్పుశనగ పంటలకు మాత్రమే ఈ అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని అదికూడా రబీ సీజన్‌లో సాగు చేసిన వాటికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుందన్నారు. కాబట్టి రైతులు ఈ విషయంపై అవగాహన కలిగి ఉండాలని ప్రీమియం చెల్లించి అర్హత పొందాలని ఆయన కోరారు. వ్యవసాయశాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించి పంటల సాగుపై మొగ్గు చూపించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ గ్రామ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులకు శ్రీకారం ప్రజా దర్బారు

### - ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి

**మార్కాపురం రూరల్, డిసెంబర్ 10 ప్రభాతవార్త :**




మండలంలోని కోలభీమునిపాడు గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సదస్సులో మార్కాపురం నియోజకవర్గ శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల వైసిపి పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని ఎక్కడ చూసినా భూ కబ్జాలు, దోపిడీలు పెరిగిపోయాయని, ప్రజలను భయాందోళనకు గురిచేసే భూములను వైసిపి నాయకులు కబ్జాలు చేసి దోచుకున్నారని తెలిపారు. దానిని నివారించడానికి తెలుగుదేశం ప్రభుత్వంలో పార్టీ కేంద్ర కార్యాలయం నందు ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని అందులో సుమారు 78వేలమంది రెవెన్యూ సమస్యలతో అర్జీలు ఇచ్చారని, ఇది పరిశీలించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టారని అన్నారు. ల్యాండ్ గ్రాబింగ్ చట్టం ద్వారా గత ఐదు సంవత్సరాలలో భూ కబ్జాలకు పాల్పడిన వారి భరతం పడతామని, ఈ చట్టంలో నిందితులుగా తేలితే కఠిన శిక్షలు ఉంటాయని అన్నారు. అందువలన ప్రతి గ్రామంలో తండోప తండాలుగా ప్రజలు హాజరై అర్జీలు ఇస్తున్నారని పేర్కొన్నారు. వాటిని తగు రీతిన పరిశీలన జరిపి త్వరలోనే పరిష్కరిస్తామని తెలియజేశారు. ప్రజలకు ఏ రెవెన్యూ సమస్య ఉన్నా ఈ రెవెన్యూ సదస్సులో అర్జీలను సమర్పించాలని కోరారు. త్వరలోనే ప్రజలకు నూతన రేషన్ కార్డులు, పెన్షన్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశిల్దార్ చిరంజీవి, సర్వేయర్, రెవెన్యూ అధికారులు, సచివాలయం సిబ్బంది, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి

**మార్కాపురం రూరల్, డిసెంబర్ 10 ప్రభాతవార్త :**



మండలంలోని రాయవరం రైల్వేవంతెనపై అన్నాదమ్ములు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం అదుపుతప్పిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ఉన్న తమ్ముడు చిలకా యశ్విన్ అనే యువకుడు అక్కడికక్కడే మృతిచెందగా మరొక వ్యక్తికి గాయాలుకాగా క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం మార్కాపురం ప్రభ్వు వైద్యత్వ వైద్యశాలకు తరలించినట్లు సమాచారం. రాయవరం రైల్వే వంతెన మార్కాపురం మండలానికి చుట్టుప్రక్కల గ్రామాల వాహనదారులకు శాపముగా మారిందని, రెండు రోజుల క్రితం ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మరువక మునుపే ఇది జరగడంతో స్థానిక ప్రజలు బెంబేల్లెత్తుతున్నారు. ఈ వంతెనపైన మలుపు మార్గాన ఇప్పటికీ 10మందికి పైగా వాహనదారులు మృతిచెందినారాని, ఆర్అండ్‌బి అధికారులు ఇప్పటికైనా ఈ సమస్యపై స్పందించి వాహనదారులు వంతెన మలుపుపై యాక్సిడెంట్లు కాకుండా డేంజర్ జోన్ బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయవలసిందిగా పలువురు కోరుతున్నారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మొక్కజొన్న, మిరప పంటలను పరిశీలించిన ఏఓ దేవిరెడ్డి

**మార్కాపురం రూరల్, డిసెంబర్ 10 ప్రభాతవార్త :**

మండలంలోని నికరంపల్లి, పెద్దనాగులవరం గ్రామాలలో మంగళవారం వ్యవసాయ శాఖాధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో రైతులు సాగు చేసిన మొక్కజొన్న, మిరప పంటలను పరిశీలించి మొక్కజొన్న పంటలో కత్తెర పురుగును గమనించడం జరిగిందని ఆయన తెలిపారు. దాని నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 100గ్రాములు, లేదా క్లోరాన్ ట్రినిపోల్ 60మి.లీ ఒక ఎకరాకు పిచికారి చేసుకోవాలని సూచించారు. అనంతరం నికరంపల్లి, పెద్ద నాగులవరం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి రబీ సీజన్ 2024-25 నందు రైతులు వేసిన అన్ని పంటలను రైతు సేవా కేంద్రంలోని సిబ్బందిని సంప్రదించి పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజనా పథకం ద్వారా శనగ, మిరప, మొక్కజొన్న, జొన్న, మినుము పంటలను సాగు చేసిన రైతులు భీమా చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపి ఎంఐసి ఓబయ్య, నికరంపల్లి, పెద్ద నాగులవరం విఏఏలు గణేష్, సాగర్, నవ్యభారతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## 14న మండలంలో నీటి సంఘాల ఎన్నిక : తహశిల్దార్ చిరంజీవి

**మార్కాపురం రూరల్, డిసెంబర్ 10 ప్రభాతవార్త :**



మండలంలోని 48టిసిలకు, 8 నీటి వినియోగదారుల సంఘాల అసోసియేషన్‌లకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు డిసెంబర్ 14వ తేదీ రెండవ శనివారం ఎన్నిక నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని తహశిల్దార్ చిరంజీవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తహశిల్దార్ మాట్లాడుతూ ఈ ఎన్నిక కోసం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాలతో ఇప్పటికే ఎన్నికల అధికారులకు (ఈఓ) డివిజనల్ స్థాయిలో జిల్లా రెవెన్యూ అధికారి, సబ్ కలెక్టర్, ఆర్‌డిఓలు, మాస్టర్ ట్రైనీల ఆధ్వర్యంలో శిక్షణనివ్వడం జరిగిందని తెలిపారు. రెవెన్యూ సదస్సులు జరుగుతున్నప్పటికీ నేడు బుధవారం తహశిల్దార్ కార్యాలయం నందు ఈఓ, ఏఈఓ, పిఓ, ఏపిఓలకు ఎన్నిక నిర్వహణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధులను వివరించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఓటర్లు ఈనెల 14 ఉదయం 8గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు తమ ఓటును వినియోగించుకోవాలని సూచించారు. అదేరోజు 46టిసిలను, ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌లను ఎన్నుకోవడం జరుగుతుందని తెలిపారు.

## నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే మా లక్ష్యం: ఎస్ఇ

**మార్కాపురం రూరల్, డిసెంబర్ 10 ప్రభాతవార్త :**



పట్టణంలోని తర్లుపాడు రోడ్డులోగల విద్యుత్ కార్యాలయం నందు ఏడి నాయక్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మార్కాపురం ఎర్రగొండ పాలెం సబ్ డివిజన్ పరిధిలో పర్యవేక్షించిన ఏపిసిపి డిసిఎల్ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మార్కాపురం, ఎర్రగొండపాలెం సబ్‌డివిజన్ పరిధిలో గల అధికారులతో చర్చించడం జరిగిందని, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని, ఎటువంటి ఆటంకం లేకుండా ట్రాన్స్‌ఫార్మర్స్ ఎప్పటికప్పుడు పరిరక్షించాలని తెలియజేయడం జరిగిందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న బకాయిలను వసూలు చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యలు పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

**యర్రగొండపాలెం, డిసెంబర్ 10, ప్రభాతవార్త**



గత ప్రభుత్వంలో రీసర్వే జరిగిన గ్రామాలతోపాటు ఇతర గ్రామాల్లో భూ సమస్యలు ఎక్కువగా ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం సమస్యలు పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు మార్కాపురం సబ్‌కలెక్టర్ తెలి పారు. మంగళవారం నాడు య ర్రగొండపాలెం మండంలోని వెంకటాద్రిపాలెం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 22ఏ ఈ నామ్ భూములు ప్రభుత్వ భూములు అమ్మించుకున్న స్వాదీనం చేసుకున్న తదితర సమస్యలు పరిష్కారానికి ఈ సదస్సులు ఎంతో ఉపయోగపడతాయని గ్రామస్తులకు తెలిపారు. రైతుకు పట్టదారు పాసుపుస ్తకాన్ని అందజేశారు. కార్యక్రమంలో తాహశీల్దార్ బాలకిషోర్, డిటి మల్లికార్జున నాయుడు, వీఆర్వోలు, సర్వేయర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారంలో అలసత్వం చేయొద్దు

### - తహసిల్దార్ ఏ సురేష్

**కొనకనమిట్ల, డిసెంబర్ 10, ప్రభాతవార్త**



భూ సమస్యల పరిష్కారంలో ఆల సత్వం చేయొద్దని తహసిల్దార్ ఆవుల సురేష్ సూచించారు. మంగళవారం కొనకనమిట్ల సశివాలయ ఆవరణలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజల నుంచి తీసుకున్న అర్జీలకు వీలైనంత త్వరగా పరిష్కరించేలా వీఆర్వోలు చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. స్మశాన కుంటస్థలం అక్రమణాలకు గురిందని ఎస్సీలు కొందరు గ్రామ సదస్సులో తాహ సిల్దార్ విన్నవించుకోగా స్పందించిన తహసిల్దార్ సురేష్ ఆర్ ఐ మహాదేవరెడ్డి, వీఆర్వో శ్రీనివాసరెడ్డి, సర్వేయర్ శివ శంకర్ రెడ్డి తో కలిసి స్మశాన కుంటస్థలాన్ని పరిశీలించారు. అక్రమణల కు గురైన స్థలానికి కొలతలు తీసి హద్దులు వేయాలని విఆర్ఓ, సర్వేయర్ల కు సూచించారు. జాతీయ రహదారి నుంచి తువ్వాపాడుకు వెళ్లి పొలాల రహదారి వివాదస్పదంగా ఉండడంతో అక్కడికి వెళ్లి సంబంధించిన రైతులతో మాట్లాడారు. త్వరలో పరిష్కరించాలని విఆర్ఓ ను ఆదేశించారు. ఎ ఎ పాఠశాలను సందర్శించి విద్యార్థులను పలు ప్రశ్నలు నడిగి సమాధానం రాబట్టారు. భూ సమస్యలతో పాటు, రేషన్ కార్డులు, ఇంటి స్థలాలు మంజూర చేయాలని 22 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో పలువురు తొందరగా విఆర్వోలు, సర్వేయర్ రాజశేఖర్, టిడిపి నాయకులు శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వేమవరం, కొప్పరపాలెంలలో పొలంపిలుస్తోంది

**బల్లికురవ డిసెంబర్ 11( ప్రభాతవార్త)**




మండలంలోని కొప్పెరపాలెం, వేమవరం గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి కుమారి రైతులతో కలిసి మొక్కజొన్న, పొగాకు పొలాలను సందర్శించి మొక్కజొన్న లో కత్తెర పురుగు నివారణకు సూచనలు చేసారు. రబీలో పంటలు సాగుచేసిన రైతులు రైతు సేవా కేంద్ర సిబ్బందిని కలిసి వివరాలు తెలిపి ఈ పంట లో నమోదు చేసుకోవాలన్నారు. వరి, మొక్కజొన్న, శనగ సాగుచేసిన రైతులు పంటల భీమా చేసుకోవాలన్నారు. వరికి చివరి తేదీ డిసెంబర్ 31 వరకు, శనగ, మొక్కజొన్న పంటలకు పంటల భీమా చేసుకోవడానికి చివరి తేదీ డిసెంబర్ 15 అని తెలిపారు.

## స్వచ్ఛభారత్ ర్యాలీ

**బల్లికురవ డిసెంబర్ 11 (ప్రభాతవార్త)**




ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవంలో భాగంగా మంగళవారం సాయంత్రం ర్యాలీ నిర్వహించారు .స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ప్ల కార్డులు ప్రదర్శిస్తూ, స్వచ్ఛభారత్ నినాదాలతో స్వచ్ఛభారత్ ర్యాలీ కార్యక్రమం కొనసాగింది .ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో కుసుమకుమారి మాట్లాడుతూ అపరిశుభ్ర పరిస్థితుల కారణంగానే ప్రమాదకర వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని, పరిసరాల పరిశుభ్రత లక్ష్యంగా గ్రామీణ ప్రాంత ప్రజా నీకం మమేకమైన రోజున పచ్చని పల్లె సీమలు మరింత ప్రగతి పథంలో పయనిస్తాయన్నారు. ప్రతి ఒక్కరు స్వచ్ఛభారత్ తమ బాధ్యతగా గుర్తెరిగి ముందుకు సాగాలన్నారు . స్థానిక న్నత పాఠశాల విద్యార్థులచే బల్లికురవ కూడలిలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ గిరి నాయక్, ఎమ్మార్సీ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సబ్సిడీతో కూడిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రైతులు సద్వినియోగంచేసుకోవాలి

**సంతనూతలపాడు, ప్రభాతవార్త**



సంతనూతలపాడు మండల వ్యవసాయ అధికారిని పి. పావని కోరారు. సంతనూతలపాడు మండలం గుమ్మలంపాడు, తక్కెళ్ళపాడు గ్రామాల్లో మంగళవారం జరిగిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఏవో పావని పాల్గొని రైతులకు తెలియజేశారు. ఎక్కడ చనగ పంటకు 368రూపాయలు, మినుము పంటకు 103రూపాయలు, మొక్కజొన్నకు 105 రూపాయలు, ఎండుమిరపకు 525రూపాయలు, జొన్నకు 60 రూపాయలు రైతు వాటా చెల్లిస్తే పంటల బీమా పథకం అమలు అవుతుందని ఏవో పావని తెలిపారు. 2024వ సంవత్సరం డిసెంబర్ 15వ తేదీ లోపు 215 రూపాయలు, డిసెంబర్ 31వ తేదీ లోపు కామన్ సర్వీస్ సెంటర్ లో రైతు వాటా చెల్లించాలని ఏవో పావని పేర్కొన్నారు. రైతులు ప్రతి ఒక్కరూ రైతు భరోసా కేంద్రాల్లో ఈ పంట నమోదు చేసుకోవాలని కోరారు. తద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు లభిస్తాయన్నారు. మినుము, కంది పంటలను పరిశీలించి రైతులకు సస్యరక్షణ చర్యలపై వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ఎస్ వెంకట్రావు, కేవీ సుబ్బారెడ్డి, గ్రామాల వ్యవసాయ సహాయకులు ఏ రవికుమార్ షేక్ అబ్దుల్లా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాస్థాయిలో చిలకపాడులో 99. 24 శాతం పెన్షన్లు తనిఖీ చేసిన అధికారులు బృందం


**సంతనూతలపాడు, ప్రభాతవార్త**



సంతనూతలపాడు మండలం చిలకపాడు గ్రామంలో పైలట్ ప్రాజెక్టు కింద అధికారుల బృందం 9 10 తేదీల్లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను 99.24 శాతం మేరకు ఇంటింటా లబ్ధిదారులను తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, తమిమ్ ఆన్సరియా, డి ఆర్ డి ఏ. జిల్లా పిడి వసుంధర ఆదేశాల మేరకు జిల్లాలోని 10 మండలాల్లోని అధికారులు బృందం ఈ పెన్షన్లను ఇంటింటా వారి ఆర్థిక స్థితిగతులు తనిఖీ చేసి యాప్ లో నమోదు చేశారు. ఈనెల 9వ తేదీన 397 పెన్షన్లకుగాను 380 పెన్షన్లను తనిఖీ చేశారు. ఈనెల 10వ తేదీన ఇతర గ్రామాల నుండి వచ్చిన మరొక 14 మంది పెన్షన్లను అధికారుల బృందం తనిఖీ చేశారు. డిఆర్డిఏ ఏపీడి జిల్లా అసిస్టెంట్ పెన్షన్ విభాగం కోఆర్డినేటర్ జీవి వరప్రసాద్, టెక్నికల్ కోఆర్డినేటర్ నాగేశ్వ రరావు, పలువురు అధికారులు, సచివాలయం సిబ్బంది ఈ పెన్షన్లను తనిఖీ చేశారు. ఎంపీడీవో డి సురేష్ బాబు పర్యవేక్షణలో చిలకపాడు పంచాయతీ కార్యదర్శి జి రామ్ మోహన్ రావు, వెల్ఫేర్ అసిస్టెంట్ ఎస్ ప్రతాప్ కుమార్ ఆయా అధికారుల బృందానికి పెన్షన్ దారుల వివరాలను తెలియజేశారు.

## దేశంలో విద్యుత్ వాహనాల పెంపుపై పార్లమెంటులో మాగుంట ప్రశ్న

**ఒంగోలు టౌన్, ప్రభాతవార్త**




దేశం, ఆంధ్రప్రదేశ్ లో గత 5 సంవత్సరాలలో విద్యుత్ వాహనాల ఉత్పత్తి, పెంపుదల పథకాలు, స్థాపించిన ఫ్యాక్టరీలు, కేటాయించిన - వాడిన నిధులు, లబ్ధిదారులు గురించి ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. కేంద్ర భారీ పరిశ్రమలు శాఖ మంత్రి హెచ్. డి. కుమారస్వామి సమాదానమిస్తూ - భారత ఆటోమొబైల్ ఉత్పత్తిదారుల సంఘం అందజేసిన రాయితీల ప్రకారం దేశంలో 201920 లో 177.50 వేలు, 202021 లో 143.04 వేలు , 2021 22 లో 462.74 వేలు, 202223 లో1,203.48 వేలు మరియు 202324 లో 1,682.03 వేలు ప్రయాణీకుల, వాణిజ్య, మూడు చక్రాల మరియు రెండు చక్రాల విధ్యుత్ వాహనాలు ఉత్పత్తి అయ్యాయని తెలిపారు. దేశంలో గత 5 సంవత్సరాలలో 2 ఉత్పత్తి అనుబందిత ప్రోత్సాహ పథకాల క్రింద రూ. 44,038 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని, ప్రయాణీకుల విధ్యుత్ వాహనాలు తయారీ పథకం క్రింద దిగుమతి చేసుకొనే వాహనాలకు 15 శాతం కస్టమ్స్ సుంకం తగ్గించబడిందని తెలిపారు. దేశం మొత్తంలో 257 తయారీ యూనిట్లు వుండగా, ఆంధ్రప్రదేశ్‌లో 4 యూనిట్లు వున్నాయని తెలిపారు. దేశీయ ఉత్పత్తుల కొనుగోళ్ళను ప్రోత్సహించుటకు కేంద్ర భారీ పరిశ్రమలు శాఖ తరచుగా ప్రచార కార్యక్రమాలను, సంప్రతింపులను మరియు సమావేశాలను నిర్వహిస్తుందని మరియు 2024 లో 5 ప్రధాన సమావేశాలను నిర్వహించిందని కేంద్ర మంత్రి తెలియజేశారు.

11 -12 pg 9.qxd:11 -12 pg 9.qxd 01/01/01 11:05 AM Page 1



# పాములను పట్టుకోవడంలో రికార్డ్

'కన్నా అగరా'... అంటూ ప్రేమగా వాటి వెనుక పరిగెడుతుందీమె. అలాగని కుక్కో, పిల్లో అనుకోవద్దు. భయంతో పారిపోతున్న పాములని, వాటివి ఇలానే పట్టుకుంటుంది. వాటిని ముద్దుగా చేతుల్లోకి తీసుకుని దూరంగా ప్రాంతంలో వదిలి మరీ వస్తుంది ఛత్తీస్‌గఢ్‌కు చెందిన. పాండే నర్సుగా వైద్యసేవలు అందిస్తూనే పాముల్నీ సంరక్షి స్తోంది.

హాలో... అజితాపాండేగారా! మా ఇంట్లో పాము దాక్కుందండి. భయంగా ఉంది. కొంచెం వస్తారా..." ఇలాంటి కాల్స్ ఆమెకు తరచూ వస్తాయి. వెంటనే అక్కడికి చేరి పాముని వెతికి ఒడిసి పట్టుకుంటుంది. అంతే, హమ్మయ్య పాముని ఎక్కడ దొరికిందని ఊపిరిపీల్చుకుంటూ ఉంటే, ఎక్కడ వదలాలని అక్కడవదుతుందీమె. ఉండే ఇంటికి పాములు ఎక్కువగా వచ్చేవి. దానికి పాములను పట్టేవాళ్లను పిలిచేవారు ఆసక్తితో పాములు పట్టుకునే వాళ్ళు క్రమేపీ వాటిని నేర్చుకుంది దాదాపు పదేళ్ల నుంచి పాములు పట్టి, వాటిని సురక్షి తమైన





ప్రాంతంలో వదిలివస్తున్న అజిత, ఆపై వసతి శాఖతో, పలు ఎన్జీవోలతో కలిసి పనిచేయడం ప్రారంభించారు. ఇప్పటి వరకు వేల పాములను రక్షి ంచా. కేవలం లాక్‌డౌన్‌లో వీటిని పట్టుకోవడంలో నిల్వశాఖాధికారులతో కలిసి పనిచేస్తూ దాదాపు 900కు పైగా పాములను రక్షి ంచిసురక్షి తప్రాంతాలకు తరలించాం. ఛత్తీస్ గఢ్ అయిదుశాతం మాత్రమే విషపూరితమైనవి. ఇలా పట్టు కోవడం కొన్నిసార్లు సవాల్గా మారుతుంది. రెండుమూడుసార్లు పాము కాటుకు ఉపయోగించాను. ఓసారి రెస్క్యూకు వెళ్లేసరికి అప్పటికే చుట్టుపక్కల జనం దాన్ని తరుముతూ గాయపరిచారు. తీరా నేను దగ్గరకెళ్లేసరికి నావల్ల అపాయం కలుగుతుందనే భయంతో కాటేసింది వెంటనే చికిత్సతో బయటపడ్డా.. పాముకాటుకు గురైనప్పుడు పావుగంటలోపే యాంటీవీనమ్ అందిస్తే ప్రాణం కాపాడొచ్చు. లేదామెదడు, గుండె విషప్రభావానికి లోనై చనిపోతారు. నేను పామును పట్టి రక్షి ంచే విధానంవీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తాను. వాటిని చంపొద్దు... సంరక్షి ంచాలనిచెబుతూ అందరిలో అవగాహన కలిగిస్తున్న నర్సింగ్ పూర్తిచేసి వైద్యసేవలు అందించా. అభిరుచినీ, వృత్తినీ సమన్వయం చేస్తున్నానని చెప్పే అజితా పాములను పట్టుకోవడంలో' గోల్డెన్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో సంపాదించింది. ◻



అది క్యాన్సర్ ఆసుపత్రి. కీమో థెరపీ చేయించుకున్న రోగుల కళ్లన్నీ గుమ్మంవైపే ఉన్నాయి. అంతలో గుండుతో ఒకామె ఆ గదిలోకి అడుగుపెట్టింది. అంతే... అందరి ముఖాల్లో ఒక్కసారిగా వెలుగొచ్చింది. ఆ వచ్చినామె మరెవరో కాదు, రోజూ రోగులను ప్రేమగా పలకరించి తన కౌన్సెలింగ్‌తో వాళ్లలో ధైర్యాన్ని నింపే అల్పాలోదయ ధరమ్ గుండుతో ఉన్న ఆమెను కూడా కొందరు క్యాన్సర్ బాధితులు అవుతారు. కానీ... బాధితులతో సమానంగా కనిపించడానికి ఆమె చేసే ప్రయత్నమే ఇది. అలా ఆమె రోగుల వేదనను పంచుకుంటూ తనవంతు సేవలందిస్తున్నారు. క్యాన్సర్ బాధితులపట్ల జాలి చూపడం కాదు. వాళ్లూ మనలాంటివాళ్లే అని భావించాలని చెప్పే అల్ప ప్రతి రోగినీ సాధారణ వ్యక్తిగానే చూస్తారు.

అల్పా క్యాన్సర్ అంటే భయం లేదా అని అందరూ అంటున్నా, తన కోసం తను యుద్ధం చేసింది అల్పా తల్లి. చికిత్స పొందుతున్నప్పుడు తోటి రోగుల్లో ధైర్యాన్ని నింపి, వాళ్లకు ఉపశమనం కలిగించేది. తల్లిని చూసి అల్పా స్ఫూర్తి పొందారు. వ్యక్తిగత కారణాలవల్ల అమ్మకు అప్పట్లో ప్రాథమిక సంరక్షకురాలిని కాలేకపోయాననే అపరాధభావం నన్ను వెంటాడింది. అదే నన్ను ఈ సేవారంగంలోకి అడుగుపెట్టేలా చేసింది. క్యాన్సర్ బాధితుల్లో అమ్మను చూసుకుంటూ దాదాపు 20 ఏళ్లుగా నావంతు సేవలందిస్తున్నా. రోగుల మనసులోని వేదనను పంచుకుంటున్నా. బెంగళూరు ఇండియన్ క్యాన్సర్ సొసైటీసహా పలు ఆసుపత్రు ల్లోని

# కేన్సర్ రోగులకు సేవలందిస్తూ..

వాళ్ల అనుభవాలు, భావోద్వేగాలను పంచుకునే అవకాశమిచ్చి, వాళ్లకు తోడుగా నిలుస్తారు. అలా అందరి బాధకూ బాధ కలిగించే ప్రయత్నం చేస్తున్న అల్పా చిన్నప్పుడు అనుకోని విషాదం ఎదురైంది. సాధారణ చెకప్ కోసం వెళ్లిన తల్లి మీనాక్షి కి క్యాన్సర్ నిర్ధారణ అయ్యింది. వ్యాధి చివరిదశలో ఉండటంతో చికిత్సకు లొంగదని, మరో రెండు వారాల్లో తను చనిపోతుందని వైద్యులు చెప్పారు. దీంతో ఆ కుటుంబమంతా తల్లడిల్లింది. నాకేమీ కాదు, భయపడకు.. అంటూ అమ్మ నాకు ధైర్యం చెప్పేది. ఎవరెంత సానుభూతి చూపించినా కుంగుబాటుకు అవసరమైనదికాదు. మానసిక ధైర్యాన్ని చూపూ, వైద్యుల మాటను అమ్మ తలకిందులు చేసి పదేళ్లు జీవించింది. అలా ఈ వ్యాధిపై ధైర్యంగా పోరాడొచ్చనేది. అమ్మ నుంచి తెలుసుకున్నా అంటారు.

ఆంకాలజీ వార్డులన్నింటినీ సందర్శించి రోగులకు కౌన్సెలింగ్ అందిస్తున్నా. స్వచ్ఛంద సంస్థల తరఫున పనిచేస్తున్నా. బెంగళూరు సెంట్రల్ జైలులో ఖైదీలకు కౌన్సెలింగ్ ఇస్తున్నా. ఆసుపత్రి నుంచి ఇంటికి చేరిన తర్వాత ఆ ఆలోచనలకు దూరంగా ఉండి, ప్రశాంతంగా ఉంటేనే వ్యాధిపై పోరాడొచ్చు.



విగ్గు, గుండుతో అల్పా

తోటివారిని చూసి. చాలామందిలో మరణభయాన్ని పెంచుకుంటారు. ఇలాంటప్పుడే రోగుల మానసిక ఆరోగ్యాన్ని కౌన్సెలింగ్తో బాగుచేయాలి. శిరోజాలను కోల్పోయే కీమోథెరపీ రోగుల వద్దకు జుట్టు మొత్తం తీయించుకుని వెళుతుంటా. అప్పుడే వాళ్లకు దానిపై ఎక్కువ బాధ ఉండదు. అలాగే విగ్గుపై అవగాహన కలిగించడానికి కొన్నిసార్లు విగ్గునూ ధరిస్తుంటా. వాలంటీర్లకూ అదే చెబుతుంటా. అప్పుడే కుంగుబాటు లేకుండా, తమ భావోద్వేగాలను పంచుకుంటారుఖీ అనే అల్పా ఇప్పటివరకు వేలమంది క్యాన్సర్ రోగులకు కౌన్సెలింగ్ అందించారు. పలు ఎన్జీవోలతో కలిసి ఈ రంగంలో సేవలందించడం స్ఫూర్తిదాయకం. ◻

---

సైట్ ఉందనో లేదంటే ఫ్యాషన్ కోసం ఇలా కళ్లజోడు ధరించే చాలామందిలో ముక్కుపై కళ్లద్దాల మచ్చలు పడడం సహజం. అయితే కళ్లజోడు ధరిస్తే పర్లేదు కానీ.. కళ్లద్దాలు పెట్టుకోకపోతే

# కళ్లజోడు మచ్చలు తగ్గాలంటే. !

ఇవి స్పష్టంగా కనిపిస్తాయి. పైగా ఇవి అందాన్నీ దెబ్బతీస్తాయి. మరి, వీటిని నివారించే మార్గాలేంటో తెలుసుకుందాం..

- కళ్లద్దాలు ఎంపిక చేసుకునేటప్పుడు లెన్స్ తక్కువ బరువు ఉండేలా చూసుకోవాలి.
- అలాగే ఫ్రేమను ఎంచుకునేటప్పుడు కూడా తేలికైనది తీసుకోవడం ఉత్తమం. దీనివల్ల కళ్లజోడు తక్కువ బరువు ఉండి ముక్కుపై ఒత్తిడి పడకుండా జాగ్రత్తపడచ్చు.



- లెన్స్, ఫ్రేమ తయారు చేసిన మెటీరియల్స్ చర్మానికి హాని కలిగించకుండా ఉండేలా చూసుకోవాలి. అంటే ఒక్కొక్కరికి ఒక్కో రకమైన పడకపోవచ్చు. అలాంటివి పెట్టుకుంటే వెంటనే అలర్జీ వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి దీన్ని బట్టి ఫ్రేమ్ మెటీరియల్‌ను చాలా ముఖ్యం.



**మచ్చలు తగ్గాలంటే..!** ఒకవేళ కళ్లజోడు కారణంగా మచ్చలు పడ్డా కొన్ని చిట్కాల ద్వారా తగ్గించుకోవచ్చు.

**నిమ్మరసం, రోజ్వాటర్లో...** కళ్లజోడు కారణంగా మచ్చలు పడిన చోట నిమ్మరసాన్ని అప్లై చేయడం వల్ల ఈ సమస్య తగ్గే అవకాశం ఉంటుంది. కొద్దిగా నిమ్మరసం తీసుకుని, అందులో కాస్త రోజ్వాటర్ కలపాలి. ఈ మిశ్రమాన్ని మచ్చలున్న చోట రాయాలి. 15 నిమిషాల పాటు అరనిచ్చి తర్వాత శుభ్రం చేసుకోవాలి. ఇలా రోజూ చేయడం వల్ల నల్లమచ్చలు తగ్గుతాయి.

**రోజ్వాటర్, వెనిగర్ :** కాస్త రోజా వాటర్ తీసుకొని దానికి కొద్దిగా వెనిగర్ ఈ మిశ్రమంతో మచ్చలు ఉన్నచోట రోజూ మర్దన చేసుకుంటే అతి తక్కువ సమయంలోనే మచ్చలు మాయమైపోతాయి.

**బాదం నూనె :** బాదంనూనెలో ఉండే విటమిన్ 'ఇ' ముక్క మీద మచ్చలు తగ్గించడంలో సహకరిస్తుంది. ఈ క్రమంలో రోజూ బాదంనూనెతో మచ్చలు ఉన్నచోట మర్దన చేసుకుంటే చక్కని ఫలితం ఉంటుంది.

**పాలు, తేనె, ఓట్స్ ......** ఒక గిన్నెలో పాలు, తేనె, ఓట్స్ తీసుకుని బాగా కలపాలి. ఈ మిశ్రమంతో మచ్చలు ఉన్న చోట రోజూ మృదువుగా మర్దన చేయాలి. ఫలితంగా మచ్చలు తగ్గుముకం పట్టడమే కాకుండా చర్మం తాజాగా మారి మృదుత్వాన్ని సంతరించుకుంటుంది.

చెలి చిట్కా

ఉలిపిరి వున్నవారు వులపిర్తువున్నచోట ఉత్తరేణి ఆకు రుద్దాలి. ఇలా ప్రతిరోజూ కొంత కాలం చేస్తే మంచి ఫలితం ఉంటుంది. ◻

# బాడీవాష్ వాడుతున్నారా?

స్నానం చేసేటప్పుడు సబ్బు ఉపయోగించడం చాలామందికి అలవాటే అయితే కొంతమంది సబ్బుకు బదులుగా బాడీవాష్/షవర్ జెల్ వాడుతుంటారు. సబ్బు మాదిరిగానే దీన్ని ఏంచుకునేటప్పుడూ పలు విషయాలు దృష్టిలో ఉంచుకోవాలంటున్నారు సౌందర్య నిపుణులు. అప్పుడే చర్మ ఆరోగ్యాన్ని. అందాన్ని కాపాడుకో అంటున్నారు. 8అదెలాగో తెలుసుకుందాంరండి.. చర్మతత్వాన్ని బట్టి ఏ సౌందర్యోత్పత్తైనా చర్మతత్వాన్ని బట్టి ఎంచుకుంటాం. అప్పుడే





చర్మంపై ప్రతికూల ప్రభావం పడకుండా ఉంటుంది. బాడీ వాషూ ఇది వర్తిస్తుందని నిపుణులు. జిడ్డు చర్మం, పొడి చర్మతత్వం, సున్నితమైన చర్మం.. ఇలా ఆయా చర్మతత్వాలకు నప్పే షవర్ జెల్స్ ప్రస్తుతం మార్కెట్లో దొరుకుతున్నాయి. ఈ పొడి చర్మం ఉన్న వారు. గ్లిజరిన్, షియా బటర్, కలబంద వంటి ఉత్పత్తులతో తయారైన బాడీవాష్ లు ఎంచుకోవాలి.అదే సున్నితమైన చర్మమైతే.. సల్ఫేట్లు, పారబెన్స్ లేని; పరిమళాలు వాడని ఉత్పత్తిని ఎంచుకోవాల్సి ఉంటుంది. జిడ్డు చర్మంతో బాధపడేవారు నూనెలు, మాయిశ్చరైజర్లు ఉన్న వాటిని పక్కన పెట్టేయాలి. సాలిసిలిక్ ఆమ్లం ఉంటే వాటిని ఎంచుకోవాలి. సాధారణ చర్మం కలిగిన వారు.. పైన మూడింట్లో ఏదైనా ఉపయోగించవచ్చు. ప్రయోజనాలెన్నో!స్నానానికి బాడీవాష్/షవర్ జెల్ వాడడం వల్ల చర్మానికి పలు ప్రయోజనాలు చేకూరుతాయని నిపుణులు చెబుతున్నారు. సబ్బుతో పోల్చితే షవర్



చర్మతత్వం ఉన్న వారికి సబ్బు కంటే బాడీ వాష్ మేలంటున్నారు నిపుణులు. ఎందుకంటే వీటితో పోల్చితే సబ్బులో చర్మ ఆరోగ్యాన్ని దెబ్బతీసే రసాయనాలు ఎక్కువగా ఉంటాయ! ఇక ప్రయాణాల్లో సబ్బు కంటే షవర్ జెల్స్ వాడడమే అనుకూలంగా ఉంటుంది. ఒకవేళ చర్మతత్వానికి నప్పే బాడీ వాష్ ఎంచుకోబడినప్పటికీ.. చర్మంపై అలర్జీ, దురద రాదు. ◻

జెల్ వాడడం వల్ల చర్మ రంధ్రాల్లో పేరుకున్న మురికి మరింత ప్రభావవంతంగా తొలగిపోతుంద! చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది. లూఫా, స్పాంజి వంటి వాటితో రుద్దుకోవడం వల్ల బాడీ వాష్‌లో ఉండే గ్లిజరిన్, కలబంద పదార్థాలు చర్మంలోకి ఇంకి.. చర్మం తేమగా, మృదువుగా మారుతుంది. అత్యవసర నూనెలు.. వంటి సహజ పరిమళాలు వాడి తయారుచేసిన బాడీవాష్లు మార్కెట్లో దొరుకుతున్నాయి. వాటిని ఉపయోగిస్తే.. ఇటు చర్మానికి, అటు మనసుకు ఆహ్లాదకరంగా ఉంటుంది. కొన్ని షవర్ జెల్స్ స్క్రాబ్ లాగా ఉంటాయి. వీటిని వాడడం వల్ల అటు స్క్రబ్, ఇటు స్నానం చేసిన ఫీలింగ్ ఒకేసారి కలుగుతుంది. దీనివల్ల కూడా చర్మం మృదువుగా, కాంతివంతంగా మారుతుంది.

సున్నిత

# వ్యాపారంలో రాణించాలా?

మహిళలు చదువుల్లో దూసు కెళ్తున్నారు. మంచి ఉద్యోగాలు సంపాదించుకుంటున్నారు. కానీ, ఆ తరవాతే... పిల్లలు, కుటుంబ బాధ్యతలంటూ కెరియర్ని త్యాగం చేస్తున్నారు. అలాగని ఎప్పటికీ అలా గృహిణి పాత్రలోనే స్థిరపడిపోవాలనుకోవడం లేదు. గ్రీక్ తరవాత ఇంటి నుంచే వ్యాపారాలు చేయాలనుకుంటున్నారు. మీరూ అంతేనా? అయితే ఈ జాగ్రత్తలు తీసుకోక తప్పదు.

◆వ్యాపారం అనగానే.... 'అడపిల్లవు నువ్వు చేయలేవు' అంటూ అందరూ నిరాశపరచొచ్చు అయినంతమాత్రాన మీ ప్రయత్నాలను ఆపాల్సిన అవసరం లేదు. పట్టుదల, కష్టపడగం ఓర్పు, నేర్పు ఉంటే ఏ రంగంలోనైనా రాణించొచ్చు. అలా విజయం సాధించిన వారి కథలను చదవండి. మీమీద మీకు ఎక్కడ కాస్త అపనమ్మకం ఉంటే.. దానికి తగిన శిక్షణ తీసుకోండి. ఇవి మీకు ఆత్మవిశ్వాసాన్నిస్తాయి.

◆చిన్న పెట్టుబడితో 'ప్రయత్నించి చూద్దాం' అన్న ఆలోచన మంచిదే. కానీ, సరైన రంగాన్ని ఎందుకున్నారో లేదో ఒకటికి రెండు సార్లు సరిచూసుకోవాలి. ముందు అసలు మీరే చేయాలనుకుంటున్నారో స్పష్టత అవసరం. మీరున్న సామర్థ్యాలు, ఖర్చు చేయగల వనరులు... ఇలా అన్నీ ఓ కాగితంపై లెక్కేయండి. ఆ తర్వాత అవసరాలను గుర్తించడం, మార్కెట్‌పోకడలు పరిశీలించి ఓ నిర్ణయానికి రండి. ◆. ఏ వ్యాపారంలో అయినా నాణ్యత, నమ్మకం తప్పనిసరి. దీన్ని నిలబెట్టుకోవడానికి మీ ప్రణాళిక పక్కాగా ఉండాలి. ఎవరినో అనుకరించడం కాకుండా మీరు వినయంగా ఏం చేయగలరో ఆలోచించండి. ఖాతాదారుల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే... కస్టమర్ ఫీడ్బ్యాక్, ఫిర్యాదులపై వెంటనే స్పందించాల్సిన అవసరం ఉంది. అదే మిమ్మల్ని అందరిలోనూ ప్రత్యేకంగా నిలబెడుతుంది.3. వ్యాపారం అంటే మాటలేం కాదు.. అలాగని మనం చేయలేనిది అసలే కాదు. మీ టార్గెట్ కస్టమర్లు ఎవరు? వారిని చేరుకోవడానికి ఉన్న మార్గాలేంటి చూడండి మీకంటూ ప్రత్యేకంగా నెట్వర్క్ ఏర్పరుచుకోండి. డిజిటల్ మార్కెటింగ్‌పై పట్టు తెచ్చుకోండి. వీటిలోనే ఈ రోజుల్లో వృత్తి, వ్యాపారాల్లో సాగుతున్నవారి విజయ హస్యం దాగుంది. అయితే, ఒక్కరోజులోనే ఎదిగిపోవాలని కోరుకోవద్దు. ప్రారంభంలో ఆటు పోట్లు సహజమే. అలాగని వాటిని చూసి భయపడిపోవద్దు. ఎక్కడ తప్పు చేస్తున్నామో గమనించుకుని సరిదిద్దుకోండి. ◻

కాలేజీ చదువు తున్న పిల్లలకు ఏం చెప్పడానికైనా అమ్మలు వెనకడుతున్నారు. అన్నీ తనకు తెలుసని, పదిసార్లు చెప్పొద్దని ప్రతి విషయానికి కోప్పడతారు. యుక్తవయములో కనిపించే ఈ పార్ట్ టెంపర్ను ఎలా అదుపు చేయాలంటే....

మనసులో ఆలోచనలను పైకి చెప్పలేక పిల్లలు కోపాన్ని బహిర్గతం చేస్తున్నారేమో గమనించాలి. దాని వెనక మరో కారణం దాగి ఉందేమో కూడా గుర్తించాలి. కుటుంబపరంగా లేదా సామాజికంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలు, అవమానాలు లేదా బాధ వంటివి పైకి చెప్పే ధైర్యంలేక వాటిని పిల్లలు మనసులోనే దాచుకుంటున్నారేమో. అదే బయటకు కోపంగా

# పిల్లల కోపం అదుపులో..




ప్రదర్శిస్తున్నారేమో. ఏదిఏమైనా కారణాన్ని గుర్తించాల్సిన బాధ్యత పెద్దవాళ్లచే పిల్లల భావోద్వేగాలు, ఆలోచనలను తెలుసుకోవాలంటే వాళ్లకంటూ రోజూ కొంత సమయాన్ని తల్లిదండ్రులు కేటాయించడం తప్పనిసరి. వాళ్ల మనసులోని విషయాలను పంచుకొనేలా సన్నిహితంగా ఉండాలి. అప్పుడే ఏ ఒత్తిడి వాళ్లను చరిచేరదు. ప్రతిదానికీ కోపాన్ని ప్రదర్శించకుండా మన మాట పూర్తిగా వినడానికి ఆసక్తి చూపిస్తారు.

**వ్యాయామం...:** పిల్లలు చురుగ్గా ఉండాలన్నా, కోపం తగ్గించుకోవాలన్నా... వారు శారీరకంగా దృఢంగా ఉండాలి. ఇందుకోసం రోజూ మీరు చేసే వర్కవుట్లలో వారినీ భాగస్వాముల్ని చేయాలి. కుటుంబమంతా కలిసి వాకింగ్, ఈతకో కెళ్లండి ఇవన్నీ పిల్లలకు ఫిటెనెస్పై ఆసక్తి పెంచుతాయి. అందరి మధ్య అనుబంధమూ పెరుగుతుంది. ప్రతి చిన్నవిషయానికి గట్టిగా అరచుకునే అమ్మానాన్నలను చూస్తూ పెరిగే పిల్లలంతా కోపంగా అరవడమే సరైన పద్ధతి అనుకుంటారు. అదే విధానాన్ని అనుసరిస్తారు. అలాకాకుండా ఇంటివాతావరణం పిల్లల ఎదుగుదలను ప్రోత్సహించేలా ఉండాలి.

**అభ్యాసం...** కోపాన్ని నియంత్రించుకునే చిట్కాలు పిల్లలకు నేర్పాలి. ఏకాగ్రతతో అంకెలు లెక్కబెట్టడు, కోపంగా ఉన్నప్పుడు పది నిమిషాలు నిశబ్దాన్ని పాటించడం దాలి. ఇవన్నీ వారిలో కోపాన్ని తగ్గిస్తాయి. ఒత్తిడి ఆందోళనల్ని దూరం చేస్తాయి. అలాగే పిల్లలకు ఏదైనా చెప్పాలంటే వాళ్ల ప్రశాంతంగా అడిగి తెలుసుకోవడానికి ప్రయత్నించాలి. ◻

# శరణమయ్యప్ప

నల్లటి వస్త్రాలతో నలభై రోజుల దీక్ష. అయ్యప్ప గీతాలతో అలౌకికానందం. వీధివీధిలో పడి పూజలు. ఇంటింటిలో స్వామి భజనలు. శబరిమలై యాత్రలతో గురుస్వాముల సందడి మకరజ్యోతిని దర్శించాలనే మనోవాంఛ. ధనుర్మాసంలో ఉత్తరా నక్షత్రంలో జన్మించిన అయ్యప్ప స్వామి పందళదేశ రాజైన రాజ శేఖరుడికి అరణ్యంలో దొరికాడు. హరిహర సుతుడు అంతఃపురంలో అడుగుపెట్టిన వేళా విశేషం.. దీర్ఘకాలంగా సంతానం లేని రాజుకు సంతానం కలిగింది. కానీ మహారాణి లేనిపోని అనుమానాలతో తలనొప్పి నటించి పులిపాలు తీసుకురమ్మని అయ్యప్పను అరణ్యానికి పంపింది. కథ సాగుతూనే ఉంది.. మనసు మాత్రం మొదటి పదం దగ్గరే తచ్చాడుతోంది. హరిహర సుతుడా ఎలా సాధ్యం? ఇద్దరు పురుషులకు సంతానం కలగడమేంటి? విష్ణుమూర్తి మోహినిగా మారాడు, సరే! కానీ కాముని కాల్చిన కామేశుడు కామపరవశుడై మోహని వెంట పడటమా? ఎంతమా! ఇలా ఎన్నో సందేహాలు మేధను మథనం చేయడం సహజమే! కానీ, భగవంతుణ్ణి అర్థం చేసుకోవా లంటే తత్వపరంగా ఆలోచించాలే గానీ



సామాన్యార్థంలో స్త్రీ పురుష పరంగా కాదు. క్షీ రసాగర మథనంలో విషాన్ని గ్రహించిన అనంతరం పరమ శివుడు తిరిగి తపోనిష్ఠలోకి వెళ్లాడు. నారదుడి ద్వారా జరిగిన ఘటనలన్నీ తెలిశాయి. ప్రత్యేకించి నారాయణుడి మోహినీ అవతారం. లోక కంటకి మహిషి సంహారార్థం మోహిని తనను ఆకర్షించింది. అది అనివార్యమైనా అనైతికం కాకూడదనే శక్తిరూప మోహినిగా అవతరించాడు విష్ణుమూర్తి. శక్తి పురుష రూపాన్ని ధరిసేనత విష్ణు మూర్తి మోహిని రూపం ధరిస్తే అది శక్తి. ఆ శివశక్తుల కలయికే హరిహరసుత అయ్యప్ప. ఈ అద్వైత వెలుగులో దర్శించినప్పుడు మన సందేహాలు పటాపంచలవుతాయి. జిల్లెళ్లమూడి అమ్మ చెప్పినట్లు రెండులా కనిపించినా, ఒకటిలా అనిపించడమే అద్వైతం. మరింత లోతుకు వెళ్తే శివకేశవులు కూడా ఒకే శక్తికి భిన్న రూపాలని అర్థమవుతుంది. స్కందోపనిషత్‌లోని ఈ శివకేశవ అభేద రూపమే అయ్యప్ప అవతా రం. భూతనాదోపాఖ్యానంలో మహిషి పూర్వజన్మ వృత్తాంతం కనివి స్తుంది. బ్రహ్మ మహిషికి ప్రసాదించిన వరం ప్రకారం, రాజశేఖరుడికి పన్నెండేళ పుత్రుడిగా సేవచేసి, తల్లి కోసం పులి పాలు తీసుకు రావడమే కాదు. పులిమీద స్వారీ చేశాడు అయ్యప్ప తండ్రి రాజ్యం ఇవ్వబోతే సున్నితంగా తిరస్కరించాడు. ఈ సంఘట నల వెనుక ఉన్న అంతరార్థాన్ని గమనిస్తే తమోగుణానికి ప్రతీకైన మహిషిని సంహరించి, రజోగుణానికి ప్రతియైన పులిపై పట్టు సాధించి, పాల స్వచ్ఛమైన సాత్వికమార్గంలో పయనించి, రాజ్యాన్ని తిరస్కరించి త్రిగుణాతీత స్థితికి చేరినవాడు అయ్యప్ప. ◻

ఆధ్యాత్మికం

# ముగ్గులకు ఆహ్వానం

ధనుర్మాసం అంటే ముగ్గుల మాసంకదా! ఈ నెలంతా ముగ్గులు వేస్తారు. ఈ సందర్భంగా 'చెలి' పేజీలో ముగ్గుల ప్రచురణ కోసం ఆహ్వానం పలుకుతున్నాం. ఆసక్తిగల మహిళలు ముగ్గులు వేసి పంపించగలరు.

**సూచనలు :**

★ గతంలో ప్రచురించిన ముగ్గులను పంపవద్దు. కొత్తముగ్గులు మాత్రమే పంపించగలరు. ★ ఇటీవల తీసుకున్న పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోను జతచేయగలరు. పాతఫొటోలను పంపవద్దు.

★ మీ పూర్తి చిరునామా, ముగ్గుల సంఖ్యను రాయాలి. ★ ఏ4 పేజీలో ఒకసైడు మాత్రమే ముగ్గుల్ని వేయాలి. ★ ముగ్గులు క్లీయర్‌గా, రంగులతో కనిపించాలి. ★ మీ ముగ్గులను మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు.

**మా చిరునామా**

ఎడిటర్, 'చెలి' వార్త, నం.396, లోయర్‌ట్యాంక్ బండ్, డిబిర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.

Gmail: cheli@vaartha.com



## భూ సమస్యలు పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

### - ఒంగోలు ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న




**సంతనూతలపాడు, ప్రభాతవార్త**

భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసినట్టు ఒంగోలు ఆర్ డి ఓ కే. లక్ష్మీప్రసన్న పేర్కొన్నారు. సంతనూతలపాడు మండలం ఏండ్లూర్ గ్రామపంచాయతీలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సు కు ఆర్డీవో ముఖ్యఅతిథిగా విచ్చేసి అనంతరం ప్రసంగించారు. మండల స్పెషల్ ఆఫీసర్, డిప్యూటీ కలెక్టర్ ఎస్.వర కుమార్ ఈ కార్యక్రమానికి మరొక ముఖ్య అతిథిగా విచ్చేశారు. సంతనూతల పాడు తహసిల్దార్ వేమూరి ఆదిలక్ష్మి ఈ రెవెన్యూ సదస్సు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆర్ఐ పి.రామ్ తేజ, ఏండ్లూర్ విఆర్ఓ. ఏ. ఆదిరెడ్డి, ఎండ్లూరు సర్వేయర్ బి శేఖర్ పర్యవేక్షించారు. రైతులు తమ తమ భూములకు సంబంధించి సమస్యలు ఏమైనా ఉంటే రెవెన్యూ సదస్సులో అర్జీలు దాఖలు చేసుకోవాలని ఒంగోలు ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న, మండల స్పెషల్ ఆఫీసర్ వర కుమార్ తమ తమ ప్రసంగాల్లో కోరారు. 45 రోజుల్లో రికార్డులను అనుసరించి సమస్యలు పరిష్కంపబడతాయన్నారు. 2004వ సంవత్సరంలో ఏండ్లూర్ గ్రామ సర్వేనెంబర్ 429 / బై 1ఏ, 1ఏ2,1ఏ3 లలో ఏండ్లూర్ గ్రామానికి చెందిన ధవళగిరి రామారావు, దాసరి పద్మావతి, గుర్రం కృష్ణారావు లకు గత అప్పటి రెవెన్యూ అధికారులు ఎకరా 50 సెంట్లు భూమిని డీకే కింద కేటాయించారని అయితే గత రెవెన్యూ అధికారులు ఈ భూమిని బేతంచెట్టి రమేష్, బొక్కిసం శ్రీనివాసరావులకు అక్రమంగా ఆన్లైన్ చేశారని ఆయా వర్గీయులు ఆర్డీవో లక్ష్మీప్రసన్నకు ఈ సదస్సులో వివరించారు. ప్రస్తుతం ఇది హైకోర్టు పరిధిలో ఉన్నట్టు తాహ సిల్దార్ వేమూరి ఆదిలక్ష్మి ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్నకు వివరించారు. సదరు ఇరువురు వ్యక్తులకు నోటీసులు జారీ చేసి పరిశీలించమని ఆర్డీవో లక్ష్మి ప్రసన్న ఈ సందర్భంగా రెవిన్యూ వారిని ఆదేశించారు. హైకోర్టు పెండింగ్ అనంతరం దీనిని పరిశీలిస్తామన్నారు. ఈ రెవెన్యూ సదస్సు కార్యక్రమంలో 12 అర్జీలు దాఖలు అయ్యాయి. వీటిలో ఒక అర్జీని డీఎస్ కు సంబంధించి ఇక్కడే పరిష్కరించారు. పట్టాదారు పాస్ పుస్తకాలు కు సంబంధించి పది అర్జీలు, సర్వే కొలతలు కు సంబంధించి ఒక అర్జీ ఈ సదస్సులో దాకలు అయినవి. ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి నాయకులుబొమ్మినేని రామాంజనేయులు,ఏండ్లూర్ సర్పంచి ఎస్ పుల్లయ్య, టిడిపి నాయకులు జె. లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి పి రవికుమార్, గ్రామాల వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

## నిలిపివేసిన మెడికల్ కళాశాల నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలి

### - డాక్టర్ల బదిలీలను నిలుపుదల చేయాలి




**మార్కాపురం, ప్రభాతవార్త**

నిలిపివేసిన మెడికల్ ఎలా చేయాలో నిర్మాణాన్ని తిరిగి వెంటనే ప్రారంభించాలని డాక్టర్లు బదిలీలను నిలివేయాలని కోరుతూ సిపిఎం మార్కాపురం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ వైద్యశాల ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు,. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి సోమయ్య మాట్లాడుతూ వెనుకబడిన పశ్చిమ ప్రకాశం జిల్లా కేంద్రంగా ఉన్న మార్కాపురంలో నిర్మాణం జరుగుతున్న మెడికల్ కళాశాల నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిలుపుదల చేయటం, కళాశాలకు అనుబంధంగా ఉన్న సర్వజన ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్లను బదిలీ చేయటాన్ని ఆయన వ్యతిరేకించారు. పశ్చిమ ప్రకాశం ప్రజలకు ఉచిత వైద్యం అందని ద్రాక్ష లా మారిందని, తీవ్రమైన జబ్బుల బారిన పడిన రోగులు వైద్యం కొరకు వందల కిలోమీటర్ల దూరంలోని కర్నూలు, గుంటూరు, హైదరాబాదు ఒంగోలు ప్రాంతాలకు వ్యయ, ప్రయాసలకు ఓర్చి వెళుతున్నారని అన్నారు, ప్రయాణంలో నే ప్రాణాలు వదులుతున్న దయనీయమైన పరిస్థితి కొనసాగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు, మార్కాపురంలో ఉన్న జిల్లా ఆసుపత్రిలో నిరంతరం వైద్యుల, కొరత మందులు కొరత వల్ల వైద్యం పేదలకు అందుబాటులో ఉండటం లేదని. పెద్ద సంఖ్యలో ఉన్న దళితులు, గిరిజన ప్రజలకు వైద్యం అందక బ్రతుకు భారంగా నడుస్తున్న పరిస్థితులు కొనసాగుతున్నాయన్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు ఎంతో ఉపయోగపడుతుందని ఆశగా ఎదురుచూస్తున్న మెడికల్ కళాశాల నిర్మాణాన్ని నూతనంగా ఏర్పడిన టిడిపి కూటమి ప్రభుత్వం నిర్మాణాన్ని నిలిపి వేయటం, డాక్టర్లను బదిలీ చేయటం వంటి చర్యలకు పాల్పడుతుందని, ఇలాంటి చర్యలను మానుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మార్కాపురంలో నడుస్తున్న జిల్లా ఆసుపత్రి స్థానంలో మెడికల్ కళాశాల సిబ్బంది నియామకంలో భాగంగా పెద్ద సంఖ్యలో డాక్టర్ల నియామకం జరిగిందని .ఫలితంగా జిల్లా ఆస్పత్రి నడుస్తున్న కాలంలో 300గా ఉన్న ఓపి మెడికల్ కళాశాల డాక్టర్లు పెద్ద సంఖ్యలో రావడం వల్ల ఓపి ఒక్కసారిగా 700 పైగా చేరిందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రైవేటీకరణ జపం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ ఆధీనంలో నిర్మాణం జరుగుతున్న మెడికల్ కళాశాలను నిలుపుదల చేయటం,భవిష్యత్తులో ప్రైవేట్ భాగస్వామ్యంతో కళాశాలను నడుపుతామని ప్రకటించడం .అన్ని రంగాల్లో వెనుకబడిన పశ్చిమ ప్రకాశం ప్రజలకు ఉచిత వైద్యం దూరం చేయడమే అవుతుందన్నారు,ఇటువంటి చర్యలు ప్రభుత్వం మానుకోవాలని పేదలకు వైద్యం అందుబాటులో ఉంచాలని ఆయన అన్నారు. లేనిచో కలిసొచ్చే పార్టీలతో పోరాటాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి డీకేఎం రఫీ నాయకులు పి రూబెన్, జవాజి రాజు, షేక్ నన్నేసా, మహబూబ్ బాషా, వై సురేష్ కుమార్, కట్ట సుబ్బారావు, జి విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో గొట్టిపాటి లక్ష్మీ దంపతులు



**దర్శి, ప్రభాతవార్త**

దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ యువనేత డాక్టర్ కడియాల లలిత్ సాగర్ లు తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

### - ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ కే శ్రీనివాసరావు



**దర్శి, ప్రభాతవార్త**

డిప్యూటీ కమిషనర్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఒంగోలు వారి ఆదేశాల మేరకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపర్నెంట్ ప్రకాశం జిల్లా వారి ఆదేశాల మేరకు దర్శి ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ కే శ్రీనివాస రావు మరియు సబ్ఇన్స్పెక్టర్ వీ ఆర్ సత్యనారాయణ రావు మరియు దర్శి ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ సిబ్బందితో కలసి దర్శి పట్టణములోని"గౌతమి డిగ్రీ మరియు జూనియర్ కళాశాల" నందు"గంజాయి లాంటి మత్తు పదార్థాలు మరియు మాదక ద్రవ్యాలు వలన కలిగే అనర్థాల" గురించి అవగాహన కార్యక్రమము నిర్వహించినారు. తదుపరి భవిష్యత్తులో విద్యార్థులు ఎవరూ మత్తుపదార్థాలకు బానిస కాకుండా ఉంటామని ప్రతిజ్ఞ చేయించినారు. ఈ కార్యక్రమం లో గౌతమి డిగ్రీ మరియు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ యు రవి. మరియు విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు

### - తాహసిల్దార్ ఎం శ్రావణ్ కుమార్

**దర్శి, ప్రభాతవార్త**

గ్రామాల్లో ఉన్న ప్రజా సమస్యల పరిష్కారం కోసమే రెవిన్యూ సదస్సులో ఏర్పాటు చేయడం జరుగుతుందని తాహసిల్దార్ ఎం శ్రావణ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం దర్శి మండలంలోని వెంకటాచలపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పొలం సమస్యలతో అర్జున్ రావడం జరిగిందని వీటిని సత్వరమే పరిష్కారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి అంకాల శ్రావణి శ్రీనివాసరావు యాదవ్ .డిప్యూటీ తాహసిల్దార్ వెంకటేష్. ఆర్ ఐ శ్రీనివాసరావు.వీఆర్వో. పంచాయతీ కార్యదర్శి. సచివాల సిబ్బంది మరియు ప్రజలు పాల్గొన్నారు.




## పోస్ యాక్ట్‌పై అవగాహన సదస్సు

**వేటపాలెం, ప్రభాతవార్త**



మహిళా విద్యార్థులపై వేధింపులు అరికట్టడం ఎలా చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో పోష్ యాక్ట్ 2013పై, అవగాహనా కార్య క్రమాన్ని నిర్వహించినట్లు, కళా శాల సెక్రటరీ వనమా రామకృ ష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమం తుల లక్ష్మణరావు లు సంయు క్తంగా తెలియజేశారు. సెక్సువ ల్ హెరాస్మెంట్ ఆఫ్ ఉమన్ ఎ ట్ వర్క్ ప్లేస్ (ప్రివెన్షన్, ప్రొహి బిషన్ అండ్ రిడ్రెసల్)యాక్ట్ 2013 పై, కళాశాల విద్యార్థులకు,అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జగదీష్ బాబు తెలిపారు. కళాశాల ప్రిన్సి పాల్ మాట్లాడుతూ, కళాశాల మహిళా విద్యార్థులకు ఎటు వంటి ఇబ్బందులు కలుగకుం డా, కళాశాల ఇంటర్నల్ కంప్లె యింట్ కమిటిల ద్వారా,విద్యా ర్థులకు సురక్షిత వాతావరణం లో, తమ విద్యార్జనకు కావల సిన సదుపాయాలను, కలుగ జేస్తున్నట్లు తెలిపారు. ఐసిసి కమిటి ప్రిసైడింగ్ ఆఫీసర్ డా క్టర్ ఆర్. నాగ ధనలక్ష్మి మాట్లా డుతూ, సెక్సువల్ హెరాస్మెంట్ ఎలా ఉంటుంది, ఎలా ఫిర్యాదును సమర్పించాలి, ఫిర్యాదును ఎలా పరిష్కరిస్తారనే, అం శాలపై విద్యార్థులకు అవగాహ న కల్పించారు. ఈ సందర్భం గా, ప్రతి విద్యార్థి సురక్షిత, ప్రతికూల రహిత వాతావరణ ప్రాధాన్యతను తెలుసుకొని, తగు సూచనలను సలహాలను పాటించి, తమ విద్యార్జనను పూర్తిచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ఐసిసి కమిటి సభ్యులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై మెరుపు దాడి



**వేటపాలెం, ప్రభాతవార్త**

మండలంలోని విఘ్నేశ్వర కాలనీ లో ఎస్సై వెంకటేశ్వర్లు వారి బృందంతో పేకాట శిబిరంపై ఆకస్మిక దాడి చేసి పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 3,800/ నగదును స్వాధీనం చేసుకునీ వారిని స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేశారు.

## కామాక్షి కేర్ హాస్పిటల్‌లో ఉచిత మెగా వైద్యశిబిరం

**చీరాల టౌన్, డిసెంబర్ 10, ప్రభాతవార్త**





స్థానిక చీరాల కామాక్షి కేర్ హాస్పిటల్ నందు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు షుగరు ఎముకలు మరియు కంటి సమస్యలపై వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు ఈ సందర్భంగా కామాక్షి కేర్ హాస్పిటల్ ఎండి డాక్టర్ తడివలస దేవరాజు మాట్లాడుతూ షుగర్ ఉన్నవారు తప్పనిసరిగా ఆహార నియమాలు పాటిస్తూ వ్యాయామం చేస్తూ సంవత్సరానికి ఒకసారి గుండె కళ్ళు కిడ్నీ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని కామాక్షి కేర్ హాస్పిటల్ పేద మధ్య తరగతి వారికి ఎంతగానో ఉపయోగపడుతుందని మా హాస్పటల్ నందు షుగర్ మరియు జనరల్ ఫిజీషియన్ డాక్టర్ నవీన్ కుమార్, ఎముకల స్పెషలిస్ట్ డాక్టర్ దివ్య, లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ గవిని లక్ష్మీనారాయణ , సీనియర్ ఆత్మలిక్ ఆఫీసర్ డాక్టర్ తాడివలస కుమార్ లు 24 గంటలు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తారని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హాస్పిటల్ నందు ఆరోగ్య శ్రీ , సీఎం రిలీఫ్ తదితర కార్డుల ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేయబడునని ఆయన అన్నారు ఈరోజు పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించడం జరిగిందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో హాస్పిటల్ జనరల్ మేనేజర్ తాడివలస సురేష్ హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్టమస్ వేడుకలు

**దర్శి, ప్రభాతవార్త**



దర్శి మండల పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మంగళవారం కురిచేడు రోడ్డు లోని కవనెంట్ చర్చిలో సీనియర్ పాస్టర్ గల్లె పోగు ఏసుదాసు అధ్యక్షతన సెమీ క్రిస్మస్ జరిగింది. దర్శి మండల పరిషత్ ఉపాధ్యక్షులు, సీనియర్ వైసీపీ నాయ కులు సోము దుర్గారెడ్డి, వైసీపీ ఎస్సీ విభాగం ప్రకాశం జిల్లా అధ్యక్షులు గాలిమూటి దేవప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.తాళ్లూరు బేతేలు ప్రార్థన మందిరం సీనియర్ పాస్టర్ రెవ.వై ప్రభుదాస్ క్రిస్మస్ సందేశం అందించారు. ఏసుక్రీస్తు జన్మతో ప్రజలకు శాంతి, సంతోషం సమాధానం లభించాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా కుల మతాలకతీతంగా జరిగే ఏకైక పండుగ క్రిస్మస్ అన్నారు. కార్యక్రమములో పాస్టర్లు డేనియల్ పాల్, జి.ఎస్.పాల్, నిరీక్షణ కుమార్, సుందర్రావు, కోటేశ్వరరావు, వినయ్, బెజవాడ అనిల్, కోటయ్య, రమణారెడ్డి, రవిచంద్ర, 70 మంది పాస్టర్లకు నూతన వస్త్రాలు బహూకరించారు.

## లేఅవుట్‌ని సందర్శించిన జిల్లా అధికారి పి శ్రీనివాస్ ప్రసాద్



**దర్శి, ప్రభాతవార్త**

దర్శి మండలంలోని వెంకటా చలంపల్లి లేఅవుట్‌ని హౌసింగ్ జిల్లా అధికారి పి శ్రీనివాస్ ప్రసాద్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లే అవుట్ ల లో నిర్మాణం లో ఉన్న గృహాలను పరిశీలించారు. ఎల్ఎల్, ఆర్ఎల్, ఆర్‌సి స్టేజీల్లో ఉన్న అన్ని గృహాలను డిసెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. మిగిలిన గృహాలను మార్చి 2025 లోపు పూర్తి చేయవలెను అని సిబ్బందిని ఆదేశించారు, హౌసింగ్ డిఇ ది.నిరీక్షణరావు, ఏ ఈ షేక్ షకీర్ భాష. ఏఇ వర్క్ ఇన్స్పెక్టర్ టి కొండలు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ థియోఫిలాస్ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలులో వ్యాపారులు దగా చేస్తే చట్ట ప్రకారం చర్యలు

### డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ



**దర్శి, ప్రభాతవార్త**

ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ఇవ్వాలని దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ స్పష్టం చేశారు. తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసి రైతులను దగా చేస్తే సంబంధిత వ్యాపారులపై అధికారులు చర్యలు తీసుకుంటారని ఆమె అన్నారు. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల రైతులు ధాన్యం అమ్మకాలు జరపాలని ఆమె కోరారు. ఇప్పటికే దర్శి నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు చేసేందుకు టొబాకో బోర్డు ద్వారా లంకోజనపల్లి లో నాలుగు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు డాక్టర్ లక్ష్మీ తెలిపారు. త్వరలో మరికొన్ని ఏజెన్సీల ద్వారా కూడా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి నియోజకవర్గంలో ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జెసి ఆర్ గోపాలకృష్ణ హామీ ఇచ్చినట్లు డాక్టర్ లక్ష్మీ వివరించారు.

## మానవ హక్కుల సదస్సుల పాల్గొన్న చైర్మన్

**దర్శి, ప్రభాతవార్త**



అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా దర్శి పట్టణ మానవ హక్కుల చైర్మన్ నాగూర్ షరీఫ్ (ఉమర్) గుంటూరులో జరిగిన అంతర్జాతీయ మానవ హక్కుల సదస్సులో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవులందరూ సమానమే అని అందరు కలిసి మెలిసి ఉండాలని ఎవరు ఎవరి స్వేచ్ఛను హరించరాదని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడుతూ ఇలాంటివి మరెన్నో సేవలు చేయాలని పలువురు ప్రముఖులు అన్నారు. తను చేసే సేవలకు మంచి పనులకు మానవ హక్కుల సంఘం ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు.

## మొక్కలతోనే మానవ మనుగడ : చైర్మన్ అబ్దుల్ గఫార్



**కనిగిరి, ప్రభాతవార్త**

మొక్కలతోనే మానవ మనగడ సాధ్యం అని కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్, న్యాయవాది షేక్ అబ్దుల్ గఫార్ అన్నారు అన్నారు.మంగళవారం కనిగిరి మండలంలోని ఎరువారిపల్లి గ్రామంలో జరిగిన మానవ హక్కుల దినోత్సవం కార్యక్రమంలో భాగంగా కె ఎస్ ఎం ఎడ్యుకేషనల్ సొసైటీ, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని యజ్ఞంలా నిర్వహించి గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని అన్నారు.మన హక్కులను కాపాడుకోవాలంటే మనం అందరం ఆరోగ్యంగా ఉండాలని అన్నారు.డి ఎల్ డి ఓ శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ మన చుట్టూ ఉండే పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా వ్యాధులు ప్రబలే అవకాశాలు తక్కువగా ఉంటాయన్నారు. ప్రధానంగా వర్షాకాలం కావడంతో ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని, ఖాళీ ప్రదేశాల్లో నీళ్లు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యర్థ పదార్థాలతో కలిగే అనార్థాలపై అవగాహన కలిగి ఉండాలని, ఎక్కడా కూడా చెత్తను బయట పారబోయకుండా చెత్త ట్రాక్టర్‌లోనే వేయాలన్నారు. ప్రధానంగా ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని, తద్వారా కాలుష్యాన్ని సైతం నివారించవచ్చు అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో హనుమంతరావు,గ్రామ సర్పంచ్ వెంకటయ్య,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం ముంతాజ్,సి డి పి ఓ సరోజినీ,సచివాలయం కార్యదర్శి వి రవి కుమార్, డి సి పి ఓ దినేష్ కుమార్,పారా లీగల్ వాలంటీర్ గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్ బాబు,అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## ఘనంగా దేవకి వెంకటేశ్వర్లు పుట్టినరోజు వేడుకలు



**కనిగిరి, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాసవి సత్ర సముదాయ అధ్యక్షులు దేవకి వెంకటేశ్వర్లు పుట్టినరోజు వేడుకలు కలియుగ దైవమైన శ్రీ వెంకటేశ్వర స్వామి కొలువై ఉన్న తిరుమల సన్నిధిలో వాసవి సత్ర సముదాయంలో మంగళవారం ఘనంగా జరిగాయి. కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు దేవకి వెంకటేశ్వర్లు దేవకి లలిత కుమారి దంపతులను ఆశీర్వదించారు. దేవకి వెంకటేశ్వర్లు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో సిరిసంపదలతో సుఖంగా సంతోషంగా ఉండాలని దీవించారు. ఈ కార్యక్రమంలో వాసవి సత్ర సముదాయ మల్లికార్జున, రమణ, సుబ్బు,శేఖర్,నారాయణ,శివ, సామేలు తదితరులు పాల్గొన్నారు.

## 12న వైసిపి పార్టీ నియోజకవర్గస్థాయి సమావేశం



**కనిగిరి, ప్రభాతవార్త**

ఈనెల 12వ తేదీ వైసిపి నియోజకవర్గస్థాయి పార్టీ సమావేశం స్థానిక పవిత్ర కల్యాణ మండపంలో జరుగుతుందని విసిపి ఇంచార్జ్ దద్దల నారాయణ యాదవ్ మంగళవారం తెలిపారు. ఈ సమావేశానికి ఉమ్మడి ప్రకాశం జిల్లా ఉదయం కోఆర్డినేటర్ కారుమంచి వెంకట నాగేశ్వరరావు, ఒంగోలు పార్లమెంట్ ఇంచార్జ్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ప్రకాశం జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు, చీమకుర్తి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. కావున ఈ కార్యక్రమానికి కనిగిరి నియోజకవర్గ వైఎస్ఆర్సిపి పార్టీ శ్రేణులు, జడ్పిటిసిలు,మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పిటిసిలు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, డైరెక్టర్లు ఎంపిటిసిలు, సర్పంచులు, కౌన్సిలర్లు,కో ఆప్షన్ సభ్యులు, వార్డు సభ్యులు విధిగా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

## సంగటి వారి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న దద్దాల

**కనిగిరి, ప్రభాతవార్త**




కనిగిరి పట్టణంలోని జూబ్లీహిల్స్( కొత్తూరు) వద్ద సంగటి అంజిరెడ్డి సతీమణి రమ్యల కుమారుడు సంగటి అభిరామ్‌రెడ్డి జన్మదిన వేడుకలో కనిగిరి వైసీపీ ఇన్చార్జి దద్దాల నారాయణ యాదవ్ పాల్గొన్నారు ఈ సందర్భంగా బాబుకు ఆశీర్వాదాలు అందజేశారు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండాలని బాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారుఈ కార్యక్రమంలో కనిగిరి జెడ్పిటిసి కస్తూరి రెడ్డి, మాజీ పిడిసిసి బ్యాంక్ చైర్మన్ వైఎం ప్రసాద్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ సభ్యులు మండాది కృష్ణారెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు కటికల వెంకటరత్నం, వరికుంటపాడు మండలం చెన్నంపల్లి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యూత్ లీడర్ బూసి చిరంజీవి హనుమంతునిపాడు మండలం సీనియర్ నాయకులు ఆదినారాయణ రెడ్డి, కనిగిరి పట్టణం సీనియర్ నాయకులు శ్రీహరి రెడ్డి, చందా నర్సారెడ్డి నాగిరెడ్డిపల్లి సర్పంచ్ స్వర్ణ ఏడుకొండల రెడ్డి, ఉడుముల లక్ష్మీనారాయణ రెడ్డి,యువ నాయకులు వాకమల్లు రాజశేఖర్, సంగటి మాధవరెడ్డి సంగటి మహేందర్ రెడ్డి శివారెడ్డి చిలంకూరు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు

## గ్రామాలల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం



**యర్రగొండపాలెం,డిసెంబర్10,ప్రభాతవార్త**

య ర్రగొండపాలెం మండలం లోని గంగపాలెం, నరసాయపాలెం, గ్రామాలల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం వ్యవసాయశాఖ అధికారుల ఆద్వర్యంలో రైతు సేవ కేంద్రం వద్ద పొలంపిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా రైతులతో కలిసి కంది,ప్రత్తి,మిరప, పంటలను అధికారులు పరిశీలించారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి కె.వి.శేషరెడ్డి,మాట్లాడుతూ ప్రస్తుతం కంది కల్లెదశలో ఉన్నందున కంది యొక్క చిగుర్లను ఒక అడుగు మేర కత్తిరించవలెనని,ఇలా చేయడం వలన పైరు ఎదుపుగా పెరిగి,కాయ తోచు పురుగును నివారించవచ్చని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖదికారి పి.ఆదిరెడ్డి,మాట్లాడుతూ బొప్పాయి పంటలో ఆకు మచ్చ తెగులు సోకి క్రింద ఆకులు పండుబారి రాలిపోతున్నాయని అన్నారు.అనంతరం రైతులకు పలు సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి డి.ధనేశ్వరనాయక్, రైతుసేవకేంద్రసిబ్బంది.నాగేంద్రకుమార్,మంత్రునాయక్,రైతులు,తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే అశోక్ రెడ్డి కొరకు పాదయాత్ర చేపట్టిన టిడిపి కార్యకర్తలు

**గిద్దలూరు, డిసెంబర్ 10 ప్రభాతవార్త :**




ప్రకాశం జిల్లా గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డికి వీర అభిమానులు, టిడిపి నాయకులు దూదేకుల దస్తగిరి, పిడతల రవి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి గిద్దలూరు పట్టణంలోని రాచర్ల గేట్ సెంటర్ దగ్గర ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానం నుండి పాదయాత్ర చేపట్టారు. మంగళవారం నాటికి వీరి యాత్ర ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని చిన్న దోర్నాలకు చేరుకుంది. 2024 అసెంబ్లీ ఎన్నికలలో ఎమ్మెల్యేగా ముత్తుముల అశోక్ రెడ్డి విజయం సాధిస్తే శ్రీశైలానికి కాలినడకన వచ్చి మల్లన్నను దర్శించుకుంటామని మొక్కు పెట్టుకున్నట్లుగా వీరు తెలిపారు. ఆదివారం గిద్దలూరు పట్టణంలోని రాచర్ల గేట్ సెంటర్ నుంచి వీరు పాదయాత్ర ప్రారంభించారు. మరో 24గంటల్లో శ్రీశైలం చేరుకొని మొక్కు తీర్చుకుంటామని టిడిపి కార్యకర్తలు దూదేకుల దస్తగిరి, పిడతల రవిలు తెలిపారు.

**CHANGE OF NAME**

MALEMPATI BHAGYA LAKSHMI(OLD NAME) W/O VENKATESWARLU Resident of D.No 2-84/2, MINNEKALLU, MINNEKALLU, SANTHSAMAGULURU, DIST PRAKASAM, AP -523302. I HAVE CHANGED MY NAME AS MALEMPATI BAGHAYA LAKSHMI (NEW-NAME), W/O VENKATESWARLU, HEREAFTER MY NAME IS KNOWN AS MALEMPATI BAGHAYA LAKSHMI (NEWNAME) W/O VENKATESWARLU.

# అవే నిరసనలు..అవే వాగ్వాదాలు



## వాయిదాల పర్వంలో పార్లమెంటు ఉభయసభలు

## ఎంపిలను హెచ్చరించిన స్పీకర్ ఓంబిర్లా

## రాజ్యసభ ఛైర్మన్‌కు అవిశ్వాసం నోటీసు

**న్యూఢిల్లీ, డిసెంబరు 10:** పార్లమెంటు ఉభయ సభలు నిరసనలు, నినాదాలమధ్య మరోసారి వాయిదాపడ్డాయి. మంగళవారం సభలు ప్రారంభం కాగానే బిజెపి, ఇండియా కూటమి సభ్యుల మధ్య మళ్లీ వాగ్వాదాలుప్రారంభం అయ్యాయి. జార్జిసోరోస్, సోనియా మధ్య ఉన్న లింకులు బహిర్గతం చేయాలంటూ అధికారపక్ష సభ్యులు నిరసనలతో హోరెత్తిస్తే ఇండియా కూటమి సభ్యులు మణిపూర్ హింస, సంభాల్ మసీదు సర్వే, రైతుల ఆందోళన వంటి వాటిపై చర్చ జరపాలంటూ పట్టుబట్టారు. ఒకదశలో స్పీకర్ ఓంబిర్లా తీవ్ర స్వరంతో సభ్యులను మందలించారు. ఎంపిలు సభను అగౌరవ పరుస్తున్నారని ప్రపంచంలోనే మనది అతిపెద్ద ప్రజాస్వామ్యవ్యవస్థ అని అన్నారు. మనం సభ హుందాతనాన్ని కాపాడుకోవాలని సభలో నెలకొంటున్న పరిణామాలు తనను ఎంతో బాధకలిగిస్తున్నాయని, ఈ తీరు ఎంతమాత్రం మంచిది కాదని ఆయన అన్నారు.

ప్రత్యేకించి సభకు విఘాతం కలిగించాలన్న లక్ష్యంతోనే సభ్యులు వ్యవహరించడం విచారకరమన్నారు. వారు అధికారపక్షం అయినా, విపక్షం అయినా సరే ప్రతి ఎంపి కూడా సభా మర్యాదను పాటించాలని తద్వారా ప్రజాస్వామ్య దేవాలయం లాంటి పార్ల మెంటుపై సానుకూల సంకేతాలు ప్రజల్లోకి వెళతాయన్నారు. అంగీకరించడం, అంగీకరించకపోవడం అనేది ఆరోగ్యకర ప్రజాస్వామ్యంలో తరచూ నెలకొంటాయని బిర్లా అన్నారు. రెం డువైపులా కూడా తమతమ తారతమ్యాలను చర్చలతోనే పరిష్కరించుకోవాలని సూచించారు. విపక్ష ఎంపిలు వివిధ అంశాలపై చర్చలు జరపాల్సిందేనని పట్టుబట్టారు. బిజెపికి చెందిన సోరోస్ సోనియా గాంధీ ఆరోపణలపై బిజెపి చర్చకు లేవనెత్తితే స్పీకర్ తిరస్కరించారు. సభ సజావుగా సాగేందుకు సహకరించాలని ఆయన కోరారు. స్వల్పసమయం వాయిదా తర్వాత మళ్లీ సమావేశం అయిన తర్వాత బిజెపి ఎంపి సంబిట్ పాత్రా విపక్షంపై ధ్వజమెత్తారు. రాహుల్ గాంధీకి లోక్‌సభలో ఎలా వ్యవహరించాలో తెలియదని, పార్లమెంటులో ఎలా ప్రశ్నలు లేవనెత్తాలో కూడా తెలియదని అన్నారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్‌రిజిజు కూడా అదే పంథాలో పట్టుబట్టారు. సమాజ్‌వాది పార్టీకి చెందిన ఎంపిలు కాంగ్రెస్ మిత్రపక్షాలు తృణమూల్ కూడా బిజెపిపై ఫిర్యాదులు చేసారు. ఇక రాజ్యసభలో అయితే ఛైర్మన్ జగదీప్‌ధన్‌కర్‌పై అవిశ్వాసం నోటీసు ఇచ్చారు. అధికార బిజెపి పక్షసభ్యులు ఇచ్చిన నోటీసులను అనుమతిస్తూ తామిచ్చిన కీలక అంశాల నోటీసులు తిరస్కరిస్తూ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని చెపుతూ అవిశ్వాసం నోటీసు జారీచేయడంతో సభలో మరింతగా ఉద్రిక్తత లేచింది. దీనితో ఉభయసభలు మరుసటి రోజుకు వాయిదా పడ్డాయి.

# 15 నుంచి శ్రీలంక అధ్యక్షుని భారత్ పర్యటన



**న్యూఢిల్లీ, డిసెంబరు 10:** శ్రీలంక కొత్త అధ్యక్షుడు అనుర దిస్సనాయకే తన మొట్టమొదటి విదేశీ పర్యటనగా భారత్‌కు వస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత తన మొట్టమొదటి విదేశీ పర్యటన భారత్ కావడం విశేషం. ఈ పర్యటన రెండుదేశాలమధ్య నెలకొన్న సంబంధాలను గుర్తుచేస్తుందని విదేశాంగశాఖ ట్వీట్‌చేసింది. శ్రీలంక కేబినెట్ ప్రతినిధి డా.నలిండ జయతిస్సా మాట్లాడుతూ తమ అధ్యక్షుడు పర్యటన డిసెంబరు 15 నుంచి 17వ తేదీవరకూ ఉంటుందని తెలిపారు. తన పర్యటనలో ప్రధాని నరేంద్రమోడీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ములను కలిసి చర్చలుజరుపుతారని కేబినెట్‌ప్రతినిధి నలిండా జయతిస్స వెల్లడించారు. ఆయన తోపాటు విదేశాంగమంత్రి విజిత హేరాత్, డిప్యూటి ఆర్థికమంత్రి అనిల్‌జయంత ఫెర్నాడో, ఆరోగ్యమంత్రిగా ఉన్న జయతిస్స కూడా ఉంటారని తేలింది. భారత విదేశాంగమంత్రి జైశంకర్ ఇటీవల జరిపిన శ్రీలంక పర్యటనలో భారత్‌పర్యటనకు రావాలని ఆహ్వానించారు. శ్రీలంకలో కొత్తప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆదేశంలో పర్యటించిన మొట్టమొదటి విదేశాంగమంత్రి జైశంకర్‌కావడం గమనార్హం. 225 మందిసభ్యులున్న శ్రీలంక పార్లమెంట్‌లో పూర్తిస్థాయి మెజార్టీ ఉన్న ప్రభుత్వం ఏర్పాటు చేయడం భారత్‌తో సత్సంబంధాలనే కోరుకుంటున్నామని దిస్సనాయకే ప్రకటించడం వంటివి జరిగాయి. ఈనేపథ్యంలోనే దిస్సనాయకే తన మొట్టమొదటి పర్యటనగా భారత్‌ను ఎంచుకున్నట్లు స్పష్టం అవుతోంది.

### ఓ వర్గంపై అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి వివాదాస్పద వ్యాఖ్యలు

# విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, డిసెంబరు 10:** అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్‌కుమార్‌యాదవ్ వివాదాస్పద వ్యాఖ్యలను సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకొని విచారణ చేపట్టింది. ఆయన ప్రసంగంపై అలహాబాద్ హైకోర్టును సమాచారం ఇవ్వాలని ఆదేశించింది. విశ్వహిందూ పరిషత్ లీగల్ సెల్ ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో జస్టిస్ శేఖర్‌యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఓ వర్గంపై చేసిన వ్యాఖ్యలపై వివాదం చెలరేగింది. జ్యుడీషియల్ అకౌంటబిలిటీ అండ్ రిఫార్మ్స్ (సిజెఎఆర్) అనే సంస్థ సిజెఐ జస్టిస్ సంజీవ్‌ఖన్నాకు లేఖ రాసింది. హైకోర్టు జడ్జిపై అంతర్గత విచారణ జరపాలని సంస్థ కన్వీనర్ ప్రశాంత్‌భూషణ్ డిమాండ్ చేశారు. ఆయన న్యాయనైతికత, రాజ్యాంగ సూత్రాలను ఉల్లంఘించారని ఆరోపించారు. ఓ వర్గాన్ని కించపరిచే పదాలను సైతం ఉపయోగించారని లేఖలో ప్రస్తావించారు. వ్యాఖ్యలతో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి పదవికి, న్యాయవ్యవస్థకు చెడ్డపేరు వచ్చిం దన్నారు. ఉమ్మడి పౌరస్మృతిపై విహెచ్‌పి లీగల్ సెల్ నిర్వహించిన ఓ కార్యక్రమంలో జస్టిస్ శేఖర్‌యాదవ్ పాల్గొన్నారు. మెజారిటీ ప్రజల ఆకాంక్షల మేరకు హిందుస్థాన్ నడుస్తుంది తప్పా.. నలుగురిని పెళ్లి చేసుకునే హక్కు ఉంది.. హలాలా చేస్తాం..



ట్రిపుల్ తలాఖ్ ఇస్తాం.. అందుకు మా పర్సనల్ లా అంగీకరిస్తుందని అనలేరని.. ఆ హక్కులు ఇక్కడ పని చేయవంటూ వ్యాఖ్యానించారు. ఆయన తన ప్రసంగంలో కఠ్‌ముల్లా (మూఢ ముస్లిం) అనే పదాన్ని సైతం వాడారు. యుసిసి అంటే అది విహెచ్, ఆర్‌ఎస్‌ఎస్‌లకు సంబంధించిన విషయం కాదని దేశ సర్వోన్నత న్యాయస్థానం సైతం దీని గురించి మాట్లాడిందన్నారు. కఠ్‌ముల్లాలు అనే మాట అనడం సరైంది కాకపోవచ్చని కానీ, అనేందుకు తాను సంకోచించనన్నారు. ఎందుకంటే వారు దేశానికి ప్రమాదకరమని వ్యతిరేకమన్న ఆయన వారితో జాగ్రత్తగా ఉండాలని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి. న్యాయమూర్తిగా ఉన్న ఆయన.. ఇలాంటి వ్యాఖ్యలు చేయడమేమిటని ప్రశిస్తున్నారు.

# కర్ణాటక మాజీ సిఎం ఎస్‌ఎం కృష్ణ కన్నుమూత

**బెంగళూరు, డిసెంబరు 10:** కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి మహారాష్ట్ర మాజీ గవర్నర్ ఎస్‌ఎం కృష్ణ (92) కన్నుమూసారు. యుపిఎ ప్రభుత్వ హయాంలో ఆయన విదేశాంగమంత్రిగా కూడా పనిచేసారు. 1932లో జన్మించిన ఎస్‌ఎం కృష్ణ అంచలంచెలుగా ఎదుగుతూ వచ్చారు. బెంగళూరులోని ఆయన నివాసంలోనే మంగళవారం తెల్లవారురుఝాము 2.45 గంటలకు కన్నుమూసారని కుటుంబసభ్యులు తెలిపారు. కొద్దికాలంగా ఆయన అస్వస్థతో ఉన్నారు. మాండ్య జిల్లాలో బుధవారం ఆయన అంత్యక్రియలను పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అలాగే కర్ణాటక ప్రభుత్వం మూడురోజులపాటు సంతాపదినాలు ప్రకటించింది. మాండ్యజిల్లాలోని సోమనహళ్లిలో 1932 మే ఒకటవ తేదీ జన్మించారు. కాంగ్రెస్ పార్టీతో సుదీర్ఘ అనుబంధం కలిగి ఉన్న ఆయన తన రాజకీయ కెరీర్ చివరిలో బిజెపిలో చేరారు. ప్రజల జీవనప్రమాణాలు పెంపొందించేందుకు అవిరళ కృషిచేసారని, ఎస్‌ఎం కృష్ణతో తనకు ఎంతో మంచి అనుబంధం ఉందని, ఆయన మరణం తనను ఎంతగానో బాధించిందని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మాట్లాడుతూ ఎస్‌ఎంకృష్ణ మరణవార్త వినిచలించి పోయానన్నారు. రాష్ట్ర, కేంద్ర మంత్రిగాను, ముఖ్యమంత్రిగాను నిరుపమాన సేవలందించారని, కర్ణాటకకు ఆయన చేసిన సేవలు చిరకాలం గుర్తుంటాయన్నారు. ఐటిబిటి సెక్టార్‌వృద్ధికి ఎస్‌ఎం కృష్ణ మూలకారకులని అన్నారు. కాంగ్రెస్‌లో చేరే సమయంతో తనకు మార్గనిర్దేశంచేసిన గురువు అని తన సంతాపసందేశంలో పేర్కొన్నారు. ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ ప్రజాసంక్షేమానికి పాటుపడిన నాయకుడు ఎస్‌ఎం కృష్ణ అని నిరంతరం వారి శ్రేయస్సుకోసమే పాటుపడ్డారని అన్నారు. మా స్నేహం మాలో పోటీతత్వం పెంచేదని, మా రెండురాష్ట్రాలకు పెట్టుబడులు సాధించడంలో పోటీలు పడేవారమని గుర్తుచేసుకున్నారు. ఆయన కుటుంబానికి తనప్రగాఢ సానుభూతిని తెలిపారు. మైసూరు మహారాజ కళాశాలనుంచి డిగ్రీ పట్టా పొందిన ఆయన బెంగళూరు ప్రభుత్వ న్యాయకళాశాలలో లా చదివారు. ఆ తర్వాత అమెరికాకువెళ్లి సదరన్ మెథోడిస్ట్ యూనివర్సిటీలోను, జార్జివాషింగ్టన్ యూనివర్సిటీల్లో కూడా ఉన్నత విద్యను అభ్యసించారు. 1962లో మద్దూరు అసెంబ్లీ స్థానంలో స్వతంత్ర అభ్యర్థిగా గెలిచారు. ప్రముఖ కాంగ్రెస్‌నేత కెవి శంకర్‌గౌడను ఓడించి మరీ గెలిచారు. 1968లో పార్లమెంటుకు మాండ్య ఉప ఎన్నిక ద్వారా ఎన్నికయ్యారు. అయితే ఆయన రాజీనామాచేసి రాష్ట్రానికే పరిమితం అయ్యారు. 1972నుంచి రాష్ట్ర రాజకీయాల్లో చురుకుగా పాల్గొన్న ఆయన 1980లో మళ్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1971లోఓనే కాంగ్రెస్ జాతీయ కమిటీ సభ్యుడుగా ఉన్నారు. కొంతకాలం పాటు అంతకుముందు ప్రజా సోషలిస్టుపార్టీలో పనిచేసారు. 1999లో కాంగ్రెస్ రాష్ట్ర చీఫ్‌గా ఎన్నికయ్యారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి అయ్యారు.మహారాష్ట్ర గవర్నర్‌గా 2004 నుంచి 2008వరకూ పనిచేసారు. 2009లో విదేశాంగమంత్రిగా కూడా కొనసాగారు.



ఎస్‌ఎం కృష్ణ (ఫైల్)

# గగన్‌యాన్ కోసం మరోసారి సముద్రయానం పరీక్షలు


**శ్రీహరికోట (తడ), డిసెంబరు 10 ప్రభాతవార్త:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ గగన్‌యాన్ ముందస్తు పరీక్షలు, పరిశోధనలు ముమ్మరం చేసింది. మరోసారి సముద్రంలో రికవరి పరిశోధనలు మొదలయ్యాయి. భారతీయ నావికాదళం, ఇస్రో సంయుక్తంగా వెల్‌డెక్ రికవరి ట్రయల్స్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు మంగళవారం ప్రకటించింది. ఇటీవల ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ పిఎస్ఎల్‌వి-సి59 విజయం తర్వాత మాట్లాడుతూ మానవ రహిత తొలి ప్రయోగాన్ని 2025 తొలి రోజుల్లో ప్రయోగిస్తామని ప్రకటించారు. ఈ మేరకు అందుకు సంబంధించి ముందస్తు జాగ్రత్త రికవరీ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలుస్తోంది. విశాఖ పట్నం తీరంలో వెల్‌డెక్ షిప్‌ను ఉపయోగించి తూర్పు నౌకాదళ కమాండ్ ట్రయల్స్ నిర్వ హించారు. అంతరిక్షంలో ప్రవేశపెట్టిన క్రూమా డ్యూల్ సముద్రాన్ని తాకిన తర్వాత సాధ్యమైనంత తక్కువ సమయంలో సిబ్బంది క్రూమా డ్యూల్ నుంచి క్షేమంగా బయటకు రాగలిగే ప్రయోగమిది. ఒక ఓడలోని వెల్‌డెక్ నీటితో నింపి తద్వారా పడవలు, ల్యాండింగ్ క్రాఫ్టులు ద్వారా అంతరిక్షం నుంచి పొరపాటున సముద్రంలో పడే వారిని రక్షించడానికి ఇటువంటి సౌకర్యాలను ముందుగా ఏర్పాటు చేసుకుంటున్నారు. వెల్‌డెక్ లోపల సిబ్బందితోపాటు క్రూమాడ్యూల్‌ను సముద్రం నుంచి లాగి ఓడకు చేర్చడం ఈ పరిశోధన. రికవరీ కోసం ఆపరేషన్ల కార్యక్రమం ట్రయల్స్ సమయంలో ఇండియన్ నేవీ మరియు ఇస్రో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు ప్రకటించారు. ఈ క్రమంలో రికవరీ బాయ్ యొక్క పనితీరును గమనించారు. ఈ కార్యక్రమాల క్రమాన్ని గ్రౌండ్ పిక్చర్లను ధ్రువీకరించారు. ఇంతకుముందు కూడా ఇటువంటి పరిశోధనలు ఇస్రో చేపట్టిఉంది. అయితే ఎప్పటికప్పుడు మారుతున్న సాంకేతిక వ్యవస్థలను మరింత మెరుగుపరుచుకొని గగన్‌యాన్ ముందస్తు పరిశోధనలు చేస్తున్నారు. ఇప్పటికే గగన్‌యాన్‌లో విహరించే ఔత్సాహిక యువకులకు శిక్షణ ఇస్తూ ఈ కార్యక్రమానికి ఇస్రో అత్యంత ప్రాధాన్యత కల్పిస్తోంది.



గగన్‌యాన్ కోసం ఇస్రో సముద్రంలో చేసిన ముందస్తు ప్రయోగ దృశ్యాలు

# దేశ వ్యాప్తంగా ఈ యేడాది 719 విమానాలకు బాంబు బెదరింపులు

**హైదరాబాద్, డిసెంబరు 10, ప్రభాతవార్త:** ఉత్తుత్తి బాంబు బెదిరింపులు ఇప్పుడు విమానాలకు కూడా సాధారణంగా మారాయి. దేశ వ్యాప్తంగా అన్ని విమానాశ్రయాల పోలీసులకు ఉత్తుత్తి బాంబు బెదిరింపు ఫోన్ కాల్స్ పెద్ద తలపోటుగా మారింది. ఈ ఉత్తుత్తి బాంబు బెదిరింపు ఫోన్ కాల్స్ గతంలోనూ వుండగా ఇప్పుడు ఎక్కువయ్యాయి. విమానాయన సంస్థలకు వస్తున్న బెదిరింపు కాల్స్ వల్ల అనేక విమానాశ్రయాలలో దేశీయ, అంతర్జాతీయ విమానాల ప్రయాణాలకు తీవ్ర ఆటంకం ఏర్పడు తోంది. గడచిన ఐదేళ్ల కాలంలో 809 ఉత్తుత్తి బాంబు బెదిరింపు కాల్స్ రాగా ఇందులో ఈ ఒక్క ఏడాదే 719 బెదిరింపు కాల్స్ రావడం గమనార్హం. 2020లో నాలు గు కాల్స్ రాగా 2021లో రెండు కాల్స్, 2022లో 13 కాల్స్, 2023లో 71 కాల్స్ వచ్చాయి. విమానాలకు బాంబు బెదిరింపు కాల్స్ చేస్తున్న నిందితులను పోలీసులు స్వల్ప వ్యవధిలోనే పట్టుకుంటుండడం గమనార్హం. తాము కావాలనే బెదిరింపు కాల్స్ చేసినట్లు నిందితులు పోలీసుల ఎదుట అంగీకరించారు. ఉత్తుత్తి బాంబు బెదిరింపు కాల్స్ కట్టడికి పౌర విమానయాన చట్టంలో మార్పులు తెచ్చేందుకు విమానయాన శాఖ కసరత్తులు చేయసాగింది. కొత్త చట్టాల ద్వారా ఉత్తుత్తి బాంబు బెదిరి ంపు కాల్స్ చేసే వారిని కఠినంగా శిక్షించేందుకు విమానయాన శాఖ నిర్ణయించింది.



# సిరియాపై వైమానిక దాడులతో విరుచుకుపడుతున్న ఇజ్రాయెల్



**డమాస్కస్, డిసెంబరు 10:** సిరియాపై ఇజ్రాయెల్ విరుచుకుపడుతోంది. ఇప్పటికే అక్కడి రసాయన ఆయుధ కర్మాగారాలపై దాడులు చేసిన ఇజ్రాయెల్ తాజాగా మరోసారి పెద్దఎత్తున వైమానిక దాడులకు పాల్పడింది. సిరియా రాజధాని డమాస్కస్‌కు 25 కిమీ పరిధి వరకు వైమానిక దాడులకు పాల్పడినట్లు బ్రిటన్‌కు చెందిన సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ వెల్లడించింది. ఈ ఘటనలో క్షిపణి లాంచర్లు, హెలికాప్టర్లు, యుద్ధ విమానాలు ధ్వంసమయినట్లు పేర్కొంది. ఇజ్రాయెల్ దళాలు సిరియా వైపు దూసుకువస్తున్నట్లు పేర్కొంది. దాదాపు 14 యేళ్ల క్రితం సిరియాలో అంతర్యుద్ధం చెలరేగినప్పటి నుంచి అక్కడ జరిగే పరిణామాలను ఇది నిశితంగా పరిశీలిస్తోంది. ఈజిప్ట్, సౌదీ అరేబియా తదితర దేశాలు సిరియాలో ఇజ్రాయెల్ చేస్తున్న దాడులు, చొరబాట్లను ఖండించాయి.

ఆ దేశంలో గందరగోళ పరిస్థితులు నెలకొన్న సమయంలో అదే అదనుగా అక్కడి భూభాగాలను ఆక్రమిస్తూ ఇజ్రా యెల్ అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించిందని ఆరోపించాయి. సిరియాను తిరుగుబాటుదారులు ఆక్రమించుకోవడంతో ఆయుధాలు వారి చేతికి చిక్కకుండా ఉండేందుకు వాటిని ధ్వంసం చేశామని ఇజ్రాయెల్ తన చర్యలను సమర్థించుకుంటోంది. 1974లో సిరియాతో కాల్పుల విరమణ ఒప్పందంతో ఏర్పాటైన గోలన్ హైట్స్‌లో బఫర్ జోన్‌ను సైతం ఇజ్రాయెల్ సైన్యం స్వాధీనం చేసుకుంది.

ఇదిలా ఉండగా సిరియాలో అమెరికా వైమానిక దాడులు చేపట్టడం చర్చనీయాంశమైంది. దీనిపై ఆ దేశ అధ్యక్షుడు జో బైడెన్ మాట్లాడుతూ సిరియాలో అధికార మార్పు సమయంలో దాని నుంచి పొరుగు దేశాలైన జోర్డాన్, లెబనాన్, ఇరాక్, ఇజ్రాయెల్‌కు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని అన్నారు. అందువల్లనే అక్కడి ఐసిస్ శిబిరాలు, కార్యవర్గంపై తమ సైనిక దళాలు డజనుకు పైగా వైమానిక దాడులు చేశాయని పేర్కొన్నారు.

తిరుగుబాటుదారులు సిరియాలోని ముఖ్యమైన నగరాలను ఆక్రమించుకోవడంతో ఆ దేశాధ్యక్షుడు బషర్ అల్ అసద్ కుటుంబంతో సహా రష్యాకు పరారై తలదాచుకున్న విషయం తెలిసిందే. దీంతో సిరియా ప్రస్తుతం తిరుగుబాటుదారుల చేతిలో ఉంది.

# అమెరికా పౌర హక్కుల అటార్నీగా హర్మీత్ ధిల్లాన్



**న్యూయార్క్, డిసెంబరు 10:** అమెరికా న్యాయ శాఖకు చెందిన పౌర హక్కుల విభాగానికి అసిస్టెంట్ అటార్నీ జనరల్‌గా భారతీయ సంతతి వ్యక్తి హర్మీత్ ధిల్లాన్‌ను డొనాల్డ్ ట్రంప్ నియమించారు. కాబోయే అధ్యక్షుడిగా ఎన్నికైన ట్రంప్ తనకు చెందిన ట్రూత్ సోషల్ మీడియాలో ఈ విషయాన్ని ప్రకటించారు. తన కెరీర్ మొత్తం పౌరుల హక్కుల కోసం పోరాడినట్లు ఆయన పేర్కొన్నారు. దేశంలో టాప్ ఎన్నికల న్యాయవాదిగా కూడా ఆమెకు గుర్తింపు ఉన్నది. లీగల్ ఓట్లను మాత్రమే లెక్కించాలని ఆమె పోరాటం చేశారు. డార్ట్‌మౌత్ కాలేజీలో ఆమె గ్రాడ్యుయేషన్ చేశారు. యూనివర్సిటీ ఆఫ్ వర్జీనియా లా స్కూల్ నుంచి ఆమె పట్టా పొందారు. యుఎస్ ఫోర్త్ సర్క్యూట్ కోర్టు ఆఫ్ అప్పీల్స్‌లో ఆమె క్లర్క్‌గా చేశారు. సిక్కు మత వర్గీయుల్లో హర్మీత్‌కు గౌరవప్ర దమైన గుర్తింపు ఉన్నట్లు ట్రంప్ తన ట్వీట్‌లో తెలిపారు. రాజ్యాంగపరమైన హక్కులను పరి రక్షించేందుకు ఆమె అవిశ్రాంత పోరాటం చేయ నున్నట్లు చెప్పారు. దిల్లాన్ చండీగఢ్‌లో జన్మించారు. చిన్నతనంలోనే ఆమె తల్లిదండ్రులతో కలిసి అమెరికాకు వలస వెళ్లారు. క్లీవ్‌లాండ్‌లో జరిగిన ఇండియన్ అమెరికన్ జిఓపి కన్వెన్షన్‌లో ఆమె తొలిసారి ప్రసంగించారు. ఈ సమావేశంలో అర్దాస్ చదివినందుకు ఆమెపై వర్ణవివక్ష దాడి జరిగింది.

# సిరియా అంతర్యుద్ధంలో 1.30 కోట్లకు పెరిగిన శరణార్థులు

## తుర్కియే, లెబనాన్‌లో 38లక్షల మందికి ఆశ్రయం

**హైదరాబాద్, డిసెంబరు 10, ప్రభాతవార్త:** సిరియాలో అల్ బషర్ సర్కారు పతనమయ్యాక విదేశాల్లో శరణార్థులుగా వున్న తమ వారిని వెనక్కు రప్పించేందుకు తిరుగుబాటుదారులు ప్రయత్నాలు చేయసాగారు. ఐక్యరాజ్యసమితి, అమ్నెస్టీ ఇంటర్నేషనల్ సంస్థల లెక్కల ప్రకారం సిరియాలో అంతర్యుద్ధం మొదలయ్యాక పొరుగు దేశా లకు వలసవెళ్లిన వారి సంఖ్య కోటీ 30 లక్షల పైమాటే. బషర్ సర్కారు మారణహోమం, అమాయకుల ఊచకోత నేపథ్యంలో లక్షల సంఖ్యలో సిరియన్లు పొట్టచేతప ట్టుకుని, కట్టుబట్టలతో పొరుగునే వున్న తుర్కియే, లెబనాన్‌తో పాటు ఇతర దేశాలకు వలసవెళ్లారు. ఇలా వలసవెళ్లిన వారిలో అత్యధికంగా తుర్కియేలో 31 లక్షల మంది వున్నట్లు ఐక్యరాజ్య సమితి వెల్లడించింది. అయితే ఈ సంఖ్య ఇంకో ఐదారు లక్షలకు పైగానే వుంటుందని చెబుతున్నారు. సిరియా నుంచి వలసవచ్చిన వారిని తుర్కియే మానవతా కోణంలో ఆదుకోవడంతో పాటు వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసింది. ఇందుకోసం సిరియన్ టెంపరరీ ప్రొటెక్షన్ స్టాటస్ పేరుతో తుర్కియే ప్రభుత్వం ఒక చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ చట్టం ప్రకారం సిరియా నుంచి వచ్చిన వలసవాదులు తుర్కియేలో ఎంతకాలం అయినా ఆశ్రయం పొందేందుకు వీలుంటుంది. వారికి భోజన, వసతులు, ఉపాధి అవకాశాలు కల్పిస్తారు.

అయితే తుర్కియే దేశ పౌరసత్వం మాత్రం లభించదు. సిరియన్లను తుర్కియే ఆదుకున్న తీరును ఐక్య రాజ్యసమితి ప్రశంసించింది. తుర్కియే తరువాత సిరియన్లు ఎక్కువగా వలస వెళ్లింది లెబనాన్ దేశానికి. ఈ దేశంలో 7.74 లక్షల మంది సిరియన్లు వలసవెళ్లారు. అనధికార లెక్కల ప్రకారం ఈ సంఖ్య మరో 15 లక్షల వరకు వుంటుందని చెబుతున్నారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే లెబనాన్ జనాభాలో ఐదోవంతు సిరియన్లు వున్నారు. అంటే ప్రతి ఐదుగురిలో ఒకరు సిరియాకు చెందిన వారుగా కనిపిస్తారని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల విభాగం వెల్లడించింది. లెబనాన్ తరువాత జర్మ నీలో సిరియన్లు ఎక్కువగా వున్నారు. ఈ దేశంలో 7.16లక్షల మందిసిరియన్లు తలదాచు కున్నారు. ఈ లెక్క మరింత పెరగకుండా వుండేం దుకు జర్మనీ చట్టం చేసింది. తాజాగా మరింత మంది సినియన్లు తమ దేశంలో రాకుండా ఈ చట్టం ఉపయోగపడుతుందని జర్మని అధికారులు చెబుతున్నారు.

తాజాగా శరణార్థి గుర్తింపు కోసం లక్ష మందికి పైగా సిరియన్లు దరఖాస్తు చేసుకోగా అందులో 47,770 మంది దరఖాస్తులను జర్మని తిరస్కరించింది. జర్మని తరువాత ఇరాక్‌లో 2.86 లక్షలు, ఈజిప్టు లో 1.56 లక్షలు, ఆస్ట్రియాలో 98 వేలు, స్వీడన్‌లో 87 వేలు, నెదర్లాండ్స్‌లో 65 వేలు, గ్రీస్ లో 50వేల మంది సిరియన్లు ఆశ్రయం పొందుతున్నారు.

సిరియాలో అసద్ బషర్ పాలన అంతం కావడంతో ఆయా దేశాల్లో శరణార్థులుగా వున్న సిరియన్లు తిరిగి తమ దేశానికి వెళ్లేందుకు ఉత్సాహం చూపుతున్నారు. గడచిన ఎనిమిది నెలల కాలంలో సిరియాలో తిరుగుబాటు దారులు పలు ప్రాంతాలను కైవసం చేసుకుని, బషర్ పాలనకు చరమగీతం పలుకు తున్న సమయంలోనే విదేశాల్లో వున్న 34 వేల మంది సిరియన్లు తిరిగి తమ దేశానికి వచ్చినట్లు అధికార గణాంకాబు చెబుతున్నాయి. రాబోయే రోజుల్లో ఈ సంఖ్య భారీగా పెరిగే వీలుందని ఐక్యరాజ్యసమితి చెబుతోంది.

# తెలుగు రాష్ట్రాల నుంచి శబరిమలకు అదనపు రైళ్లు

**గుంతకల్లు రైల్వే,డిసెంబరు 10,ప్రభాతవార్త:** కేరళలోని శబరిమలలో వెలసిన అయ్యప్ప స్వామి దర్శనార్థం తెలుగు రాష్ట్రాల నుంచి వెళ్లే భక్తాదుల సౌకర్యార్థం రైల్వేశాఖ అదనంగా మరి కొన్ని ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. కాకినాడ పోర్ట్ నుంచి కొల్లాం వెళ్లే నెంబర్ 07173ప్రత్యేక రైలు ఈ నెల 11,18,19,25వ తేదీల్లో ప్రతి బుధవారం రాత్రి 11-50గంటలకు కాకినాడ పోర్ట్ నుంచి బయలుదేరి శుక్రవారం తెల్లవారుజామున 5-30గంటలకు కొల్లాం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కొల్లాం నుంచి కాకినాడ పోర్ట్ వెళ్లే నెంబర్ 07174ప్రత్యేక రైలు ఈ నెల 13,20,27వ తేదీల్లో శుక్రవారాల్లో ఉదయం 8-40గంటలకు కొల్లాం నుంచి బయలుదేరి శనివారం సాయంత్రం 4గంటలకు కాకినాడ పోర్ట్ చేరుకుంటుంది. మార్గమధ్యలో ఈ రైలు కాకినాడటౌన్, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తణుకు,భీమవరంటౌన్, ఆకివీడు, గుడివాడ, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు,గూడూరు, రేణిగుంట,తిరుపతి, చిత్తూరు, కాట్పాడి,జోలార్‌పేట్,సేలం, ఈరోడ్, తిరుప్పూర్, పోదనూరు, పాల్ఘాట్, త్రిశూర్, అలువ,ఎర్నాకులం,ఎట్టుమనూరు,కొట్టాయం, తిరువళ్ల,చెంగనూరు,కన్యాకులం స్టేషన్లలో నిలుస్తాయి. **సికింద్రాబాద్-కొల్లాం-సికింద్రాబాద్ ప్రత్యేక రైళ్లు :** సికింద్రాబాద్ నుంచి కొల్లాం వెళ్లే నెంబర్ 07175ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 19,26వ తేదీల్లో గురువారాల్లో రాత్రి 8గంటలకు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి,శనివారం తెల్లవారుజామున 1-30గంటలకు కొల్లాం చేరుకుంటుంది. తిరుగుప్రయాణంలో కొల్లాం నుంచి సికింద్రాబాద్ వెళ్లే నెంబర్ 07176ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 21,28వ తేదీల్లో శనివారాల్లో తెల్లవారుజామున 5గంటలకు కొల్లాం నుంచి బయలుదేరి ఆదివారం మధ్యాహ్నం 1-30గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ రైలు మార్గమధ్యలో మౌలాలి, చెర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికూడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి,చీరాల, ఒంగోలు,నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, వేలూరు, తిరువణ్ణామలై, విల్లుపురం, వృద్ధాచలం, అరియలూరు, శ్రీరం గం, తిరుచిరాపల్లి, డిండిగల్లు, మదురై, విరుదు నగర్, తెన్కసీ, సెంగొట్టాయ్, పునలూరు స్టేషన్లలో నిలుస్తాయి.

11-12Pg6exHMNWJQE.qxd:11-12Pg6exHMNWJQE.qxd 01/01/01 9:57 AM Page 1



# లింగ ఆధారిత హింసను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలి

## - మహిళా కమిషన్ కార్యదర్శి విద్యాపురపు వసంత బాల





సదస్సులో ప్రసంగిస్తున్న మహిళా కమిషన్ కార్యదర్శి విద్యాపురపు వసంత బాల

**విజయవాడ,డిసెంబరు 10,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రతి ఇంట్లోను మహిళలు లింగ ఆధారిత హింసను ఎదుర్కొంటున్నారని రాష్ట్ర మహిళా కమిషన్ కార్యదర్శి వి. వసంత బాల తెలిపారు. విజయవాడ మారిస్ స్టెల్లా కాలేజ్ ఆడిటోరియం హాల్‌లో లింగ ఆధారిత హింసకు వ్యతిరేకంగా కేంద్ర మహిళా.శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆదేశాలకు అనుగుణంగా జాతీయ మహిళా కమిషన్ న్యూఢిల్లీ సహకారంతో రాష్ట్ర మహిళా కమిషన్ మధ్యాహ్నం సదస్సును నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా కమిషన్ కార్యదర్శి వి. వసంత బాల మాట్లాడుతూ పలు రకాలైన హింసలు వ ు ఎ ి ా ళ ు ఎదుర్కొంటున్నారని అందులో గృహ హింస, లైంగిక హింస, పని ప్రదేశంలో లైంగిక హింస, వరకట్న హింస, కించపర్చే హింస, మహిళల పట్ల క్రూరత్వం, మాన భంగాలు, వరకట్న మరణాలు, మహిళల అక్రమ రవాణా తదితరమైన ఉన్నాయని వాటిని అరికట్టాలన్నారు. దీనిలో భాగంగా సోషల్ మీడియాలో మహిళలను పలు విధాలుగా హింసించటం జరుగుతుం దన్నారు. సోషల్ మీడియాలో హింసను మహిళలు ఏవిధంగా ఎదుర్కోవాలో తెలిపే విధంగా మరియు చట్టాలు, శిక్షలపై ఈ సదస్సులో అవగాహన కల్పించామన్నారు. లైంగిక హింసకు ఎవ్వరూ ఇబ్బంది పడకూడదని చట్టాలపై అవగాహన కల్పించటం జరిగిందన్నారు. హింస ఎదుర్కొనే వారికి మహిళా కమిషన్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. మహిళా కమిషన్ మెంబర్ బూసి వినిత మాట్లాడుతూ హింసలు, బాల్య వివాహాలు అరికట్టడానికి మహిళలు, విద్యార్థినులు చట్టాలను ఉపయోగించుకోవాలన్నారు. సోషల్ మీడియా ద్వారా అపరిచిత వ్యక్తులతో పరిచయాలు పెంచుకొని సమస్యలను కొనితెచ్చుకోకూడదని విద్యార్థినులకు సూచించారు.. మహిళా కమిషన్ మెంబర్ రుకియా భేగం మాట్లాడుతూ మహిళలు ఏ సమస్య ఎదురైనా ధైర్యంగా కుటుంబ సభ్యులతో పంచుకోవాలని అవసరమైతే సైబర్ విభాగం ఇస్తున్న అత్యవస నెంబర్ 1930 ను ఉపయోగించుకోవాలన్నారు. బాల్య వివాహాలను ప్రభుత్వం నిషేధించిందని, వాటిని ఎవ్వరూ ప్రోత్సహించరాదన్నారు. అదేవిధంగా ఆపదలో ఉన్న మహిళలకు 112 ను ఉపయోగించు కోవాలన్నారు. ఆపదలో ఉన్న మహిళలకు ఆశ్రయం, వైద్య సదుపాయం, కౌన్సిలింగ్‌లు జరుగుతున్నాయన్నారు.

# గంగమ్మకు శివయ్య 'సారె' సమర్పణ

## శ్రీకాళహస్తిలో పండగ వాతావరణ



సారె తీసుకెళుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**శ్రీకాళహస్తి, డిసెంబర్ 10 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున గంగమ్మకు సారెను శాస్త్రోక్తంగా వేదమంత్రోర్చరణల మధ్య సమర్పించారు. శాసనసభ్యుడు స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, తెలుగుదేశం నాయకులు, ఆలయ ఇఒ టి.బాపిరారు ముఖ్యఅతిధులుగా విచ్చేయగా కన్నుల పండువగా మారింది. ఆలయ ఇఒ టి.బాపిరెడ్డి పర్యవేక్షణలో సారె కన్నుల పండువగా మారింది. గతం కన్నా భిన్నంగా కార్యక్రమాల్ని ఏర్పాటు చేసారు.ఈ ఏడాది శాసనసభ్యుడు బబొజ్జల సుధీర్‌రెడ్డి సూచనలతో ఆలయ ఇఒ టి.బాపిరెడ్డి ప్రత్యేక ఏర్పాట్లను చేపట్టారు. అంతేకాక గత మూడు నెలలుగా దేవస్థానం నిర్వహించే కార్యక్రమాల్లో ప్రత్యేకత ఉండాలని నాయకుల ఆదేశాలతో నిర్వాహకులు డ్రమ్ములను ఏర్పాటు చేసారు.డప్పుల మోతతో పట్టణం దద్దరిల్లింది. సుమారు వంద మందికి పైగా తట్టలను నెత్ని పెట్టుకొని బయలుదేరారు. ఏడు గంగమ్మల జాతర పురస్కరించుకొని గంగమ్మకు ఆలయం తరపున సారెను మంగళవారం రాత్రి అత్యంత వేడుకగా తీసుకెళ్ళి సమర్పించారు. ఆలయంలోని అలంకార మండపంలో గంగమ్మలకు సారె, పూజా ద్రవ్యాలను సిద్ధం చేసి వేదపండితులు, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ సారె పళ్ళాలను నేతలు, అధికారులు తలపై వుంచుకొని అంగరంగ వైభవంగా ఊరేగింపుగా ఆలయం నుండి పట్టణ పురవీధుల మీదుగా గంగమ్మ ఆలయానికి తీసుకొచ్చారు. గంగమ్మ ఆలయ పూజారులకు సారెను అందించారు. వేదపండితులు, ఆలయ అర్చకులు వేదమంత్రోర్చరణల మధ్య గంగమ్మకు శివయ్య సారెను సమర్పించి విశేష పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ టి.బాపిరెడ్డిఆలయాధికారులు డెప్యూటీ ఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్, సుదర్శనం నాయుడు సూపరింటెండెంట్ నాగభూషణం, విజయసారధి, ఎంఎల్ఏతో పాటు బిజెపి నాయకుడు, మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ కోలా ఆనంద్‌కుమార్, తెలుగుదేశం నాయకులు పట్టణ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్‌నాయుడు,మాజీ మార్కెట్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు,కాసరం రమేష్, మాజీ కౌన్సిలర్ సుప్రజ, బిజెపి పట్టణ అధ్యక్షుడు గరికపాటి రమేష్, తదితరులు పాల్గొన్నారు.డివైయస్‌పి నరసింహామూర్తి, సిఐ గోపి సారధ్యంలో చక్కటి బందోబస్టు ఏర్పాటు చేసారు. కాగా పారిశుద్ధ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు.

# సర్వశక్తి లింగ పూజలతో పవన్ విజయం

## మర్మయోగి మన సిద్ద గురు

**శ్రీకాళహస్తి,డిసెంబర్ 10 ప్రభాతవార్త** దేశంలోని సర్వశక్తి లింగాలకు పూజలు చేసిన దరిమిలా డెప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎన్నికల్లో విజయం సాధించారని చెన్నైకు చెందిన విజయనగర సామ్రాజ్యం రాజా వంశీకుడు మర్మయోగి మన సిద్ధ గురు మంగళవారం తెలిపారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి సమీపంలోని కన్నప్ప కొండను ఆనుకొని ఉన్న 'ఓం కార ఆశ్రమంలో వెలసిన నిత్యానంద స్వామి 18 వ ఆరాధన కార్యక్రమాలకు ముఖ్యఅతిధిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ సర్వశక్తి లింగంను ఆరాధించటంతో సినీనటుడు పవన్ కళ్యాణ్‌కు రాజయోగం లభించిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వానికి ప్రతిపక్షం ఇబ్బంది ఉందని జోస్యం చెప్పారు.ఈ సందర్భంగా మఠంలో ప్రత్యేక హోమాలు, అన్నదానం,పూజలు జరిపారు. బ్రహ్మర్షి నాగసేన సారధ్యంలో నిత్యానంద స్వామి సమాధికి పూజలు జరిపారు.ఈ సందర్భంగా హాజరైనమర్మయోగి మన్ సిద్ధ గురు మాట్లాడుతూ సినీ నటుడు పవన్ కళ్యాణ్ సర్వశక్తి లింగానికి పూజలు చేశారని గుర్తు చేసారు.ఆ సమయంలో తాను ఆయనకు ఆశీర్వదించినట్లు వివరించారు.ఆంధ్ర రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సమర్థవంతంగా పని చేస్తుందని అయితే డెప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌ను ఇబ్బంది పెట్టడానికి ప్రతి పక్షాలు సిద్ధమయ్యాయన్నారు. అనేక రకాలుగా ఇబ్బంది పెట్టడానికి ప్రతిపక్ష నేత పన్నాగాలు పన్నుతున్నారని వాటిని ఎదుర్కొని నిలవటానికి ఆయనకు దైవ బలం బలంగా ఉందన్నారు.నాడు ఆయనకు ఆశీర్వదించినపుడు ఆయనకు ఇచ్చిన మాట ప్రకారం ఆయన పేర సర్వశక్తి లింగంతో పుణ్యక్షేత్రాలను సందర్శిస్తూ అక్కడ పూజలు నిర్వహిస్తున్నట్లు మర్మయోగి సిద్ధు వివరించారు.

# చట్టాన్ని ఉల్లంఘిస్తున్న ఏ పోలీస్‌నూ వదిలిపెట్టం

## - వైఎస్సార్సీ లీగల్ సెల్ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి స్పష్టీకరణ




**విజయవాడ, డిసెంబరు 10, ప్రభాత వార్త ప్రతినిధి:** రాష్ట్రంలో అడుగ డుగునా యథేచ్ఛగా చట్టాల ఉల్లంఘన జరుగుతుందని వైయస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి ఆరోపించారు. ఐజీ స్థాయి మొదలు కానిస్టేబుల్ వరకు అదే దారిలో సోషల్ మీడియా యాక్టివిస్టులపై ద్వేషంతో రగులుతున్నానన్నారు. వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఎం.మనోహర్‌రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ సోషల్ మీడియా యాక్టివిస్టుల అరెస్టులపై అడ్డదారుల కూటమి నాయకులు చెప్పినట్టు నడుస్తున్నార బెదిరించి కన్ఫెషన్ స్టేట్‌మెంట్లు రికార్డు చేస్తున్నారు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పోలీసులు యథేచ్ఛగా చట్ట ఉల్లంఘన చేస్తున్నారని, వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని, ప్రైవేటు కేసులతో న్యాయస్థానంలో నిలబెడతామని వైయస్సార్‌సీపీ లీగల్‌సెల్ విభాగం అ ధ్యక్షుడు ఎం.మనోహర్‌రెడ్డి వెల్లడించారు. మాన్యువల్ పరిధి పోలీసులు దాటుతున్నారన్నారు.రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ మాన్యువల్ ప్రకారం నడుచుకోకుండా కూటమి నాయకుల ఒత్తిళ్లకు లోబడి పని చేస్తోంది. ఐజీ స్థాయి అధికారి మొదలు కిందిస్థాయి కానిస్టేబుల్ వరకు దాదాపు అందరూ అలాగే పని చేస్తున్నారు. నెల్లూరు జిల్లాలో సివిల్ డ్రెస్‌లో, నెంబర్ ప్లేట్ లేని కారులో వెళ్లిన పోలీసులు, ఒక దళిత కుటుంబానికి చెందిన వ్యక్తి (సోషల్ మీడియా యాక్టివిస్ట్)ని దౌర్జన్యంగా ఎత్తుకెళ్లారు. దీనిపై వైయస్సార్‌సీపీ ఇన్‌ఛార్జ్ జిల్లా ఎస్పీకి ఫోన్ చేసినా పట్టించుకోలేదు. చివరికి కారును వెంబడిస్తే అతడిని రాపూరు పోలీస్ స్టేషన్‌కి తీసుకొచ్చారు.బెయిలబుల్ కేసుల్లో 41-ఏ నోటీస్ ఇవ్వాలని, అరెస్ట్ చేయడానికి వెళ్లినప్పుడు పోలీసుల ఐడెంటిటీ ఉండాలని సుప్రీంకోర్టు ఆదేశాలున్నా, ఇవేవీ మన రాష్ట్ర పోలీసులకు పట్టడం లేదు. సివిల్ డ్రెస్‌లు ధరించి నెంబర్ ప్లేట్లు లేని కార్లు, బైకులపై వచ్చి దౌర్జన్యంగా తీసుకెళ్లిపోతున్నారు..దీంతో వచ్చిన వారు పోలీసులో లేక గూండాలో కూడా అర్థం కాని దుస్థితి ఉందన్నారు. వైయస్సార్‌సీపీలో ఉంటే మరిన్ని కేసులు పెడతామని బెదిరించే హక్కు పోలీసులకు ఎవరిచ్చారు?. చంద్రబాబు మొదలుకొని మంత్రి లోకేశ్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు వంటి వారు సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులపై వివిధ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేసి 15 రోజులు గడిచినా, పోలీసులు కేసులు నమోదు చేసిన దాఖలాలు లేవు. పోలీసులు బీఎన్‌యస్ యాక్ట్ ప్రకారం నడుచుకోవడం లేదు.అరెస్ట్ చేసినప్పుడు ఎఫ్ఐఆర్ కాపీలు ఇవ్వడం, బంధువులకు తెలియపర్చడం, కోర్టులో ప్రవేశపెట్టే ముందు రిమాండ్ రిపోర్టు వంటివి ఏవీ ఇవ్వడం లేదు. ఒక్కసారి అరెస్ట్ చేసి జ్యుడీషియల్ కస్టడీకి పంపిన తర్వాత వేర్వేరు తేదీలతో అనేక స్టేషన్లలో కేసులు నమోదు చేస్తున్నారు.జైళ్ల నుంచి పీటీ వారెంట్లతో అర్థరాత్రి అడ్వకేట్లు లేని సమయంలో బంధువులకు సమాచారం కూడా ఇవ్వకుండా మేజిస్ట్రేట్ ఇంటి దగ్గర హాజరు పరుస్తున్నారు. అక్కడ్నుంచి ఎక్కడికి తీసుకెళ్తున్నారో కూడా చెప్పడం లేదు.ఇటీవల ఒక సోషల్ మీడియా యాక్టివిస్ట్ తన స్టేటస్‌లో పార్టీకి చెందిన వీడియో పెట్టుకుంటే ఆ వ్యక్తిని తీసుకెళ్లి విపరీతంగా లాఠీలతో చావబాదారు.

# రాష్ట్రంలో ధాన్యం కొనేవారు లేక రైతుల పరిస్థితి దైన్యం

## దళారీల గుప్పిట్లో విలవిల లాడుతున్న రైతులు

## - మాజీమంత్రి అంబటి రాంబాబు



అన్నదాతకు అండగా రూపొందించిన పోస్టర్‌ను అవిష్కరిస్తున్న అంబటి

**విజయవాడ,డిసెంబరు 10,ప్రభాతవార్త ప్రతి నిధి:** రాష్ట్రంలో ధాన్యం కొనే వారు లేక రైతుల పరిస్థితి దైన్యంగా మారిందని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. దళారీల గుప్పిట్లో విలవిల లాడుతున్న రైతులు రాష్ట్రంలో గిట్టుబాటు ధరకు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతూ ఈ నెల 13వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంను విజయవంతం చేయాలని కోరుతూ అన్నదాతకు అండగా వైయస్ఆర్ సిప్ధి పేరుతో రూపొందించిన పోస్టర్ ను తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నేతలు ఆవిష్కరించారు. మాజీమంత్రులు అంబటి రాంబాబు, వెల్లంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీ లు లేళ్ళ అప్పిరెడ్డి, రుహుల్లా, మంగళగిరి వైయస్ఆర్ సిపి సమన్వయకర్త వేమారెడ్డి, మాజీ లిడ్ క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్, రాష్ట్ర ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొర్మి కనకారావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు నారాయణమూర్తి, నిమ్మకాయల రాజనారాయణ తదితరులు పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ. ఈ రాష్ట్రంలోని రైతులకు అండగా నిలిచేందుకు, ధాన్యం కొనుగోళ్ళలో ప్రభుత్వంపై వత్తిడి తెచ్చి, రైతులకు న్యాయం చేసేందుకు ఈ నెల 13న రాష్ట్ర వ్యాప్త కార్యక్రమాలకు వైయస్ఆర్ కాంగ్రెస్ అధినేత వైయస్ జగన్ పిలుపునిచ్చారు. ఈ రోజు రాష్ట్రంలో రైతుల పరిస్థితి అతి దారుణంగా ఉంది. ఈరోజు మంగళగిరి నియోజకవర్గంలోని చిర్రావురు, గుండిమెడ గ్రామాల్లో రాశులుగా పోసిన ధాన్యంను చూసి, రైతులతో మాట్లాడటం జరిగింది. ఈ సందర్భంగా వారి ఆవేదన అర్థమయ్యింది. ఈ ఏడాది అకాల వర్షాలు, వాయుగుండాల వల్ల రైతుల పంట దిగుబడి ఇరవై నుంచి ముప్పై బస్తాలకే పరిమితం అయ్యింది. చివరికి ఆ ధాన్యంకు కూడా గిట్టుబాటు ధర కల్పించలేని దుర్మార్గమైన పరిస్థితిని ఈ రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. మంత్రి మనోహర్ స్పందించడం లేదు పౌరసరఫరాలశాఖ మంత్రి మనోహర్ రైతుల వద్దకు వెళ్ళి ప్రతి గింజా కొంటానంటూ హామీ ఇచ్చారు. రైతులు ఫోన్ లో మెసేజ్ చేస్తే చాలు వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. నిజమని నమ్మిన రైతులు ఎన్నిసార్లు ఫోన్ చేసినా, మెసేజ్ చేసినా పట్టించుకున్న వారే లేరు. తక్కువ రేటుకే రైతులు ధాన్యం అమ్ముకుంటున్నారు.

# దీపం పథకంతో ప్రతి ఇంటా కాంతుల పంట

## - 42 రోజుల్లో 80.37లక్షల సిలిండర్లు బుకింగ్ - రు.463.81కోట్లు లబ్దిదారుల ఖాతాల్లో జమ: మంత్రి నాదెండ్ల మనోహర్

**విజయవాడ, డిసెంబర్ 10, ప్రభాత'వార్త' :** రాష్ట్రంలో దీపం పథకం వల్ల ప్రతి ఇంటా కాంతుల పంట వెల్లివిరుస్తోందని రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. ప్రతి పేద ఆడబిడ్డకు ఏడాదికి 3 ఉచిత గ్యాస్‌సిలెండర్లు ఇస్తామన్న హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందన్నారు. నవంబర్ 1న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దీపం 2 పథకానికి శ్రీకారం చుట్టిన 42 రోజుల్లోనే 59.84లక్షల మంది 80.37 లక్షల సిలెండర్లు బుక్‌చేయగా, 58.30 లక్షల మందికి 62.30 లక్షల సిలెండర్లు డెలివరి చేశామన్నారు. ఇందుకు రు.463.81కోట్లను ఆయా లబ్దిదారుల ఖాతాల్లో జమ చేశామన్నారు. దీపం-2 పథకంతో ప్రతి పేదవాటి ఇంట దీపపు కాంతులు విరాజిల్లుతునా న్నయన్నారు. కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన దీపం-2 పథకం రాష్ట్రంలో వున్న ఒక కోటి 55 లక్షల మంది గ్యాస్‌కార్డుదారులకు అర్హత వుండేలా పథకాన్ని రూపొందించామన్నారు. దీపం2 పథకానికి రు.2,684 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. మొదటి విడతకు అయ్యే ఖర్చు రు.894 కోట్లు మొత్తాన్ని పెట్రోలియం సంస్థలకు అందించామన్నారు. దీపం2 పథకం కింద అర్హులైన కుటుంబాల వారు తమ మొదటి సిలెండర్ పొందడం కోసం అక్టోబర్ 29 నుండి 2025 మార్చి 31 వరకు బుక్‌చేసుకోవచ్చన్నారు. ఉచితంగా సిలండర్ కావాలనుకున్న వారు ముందుగా సొమ్మును చెల్లిస్తే పట్టణ ప్రాంతాల్లోవారికి బుక్‌చేసిన 24 గంటల్లోపు, గ్రామీణ ప్రాంతాలవారికి 48 గంటల్లో గ్యాస్ డెలివరి చేస్తారని, డెలివరీ అయిన 48 గంటల్లో ఖాతాదారుల ఖాతాల్లో జమచేస్తామన్నారు.

# సేల్‌డీడ్‌ల ఏకపక్ష రద్దు సరికాదు: హైకోర్టు

**విజయవాడ డిసెంబర్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ముందస్తుగా ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఏకపక్షంగా విక్రయ దస్తావేజు లను రద్దు చేయడం సరికాదని హైకోర్టు స్పష్టం చేసింది. సంబంధిత వ్యక్తులకు నోటీసులిచ్చి వారు వాదనలు చెప్పుకొనేందుకు అవకాశం ఇవ్వడం తప్పనిసరని తేల్చిచెప్పింది ఏకపక్షంగా సేల్‌డీడ్‌ను రద్దు చేస్తే ఆస్తి హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని పేర్కొంది. రిజిస్ట్రేషన్ నిబంధనల్లో పేర్కొనకపోయినా రూల్స్‌లో ఉన్నట్లుగా భావించి నోటీసివ్వాలని పేర్కొంది. సుప్రీంకోర్టు సైతం ఈ విషయంలో స్పష్టత ఇచ్చిందని గుర్తు చేసింది. పిటిషనర్ల సేల్‌డీడ్‌లను రద్దు చేస్తూ రెవెన్యూ అధికారులిచ్చిన ఉత్తర్వులను రద్దు చేసింది ఈ తీర్పు చట్టప్రకారం పిటిషనర్లకు నోటీసులిచ్చి తాజాగా తగిన చర్యలు చేపట్టేందుకు అధికారులకు అడ్డంకి కాదని స్పష్టం చేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.రఘునందన్‌రావు ఇటీవల ఈ తీర్పు ఇచ్చారు. విశాఖ జిల్లా సబ్బవరం మండలం గాలి భీమవరానికి చెందిన జె.బంగారం అనే వ్యక్తి ఇరువాడ అసకపల్లి గ్రామాల్లోని తనభూమిని జి.నాగేశ్వరరావు ఎన్.రమణ షేక్ ఆసిఫ్ పాసాలకు 2013లో విక్రయించారు. సబ్బవరం రిజిస్ట్రార్ కార్యాలయంలో విక్రయ ప్రక్రియ పూర్తి చేసి దస్తావేజులు జారీ చేశారు.

# అమరావతిలో చేపట్టాల్సిన పనులకు ఆమోదం

## ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**విజయవాడ డిసెంబర్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతిలో చేపట్టాల్సిన పనులకు ఆమోదం తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీఆర్డీఏ ఆమెదించిన 20 సివిల్ పనులకు ఆమోదముద్ర వేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. రాజధాని పరిధిలో చేపట్టనున్న 20 సివిల్ పనులకు రూ.11467 కోట్ల మేరవ్యయం అవుతుందని ప్రభుత్వం పేర్కొంది. ప్రపంచ బ్యాంకు ఆసియా అభివృద్ధి బ్యాంకు సంయుక్తంగా ఇవ్వనున్న రుణంతో ఈ పనులు చేపట్టేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. గెజిటెడ్ , నాన్ గెజిటెడ్ అధికారులు, ఉద్యోగుల నివాసం అపార్ట్‌మెంట్లు, ఐఏఎస్ అధికారులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నివాసాల నిర్మాణం పూర్తికి నిధుల విడుదలకు ఆమోదం తెలిపోంది. న్యాయమూర్తులు, మంత్రులు సీనియర్ ఐఏఎస్ అధికారుల బంగ్లాల నిర్మాణం కోసం నిధుల మంజూరుకు ఆమోదముద్ర వేసింది. ప్రభుత్వ కాంప్లెక్స్ నిర్మాణంలో భాగంగా సచివాలయ టవర్లు, అసెంబ్లీ రాజధాని పరిధిలో మౌలిక సదుపాయాల నిర్మాణం కోసం ఈ విధుల్ని వెచ్చించాలని నిర్ణయించింది. అమరావతిలో కొండవీటి వాగు, పాలవాగు వెడల్పు చేయటంతో పాటు శాఖమూరు, నీరుకొండ వద్ద రిజర్వాయర్ నిర్మాణం కోసం సీఆర్డీఏ రూ.1585 కోట్లు వెచ్చించనుంది. హ్యాపీనెస్ట్ ప్రాజెక్టులో భాగంగా 12 టవర్లతో 1200 అపార్ట్‌మెంట్ నిర్మాణం కోసం రూ.984 కోట్లు కేటాయించింది. రాజధాని పరిధిలో వరద నీటి కాలువలు డ్రెయిన్లు, నీటి సరఫరా నెట్‌వర్క్ సీవరేజీ , యుటిలిటీ డక్టులు, పాదచారుల బాట, సైకిల్ ట్రాక్‌ల ఏర్పాటుకు నిధులు వెచ్చించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది.

# రెరాలో ఒకే రోజు 85 పెండింగ్ దస్త్రాల పరిష్కారం



**విజయవాడ డిసెంబర్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** కొత్త గృహనిర్మాణ ప్రాజెక్టులు, లేఅవుట్ల రిజిస్ట్రేషన్ల సంబంధించి రాష్ట్ర స్థిరాస్తి వ్యాపార ప్రాధికార సంస్థ(ఏపీ రెరా) వద్ద పెండింగ్‌లో 85 దస్త్రాలను ఒక్కరోజులో పరిష్కరించినట్లు పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ తెలిపారు. ఆయన మీడియాకు తన కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో రేరా స్థిరాస్థి సమస్యలను వేగవంతంగా పరిష్కరిస్తుందన్నారు.ఈ నెల ఒక్క 9వ తేదినే కీలకమైన డాక్యుమెంట్లు పరిశీలించి పరిష్కరించామన్నారు,.ఇది మంచి పరిణామన్నారు.వెంటనే ఈ దిశలో ముందుకు వెళ్ళాలన్నారు.ఇక నుంచి వారానికి రెండు రోజులపాటు కమిటీ సమావేశమై పెండింగ్‌లో మిగతా 500 దస్త్రాలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు. కొత్త ప్రాజెక్టుల రిజిస్ట్రేషన్ల కోసం వ్యాపార సంస్థలు రెరాకు చేసే దరఖాస్తుల్లో అసంపూర్తి సమాచారం ఇస్తుండటంపై అధికారులు నోటీసులిస్తున్నారు. అడిగిన సమాచారం తిరిగి రెరాకు సమర్పించడంలో జరుగుతున్న జాప్యం కారణంగా దస్త్రాలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. వ్యాపార సంస్థల తరపున ఎక్కువ మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లు దరఖాస్తులు చేస్తున్నారు. అసంపూర్తి వివరాలపై రెరా నుంచి సర్వేయర్తకు వెళ్తున్న సమాచారం వ్యాపార సంస్థల నిర్వాహకులకు చేరడం లేదు. ఈ విషయంలో కొందరు సర్వేయర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు మంత్రి నారాయణ దృష్టికి వచ్చింది. ఇక నుంచి ప్రాజెక్టు నిర్వాహకుల ఫోన్ నంబర్లు తీసుకొని నేరుగా మాట్లాడాలని అధికారులకు సూచించారు.

# విజయసాయిరెడ్డి నోటికొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదు: పంచుమర్తి అనురాధ

**విజయవాడ డిసెంబర్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** వైకాంగ్రెస్‌పార్టీ భూబకాసురులు రాష్ట్రంలో వేల ఎకరాలు కబ్జా చేశారని శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ ఆరోపించారు. ప్రభుత్వ భూముల నుంచి దేవాదాయ , అసైన్డ్ భూముల వరకు అన్నీ కొట్టేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వానికి వచ్చిన వారిలో 68 వేల ఫిర్యాదులు భూకబ్జాలపైనే ఉన్నాయన్నారు. బెదిరింపులతో కాకినాడ పోర్టు భూములను రూ.12 కోట్లకే కొట్టేశారన్నారు. వైకాంగ్రెస్‌పార్టీ హయాంలో మంత్రులు , ఎమ్మెల్యేలు పాలన గాలికొదిలేసి భూముల కబ్జాపైనే దృష్టి పెట్టారు. చిత్తూరు జిల్లాలో పెద్దిరెడ్డి, విథున్‌రెడ్డి వెయ్యి ఎకరాలు కబ్జా చేశారు. మదనపల్లె సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డులు తగలబెట్టారు. పల్నాడులో పిన్నెల్లి బ్రదర్స్ రూ.వెయ్యి కోట్ల విలువైన భూములను కొట్టేశారు. అనంతపురం జిల్లాలో కేతిరెడ్డి బ్రదర్స్ సోలార్ భూములను కూడా వదల్లేదు. మహిళామంత్రులు రోజా, ఉష శ్రీచరణ్ కూడా భూకబ్జాలు చేశారు. చంద్రబాబుపై విజయసాయిరెడ్డి నోటికొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదు అన్నారు.

# హోంమంత్రి వంగలపూడి అనితకు హైకోర్టులో ఊరట

**విజయవాడ,డిసెంబరు10,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనితకు హైకోర్టులో ఊరట లభించింది. అనితపై 2018లో నమోదైన చెక్ బౌన్స్ కేసును హైకోర్టు కొట్టి వేస్తూ తీర్పు వెలువరించింది. తన వద్ద తీసుకున్న రూ.70 లక్షల అప్పు చెల్లించేందుకు అనిత ఇచ్చిన చెక్ చెల్లలేదని పిటిషన్ దారుడు వేగి శ్రీనివాసరావు కేసు పెట్టారు. దీనిపై విశాఖపట్నం కోర్టులో విచారణ జరగగా.. అనంతరం ఆ కేసు కాస్త ఏపీ హైకోర్టుకు చేరింది. అయితే తాజాగా హోంమంత్రి అనిత, ఫిర్యాదుదారుడు శ్రీనివాసరావు రాజీ కుదుర్చుకున్నారు. కేసు విచారణలో భాగంగా మంగళవారందృశ్య మాధ్యమం ద్వారా హోంమంత్రి, ఫిర్యాదు దారుడు ధర్మాసనం ఎదుట హాజరయ్యారు. ఈ మేరకు తాము రాజీ కుదుర్చుకున్న విషయాన్ని కోర్టుకు నివేదించారు. వివరాలు నమోదు చేసుకున్న హైకోర్టు కేసును కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది. కాగా, తనపై నమోదైన చెక్‌బౌన్స్ కేసు విషయంలో హైకోర్టును హోంమంత్రి వంగలపూడి అనిత ఆశ్రయించారు. ఇరుపక్షాల మధ్య రాజీ కుదిరిందని, ఈ మేరకు తనపై విశాఖ 7వ స్పెషల్ మేజిస్ట్రేట్ కోర్టులో నమోదైన కేసును కొట్టేయాలంటూ హైకోర్టును ఆమె కోరారు. దీనికి సంబంధించిన విచారణ ఈనెల 3న జరిగింది. అయితే ఇరుపక్షాలు ఏ విధంగా రాజీ కుదుర్చుకున్నారో చెప్పకపోవడాన్ని ఆక్షేపించింది హైకోర్టు. అలాగే పిటిషనర్ శ్రీనివాసరావుతో ధర్మాసనం నేరుగా మాట్లాడింది. ఎంత మెత్తానికి రాజీ కుదుర్చుకున్నారని ప్రశ్నించింది. అనితపై తప్పుడు కేసు పెట్టారంటూ కింది కోర్టులో వచ్చిన అభియోగాలపైనా ఆరా తీసింది తాను తప్పుడు కేసు పెట్టలేదని శ్రీనివాసరావు కోర్టుకు చెప్పారు. నగదు కోసం తిరగలేకే రాజీ చేసుకున్నట్లు ఆయన చెప్పుకొచ్చారు. హోంమంత్రి అనిత తరఫు న్యాయవాది సైతం ఇద్దరూ రాజీ కుదుర్చుకున్నట్లు హైకోర్టుకు తెలిపారు.

# పవన్ కళ్యాణ్ పేషీకి బెదిరింపు కాల్స్

## పోలీసుల అదుపులో మల్లిఖార్జునరావు

**విజయవాడ,డిసెంబరు 10,ప్రభాతవార్త ప్రతినిధి** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌ను చంపేస్తామంటూ ఓ ఆగంతకుడు ఆయన పేషీకి ఫోన్ కాల్స్ చేయడంతో పాటు సందేశాలు పంపించడం కలకం సృష్టించిన విషయం తెలిసిందే. బెదిరింపు కాల్స్,సందేశాల గురించి పేషీ లోని సిబ్బంది పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్ళారు. అనంతరం ఈ విషయాన్ని పోలీసు ఉన్నతాధికారులకు వివరించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. బెదిరింపు కాల్స్ చేసిన నూక మల్లిఖార్జునరావును అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. నిందితుడు మద్యం మత్తులో బెదిరింపు కాల్స్ ఏసినట్లు పోలీసులు గుర్తించారు. రహస్య ప్రాంతంలో ఇతనిని విచారిస్తున్నారు. పవన్ కళ్యాణ్ పేషీకి 9505505556 నెంబరు నుండి కాల్ వచ్చినట్లు గుర్తించారు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరుకు చెందిన మల్లిఖార్జునరావు పేరుతో ఉందని పోలీసులు తేల్చారు.

# మంగళహారతులతో దుర్గమ్మ ప్రచార రథానికి స్వాగతం

**ఇంద్రకీలాద్రి, డిసెంబర్ 10, ప్రభాత'వార్త' :** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం నేతృత్వంలో శ్రీ దుర్గమ్మవారి ప్రచార రథం పలు గ్రామాలకు చేరుకోగా మంగళవారం ఆయా పల్లెలకు చెందిన భక్తులు విశేష ఆదరణ కనబరిచారు. శ్రీ అమ్మవారి రథానికి మంగళ హారతులు సమర్పించారు. శ్రీ అమ్మవారి రథం సాగుతుండగా భక్తులు రథం వెంబడి నడుస్తూ పలు ప్రదర్శనలు నిర్వహించారు. అరకు, సత్తివాడ, నెల్లిమర్ల, రామతీర్థం తదితర గ్రామాల్లో అమ్మవారి ప్రచారరథం భక్తులకు సమాచారం అందిస్తూ ముందుకు సాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రామోత్సవాల్లో ఆయా గ్రామ ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి రు.1,00,116లను విరాళంగా మంగళవారం విజయవాడకు చెందిన పునుమల్లి శ్రావణి, ఓం ప్రకాష్‌లు అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శనానంతరం ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటోలు అందించారు. దుర్గమ్మవారిని మంగళవారం జాతీయ జర్నలిస్టులు దర్శించుకున్నారు. జాతీయ జర్నలిస్టు యూనియన్ అధ్యక్షుడు రాస్‌బిహారీ, ప్రధాన కార్యదర్శి మనోజ్ తివారి, ఉపాధ్యక్షులు శివకుమార్,

జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాధ్యక్షుడు ఎండి వివిఎస్ ఆర్ పున్నంరాజు, ప్రధాన కార్యదర్శి లతో పాటు 18 రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు దుర్గమ్మ దర్శనానికి వచ్చారు. వారికి దుర్గమ్మవారి దర్శనానంతరం ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటోలు అందించారు.



డిప్యూటీ ఇఓ ఎం రత్నరాజుకు బంగారుగాజులందిస్తున్న దాతలు

11-12P g7exHMNWJQE.qxd:11-12P g7exHMNWJQE.qxd 01/01/01 10:41 AM Page 1





మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

## భారత సేవాశ్రమం కార్యక్రమాలు ప్రశంసనీయం

### నిర్వాహకులను అభినందించిన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**హైదరాబాద్ (ముషీరాబాద్), డిసెంబరు 10, ప్రభాతవార్త:** భారతసేవాశ్రమం ఆధ్వర్యంలో పేదల కోసం వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. మంగళవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని భారతసేవాశ్రమంలో నిరు పేదలకు, మున్సిపల్ కార్మికులకు దుప్పట్లు, చీరలు తదితర వస్త్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ భారతసేవాశ్రమంలోని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భారతసేవాశ్రమం నగర అధ్యక్షులు స్వామి మునీశ్వరానంద, కార్యదర్శి స్వామి వెంకటేశ్వరానంద ఆధ్వర్యంలో దాదాపు వెయ్యి మందికి బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ నిరుపేదలను ఆదుకునేందుకు స్వచ్ఛంధ సంస్థలు కూడా ప్రభుత్వంతో కలసి రావాలని పిలుపునిచ్చారు. సేవా కార్య క్రమాలలో భారతసేవాశ్రమంను ఆదర్శంగా తీసుకోవాలని, వారు పాఠ శాలలో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్స్ వంటివి అందచేయటమే కాకుండా దేశంలో ఎక్కడ విపత్తు వచ్చినా ఆదుకునేందుకు ముందు ఉంటారని అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు, పేదలు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్లను అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేయడం సరికాదు

### మంత్రి దామోదర రాజనర్సింహ

**హైదరాబాద్, డిసెంబరు 10, ప్రభాతవార్త:** ఆశా వర్కర్లను అడ్డం పెట్టుకుని రాజకీయం చేయడం ప్రతిపక్ష పార్టీ నాయకుల దిగజారుడు తనానికి నిదర్శనమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అస్తిత్వాన్ని చాటేలా విజయోత్సవాలు జరుగు తుంటే తట్టుకోలేని ప్రతిపక్ష పార్టీ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఆశా వర్కర్లను రెచ్చగొట్టారని విమర్శించారు. ఈ మేరకు మంత్రి దామోదర మంగళవారం గత పదేళ్ల పాలనలో ఆశా వర్కర్ల వేతనాల పెంపుపై ఎన్నిసార్లు నిరసనలు, ధర్నాలు చేసినా పట్టించుకోని వాళ్లు ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారనీ, ఇది వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. 2015లో వేతనాలు పెంచాలని 105 రోజుల పాటు ధర్నా చసిన ఆశా వర్కర్లను గత ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. 2018, 2020, 2021, 2023 సంవత్సరాలలో ఆశా వర్కర్లు సమ్మెలు, ధర్నాలు చేశారని గుర్తు చేశారు. అప్పుడు ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించలేని వాళ్లు ఇప్పుడు ఎందుకు మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. ఆశా వర్కర్లు సంయమనంతో వ్యవహరించాలనీ, రాజకీయ ప్రేరేపిత ధర్నా, నిరసనలు తెలిపి వారి ఉచ్చులో పడొద్దని విజ్ఞప్తి చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ప్రభుత్వం ఊరుకోదని హెచ్చరించారు. ఆశా వర్కర్ల నిరసనలో సొమ్మసిల్లి పడిపోయిన ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రహీం బీకి మెరుగైన చికిత్స అందించాలని ఉస్మానియా సూపరింటెండెంట్‌ను ఈ సందర్భంగా మంత్రి దామోదర ఆదేశించారు.

## 14న దొడ్డి కొమురయ్య కురమ ఆత్మగౌరవ భవనాన్ని ప్రారంభించనున్న సిఎం

### అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష

**హైదరాబాద్, డిసెంబరు 10, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ నెల 14న దొడ్డి కొమురయ్య కురమ ఆత్మగౌరవ భవనాన్ని ప్రారంభిస్తున్నట్టు బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. భవన ప్రారంభోత్సవం సందర్భంగా అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. సమీక్షా సమావేశంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం, బిసి సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్, హెచ్‌ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్, బిసి సంక్షేమ శాఖ కమిషనర్ బాలమాయదేవి, జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి, ఐఅండ్‌పిఆర్ కమిషనర్ హరీష్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు. ప్రారంభో త్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, కురుమ సంఘం భవనానికి విద్యుత్ కనెక్షన్, వాటర్ కనెక్షన్ పూర్తి చేయాలని అధికారులు సమన్వయం చేసుకొని అన్నిఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ప్రారంభోత్సవం కోసం జనసమీకరణ చేయాలని ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశంకి, కురుమ సంఘం ప్రతి నిధులకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ఈ నెల 14న నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట్ వద్ద దొడ్డి కొమరయ్య కురమ సంఘ ఆత్మగౌరవ భవనాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యతోపాటు హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొనున్నారు. దొడ్డి కొమ రయ్య ఆత్మగౌరవ భవన ప్రారంభోత్సవానికి దాదాపు 30వేల మంది సభలో పాల్గొన నున్నారు. ఇందుకు సంబంధించి జన సమీకరణ చేయాలని కురుమ సంఘం ప్రతినిధులకు ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశంకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు సభ స్థలపరిశీలన తదితర వాటిని కలెక్టర్, పోలీస్ అధికారులు పరిశీలించాలని ఆదేశించారు.

### ఎక్సైజ్ శాఖలో అదనపు బాధ్యతలు..

## అధికారుల సతమతం

### ఒక్కో అధికారికి రెండు మూడు బాధ్యతలు

**హైదరాబాద్, డిసెంబరు 10, ప్రభాతవార్త :** తెలంగాణ ఎక్సైజ్ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకుండా ఉన్న అధికారులతోనే కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. బాధ్యతలు ఉన్న వారికే అదనపు బాధ్యతలు అప్పగిస్తుండటంతో సదరు అధికారులు సతమతమవు తున్నారు. ఒక్కో అధికారికి రెండు మూడు బాధ్యతలను అప్పగిస్తుం డటంతో మిగతా వారు ఖాళీగా ఉండే పరిస్థితి నెలకొందని ఆ శాఖలో కొందరు అంతర్గతంగా చర్చించుకుంటున్నారు. ముఖ్యంగా కొందరు సిఐలు కమిషనర్ కార్యాలయంలో రిపోర్టు చేసినా వారికి ఇప్పటి వరకు పోస్టింగ్ ఇవ్వకపోవడం విశేషం. దీంతో వారికి జీతాలు అందక అవస్థలు పడుతున్నారు. రీ ఆర్గనైజేషన్ ప్రకారం ఎక్సైజ్ శాఖలో కొత్త పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం జీఓ జారీ చేసినప్పటికీ ఇప్పటి వరకు ఆ దిశగా ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కొత్త పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేస్తే విధులు లేక ఖాళీగా ఉన్న వారికి బాధ్యతలు అప్పగించడంతో పాటు ప్రస్తుతం అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న వారికి కొంతమేర ఉపశమనం కలుగుతుందని ఆ శాఖ అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గతంలో తెలంగాణ నుంచి ఏపీకి మద్యం అక్రమంగా తరలించే వారనీ, ప్రస్తుతం ఆ రాష్ట్రంలో ఏర్పడిన కొత్త ప్రభుత్వం మద్యంను తక్కువ ధరకే విక్రయిస్తుండటంతో అక్కడి నుంచి అక్రమంగా తెలంగాణకు తీసుకుని వచ్చి అక్రమంగా విక్రయిస్తున్న సంఘటనలు వెలుగు చూశాయి.

ఏపీ నుంచి తెలంగాణకు అక్రమ మద్యం సరఫరాను అరికట్టాలంటే ఎక్సైజ్ చెక్ పోస్టులు పటిష్టంగా ఉండాలనీ, దీనికి సంబంధించి కొత్త స్టేషన్లను ఏర్పాటు చేసి సిఐలకు బాధ్యతలు అప్పటించాలని ఆ శాఖ ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఎలాంటి బాధ్యతలు అప్పగించకుండా ఖాళీగా ఉన్న సిఐలకు ఆయా ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లలో విధులు అప్పగించాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## వెంకటరెడ్డి రిమాండ్‌లో ఉన్నప్పుడు టీవీలు, ఫ్రిజ్ కొనుగోలుపై హోంమంత్రి అనిత అసహనం

**విజయవాడ డిసెంబర్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** గనుల శాఖ మాజీ డైరెక్టర్ వెంకటరెడ్డి జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న సమయంలో జైలు అధికారులు సకల సౌకర్యాలు కల్పించిన అంశంపై హోంమంత్రి అనిత వంగలపూడి తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై ఆమె విచారణకు చేపట్టి ,బాధ్యులపై తగిన చర్యలు చేపట్టాలని జైళ్ళ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఆర్థిక అరాచకాలకు పాల్పడిన నిందితుడు జైలులో ఖైదుగా ఉంటే కొత్త ఫ్రిజ్ టీవీలు ఎందుకు కొన్నారు? ఆ సమయంలో ఏం జరిగింది? నిజం చెప్పండి. ఎవరి ప్రోద్బలంతో ఇదంతా చేశారు? ఎప్పుడూ లేనిది ఆ సమయంలోనే ఎందుకు హడావుడిగా కొని, కారాగారానికి తరలించారు? అని హోం మంత్రి వంగలపూడి అనిత జిల్లా జైలు అధికారులను ఆరా తీసినట్లు కీలక సమాచారం.. అవినీతిపరులకు కొమ్ముకాసి మీ ఉద్యోగానికి ఎసరు తెచ్చుకోవద్దని ఆమె హెచ్చరించారు. విజయవాడలోని జిల్లా జైలును ఆమె ఆకస్మికంగా తనిఖీ నేపథ్యంలో ఖైదీల బ్యారకర్‌లకు వెళ్లి వారితో మాట్లాడారు. ఆహారం, వసతులు, ఆరోగ్యం గురించి వాకబు చేశారు. అనంతరం జైలు సూపరింటెండెంట్ పాల్, జైలర్లు గణేష్ వేణు, డిప్యూటీ జైలర్ నాయక్‌తో మాట్లాడారు. గనుల శాఖతో అక్రమాలకు సంబంధించి ఏసీబీ అరెస్టు చేసిన ఆ శాఖ మాజీ డైరెక్టర్ వెంకటరెడ్డి ఈ ఏడాది సెప్టెంబరు 27 నుంచి నవంబర్ 16 వరకు రిమాండ్ ఖైదీగా విజయవాడ జైల్లో ఉన్నారు. ఆ సమయంలో టీవీలు, ఫ్రిజ్‌ను కొని జైలులో పెట్టడంపై ఆరోపణలు వెల్లువెత్తాయి. కారాగారంలో ఇన్ని వసతులు కల్పించాల్సిన అవసరం ఏముందని మంత్రి జైలు అధికారులను ప్రశ్నించారు. ఇన్సులిన్, ఇతర మందులు భద్రపర్చుకునేందుకు ఒక ఫ్రిజ్ కావాలని అక్టోబరు 4నజైలు వైద్యులు రాతపూర్వకంగా అడిగారని అయితే తాను దానిపై సంతకం పెట్టలేదని పర్యవేక్షకుడు మంత్రికి వివరణ ఇచ్చినట్లు తెలిసింది. నేను ఆ నెల 7 నుంచి 15 వరకు వ్యక్తిగత పనులపై సెలవులో ఉన్నా. 7 న ఫ్రిజ్ కావాలని మళ్లీ రాసినట్లు చెప్పారు. 10న జైలుకు కొత్త ఫ్రిజ్ వచ్చింది.

దానిని డాక్టర్ గదిలో ఉంచారు. 16 న నేను రౌండ్స్‌లో ఉండగా టీవీ కావాలని వెంకటరెడ్డి అడిగారు. రెండు బ్యారక్‌లలో టీవీలు పనిచేయడం లేదు.

## గడీల తల్లి మనకొద్దు.. గరీబోళ్ల తల్లి కావాలి

### తెలంగాణ తల్లి విగ్రహంపై కవిత విమర్శలు తగదు

### ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



**హైదరాబాద్, డిసెంబరు 10, ప్రభాతవార్త:** గడిల తల్లి మనకొద్దు గరీబోళ్ల తల్లి మాకు కావాలని నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల మనోభావాలను గుర్తించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషితో విగ్రహం రూపొందించారని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. సీఎల్పీ మీడియా హాల్‌లో మంగళ వారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ 4 కోట్ల ప్రజల ఆకాం క్షలను సోమవారం నెరవేర్చిన శుభదినం అని అన్నారు. తెలంగాణను ఇచ్చిన సోనియాగాంధీ పుట్టిన రోజును ఘనంగా జరుపుకున్నాం. తెలంగాణ సిద్ధించి పదేళ్లు అయినా ఏ ఒక్కరోజు తెలంగాణ తల్లిని అధికారి కంగా ఎందుకు ప్రకటించలేదని కెటిఆర్‌ను బీర్ల ప్రశ్నించారు. కవిత మహిళల గురించి మాట్లాడు తున్నారు.. మహిళా గవర్నర్‌ను దూషించిన ఘనత మీ నాయకునిదని ఆయన గుర్తు చేశారు. ఆర్టీసి బస్ లో డాన్స్ చేయమన్న మీ అన్న కేటీఆర్ మహిళల గురించి పలుచనచేసి మాట్లాడారని ఆయన అన్నారు. కవులు, మేధావులతో చర్చించి సెక్రటేరియట్‌లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించుకున్నామని ఆయన తెలిపారు. తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణకు రావాలని కేసీఆర్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆహ్వానిస్తే రాలేదని ఆయన అన్నారు. అధికారంలోకి వచ్చాక తెలంగాణ తల్లి విగ్రహాన్ని గాంధీభవన్‌కు తరలిస్తామని కేటిఆర్ అంటు న్నందుకు సిగ్గుండాలని ఆయన అన్నారు. పేదోళ్ల తల్లి, కవుల కళాకారులకు ప్రతీక, మేధావుల ఆలోచనల మేరకే తెలంగాణ తల్లి విగ్రహం రూపొందించాం. తెలంగాణ తల్లి విగ్రహం గురించి మాట్లాడితే కెటిఆర్, హరీశ్‌రావు నాలుకను తెలంగాణ ప్రజలు కోస్తారు జాగ్రత్త అని ఆయన హెచ్చరించారు. 2007లో ఆలేరు నియోజకవర్గం బేగంపేటలో తెలంగాణ తల్లి విగ్రహ నమూనా తయారు అయింది. ఆ నమూనాతోనే ఉన్న విగ్రహాన్ని ప్రభుత్వం రూపొందిం చిందని ఆయన తెలిపారు. తెలంగాణ తల్లిని చూస్తే చాకలి ఐలమ్మ, ఉద్యమకారులు, పేదోళ్ల గుర్తొస్తారని ఆయన అన్నారు. గడిల తల్లి కాదు గరీబోళ్ల తల్లి కావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుకున్నారు. ఏనాడు తెలంగాణ తల్లి గురించి, సెంటిమెంట్ గుర్తించని మీరు బిఆర్ఎస్ నాయకులు ఇప్పుడు మాట్లాడుతున్నారు. చిల్లర మల్లర రాజకీయాలు చేస్తే ప్రజలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

## చెన్నమనేనికి హైకోర్టు తీర్పు చెంపపెట్టు

### బిఆర్ఎస్ పార్టీ వేములవాడ ప్రజలకు క్షమాపణలు చెప్పాలి: ఆది శ్రీనివాస్

**హైదరాబాద్, డిసెంబరు 10, ప్రభాతవార్త:** చెన్నమనేని రమేష్‌పైన హైకోర్టు ఇచ్చిన తీర్పు కెసి ఆర్‌కు చెంపపెట్టు వంటిదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సిఎల్‌పిలో ఆయన మీడి యాతో మాట్లాడుతూ చెన్నమనేని రమేష్ భారతపౌరుడు కాదని తెలిసినా కెసిఆర్ ఆయనకు ఉద్దేశ పూర్వకంగానే టికెట్ ఇచ్చాడని ఆరోపిం చారు. జర్మన్ పాస్‌పోర్ట్‌తో తిరు గుతున్నప్పటికీ కెసిఆర్ ఆయనకు పోటీచేసే అవకాశం ఇచ్చి చట్టసభల్లో భారత పౌరుడిని వేములవాడ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించ కుండా కుట్రల చేశారని దుయ్యబట్టారు. చెన్న మనేని రమేష్‌తోపాటు కెసిఆర్‌కు కూడా తగిన శిక్ష పడాలని ఆయన డిమాండ్ చేశారు. వేములవాడ ప్రజలకు కెసిఆర్, బిఆర్ఎస్ పార్టీ క్షమాపణ చెప్పాలని కోరారు. నిజాలు దాచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాడని కోర్టు స్పష్టంగా వ్యాఖ్యానించిందని ఆయన తెలిపారు. కేంద్ర అధికారులను మేనేజ్ చేసి కోర్టు తీర్పు ఆల స్యం చేశారని ఆయన విమర్శించారు. కోర్టు తీర్పు తర్వాత కూడా చెన్నమనేని రమేష్ అబద్ధాలు ఆడుతున్నాడని విమర్శించారు. చెన్నమనేని భారతదేశానికి వస్తే ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని ఆయన కోరారు. జర్మనీ పాస్‌పోర్ట్ మీదనే ఆయన 45సార్లు ప్రయాణం చేశారు. అయినా బుకాయిస్తున్నాడు. ఒసిఐ కార్డ్ హోల్డర్ అయిన చెన్నమనేనికి అసలు ఓటువేసే హక్కు కూడా లేదు. చెన్నమనేని రమేష్ జర్మనీ దేశాన్ని కూడా మోసం చేశారు. 15 యేళ్ల న్యాయ పోరా టంలో గెలిచానని ఆయన తెలిపారు. చెన్నమనేని రమేష్‌ను చట్టప్రకారం శిక్షించాలని ఆయన అన్నారు. చెన్నమనేని అప్పీల్‌కు వెళ్తే సైకోర్టులో కూడా న్యాయపోరాటం చేస్తానని అన్నారు.

## హుస్నాబాద్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం

### బొమ్మ వెంకన్న విగ్రహం ఏర్పాటు చేసిన చౌరస్తాకు నాకా చౌరస్తాగా పేరు పెట్టుకుందాం

### రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**హుస్నాబాద్ రూరల్, డిసెంబరు 10, ప్రభాతవార్త :** హుస్నాబాద్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం రాత్రి పట్టణంలోని నాగారం రోడ్డులో మాజీ ఎమ్మెల్యే బొమ్మ వెంకటేశ్వర్లు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఈ ప్రాంత ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే విషయంలో ఈ ప్రాంత మాజీ ఎమ్మెల్యేలు చాడ వెంకటరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, వొడితల సతీష్‌కుమార్, పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్‌ల సలహాలు తీసుకుంటామన్నారు. మాజీ ఎమ్మెల్యే బొమ్మ వెంకన్న హయాంలోనే ఈ ప్రాంత అభివృద్ధి మొదలైందని, ఆయనతో మంత్రికి ఉన్న ఆప్యాయతను గురించి వివరించారు. విద్యార్థి నాయకుడిగా ఉన్నప్పుడు ఆయన నుండి ఎన్నో విషయాలు నేర్చుకున్నామన్నారు. గతంలో ఈ ప్రాంతంలో కాంగ్రెస్ ,కమ్యూనిస్టుల మధ్య గడ్డి వేస్తే కాలిపోయో అంత విభేదాలు ఉండేవని బొమ్మ వెంకన్న ,చాడ వెంకటరెడ్డిలు ఇక్కడ సామరస్య వాతావరణం ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. రాజకీయాలు వేరు అభివృద్ధి వేరు అని గత పదేళ్ల కాలంలో ఈ ప్రాంత రైతుల ఆకాంక్ష మేరకు గౌరవెల్లి ప్రాజెక్టును కాంగ్రెస్ హయాంలోనే శంకుస్థాపన చేశామని కాని అది నిర్లక్ష్యానికి గురైందన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిసి మంత్రి అయిన తర్వాత మొదటి బడ్జెట్‌లోనే ప్రాజెక్టు పనుల పూర్తికి 431కోట్లు మంజూరు చేయించినట్లు వివరించారు. ఈ ప్రాజెక్టులోకి త్వరలోనే నీరు వస్తాయని నీటిని భయటకు పంపించేందుకు ఏర్పాటు చేసే డిస్టిబ్యూషన్ కెనాల్ నిర్మాణంలో కొంత మంది రైతులు నష్ట పోవాల్సి వస్తుందని ఆ విషయంలో కాస్త బాద అనిపించినా రైతు లందరూ సహక రించా లన్నారు. అక్క న్నపేట మండలంలోని చౌటపల్లి లో త్వరలోనే ఇండస్ట్రీ యల్ పార్క్ ఏర్పాటు చేయనున్నామని ఇందుకు భూములు ఇస్తూ సహ కరిస్తున్న రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. భూములు కోల్పోయిన రైతులకు తగిన న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. బొమ్మ వెంకన్న విగ్రహం ఏర్పాటు చేసిన నాగారం చౌరస్తాలో మరో ముగ్గురు నాయకులైన దేశినిచిన్న మల్లయ్య, లక్ష్మీకాంతరావు, బద్దం ఎల్లారెడ్డిల విగ్రహాలు సైతం ఏర్పాటు చేసి నాకా చౌరస్తాగా నామకరణం చేస్తా మన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్య క్రమానికి బొమ్మ వెంకన్న కుమారుడు, మాజీ హౌజ్‌హెడ్ చైర్మన్ బొమ్మ శ్రీరాంచక్రవర్తి అధ్యక్షత వహించారు. అంతకుముందు మంత్రి పొన్నం మినీస్టేడియంలో మున్సిపల్ ఆధ్వ ర్యంలో సిఎం కప్ 2024 ప్రారం భోత్సవంలో పాల్గొని కబడ్డీ, వాలీబాల్ పోటీలను ప్రారంభించారు.

## డంపింగ్ యార్డ్స్ రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ : మంత్రి నారాయణ

**యడ్లపాడు, డిసెంబర్ 10, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రా ష్ట్రం 2025 అక్టోబర్ 2నాటికి డంపింగ్ యార్డ్స్ రహిత రాష్ట్రంగా నిలిచేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో కృషిచేస్తున్నామన్న రాష్ట్ర పురపాలక



శాఖ మంత్రి వర్యులు పి నారాయణ మంగళవారం స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ చైర్మన్ పట్టాభిరామ్, స్థానిక శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు, గుంటూరు నగరపాలక సంస్థ కమీషనర్ పులి శ్రీనివాసులు, జిందాల్ ఏపి ప్రెసిడెంట్ ఎంవి చారి, అధికారులతో కలిసి మండల పరిధిలోని కొండవీడు రెవెన్యూ కొత్తపాలెం పంచాయితీ పరిధిలోని జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ని సందర్శించారు. ప్లాంటు పరిశీలన అనంతరం మీడియా ప్రతినిదులతో పురపాలక శాఖ మంత్రివర్యులు మాట్లాడుతూ ప్రజల మీద గత ప్రభుత్వం విధించిన చెత్త పన్ను రద్దుచేసి, చెత్తని సమర్థవంతంగా నిర్వహణ చేయడం ద్వారా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు అయ్యిందని, 2014-19మధ్యలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మంట్ పై వివిధ రాష్ట్రాలు, దేశాల్లో స్టడీ చేసి ఉత్తమ విధానాలతో ఆంధ్రప్రదేశ్‌లో పది ప్రాంతాల్లో ప్లాంట్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయం చేయడం జరిగిందని, అందులో భాగంగా గుంటూరు, విశాఖపట్నం జిల్లాల్లో ప్లాంట్ల్ ఏర్పాటుకు స్థల సేకరణ జరగడం, ప్లాంట్ల నిర్మాణ పనులు వేగంగా చేపట్టడం జరిగిందని, తదుపరి ప్రభుత్వం మారిన తర్వాత చెత్త మీద పన్నులు విధించడంలో చూపిన శ్రద్ధ చెత్త నిర్వహణపై చూపకపోవడం చెత్త నిర్వహణకు దోహదం చేసే వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ల నిర్మాణం పై దృష్టి సారించక పోవడం వలన రాష్ట్రంలో షుమారు 85లక్షల మెట్రిక్ టన్నుల చెత్త నిల్వలు ఉంచారన్నారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనతి కాలంలోనే గత ప్రభుత్వాలు పోగు చేసిన లెగసి వ్యర్థాలను క్లియర్ చేయడానికి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ప్రతి రోజు షుమారు 6890 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి జరిగితే అందులో గుంటూరు, విశాఖపట్నం జిందాల్ అధ్వర్యంలో నడుస్తున్న ప్లాంట్‌లో 2160 టన్నుల వ్యర్థకాలను ట్రీట్మెంట్ చేస్తున్నారన్నారు. ప్లాంటు వలన 50నుండి60 కిలోమీటర్ల పరిధిలోని కార్పోరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామ, నగర పంచాయితీల్లో వ్యర్థాల సమర్థ నిర్వహణకు మార్గం సుగమమైందన్నారు. త్వరలో కాకినాడ, నెల్లూరు, కడప, కర్నూల్, అనంతరపురం దగ్గర వేస్ట్ టు ఎనర్జీ



ప్లాంట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాబోయే 3ఏళ్ల కాలంలో రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో సాలిడ్ లిక్విడ్ వేస్ట్ నిర్వహణ, త్రాగునీరు, రోడ్లు ఏర్పాటుకు ప్రతి పాదనలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి వర్యులు అదేశించారన్నారు. గత ప్రభుత్వ హయాంలో అమృత్-2 ఏఐబి నిధుల వినియోగంపై నిర్లక్ష్యం వలన కేంద్ర ప్రభుత్వం నుండి అందే నిధులు సక్రమంగా అందలేదని, త్వరలో వాటిసద్వినియోగంపై దృష్టి పెడతామన్నారు.

## శ్రీ సత్య సాయి జిల్లాలో 13 న వైఎస్సార్సీ ర్యాలీ సక్సెస్‌కు గట్టి ప్రయత్నాలు

**అనంతపురం, డిసెంబర్ 10 ప్రభాతవార్త బ్యూరో** మాజీ మంత్రి, శ్రీ సత్యసాయి జిల్లా వైసీపీ అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ ఒకవైపు మండల, గ్రామ కమిటీలు వేస్తూ మరోవైపు నియోజకవర్గంలో అసమ్మతి వాదులతో పోరాటం చేస్తూ ముందుకు వెళ్తోంది. పెనుకొండ తో పాటు ఇతర నియోజకవర్గాల్లో పర్యటించి పార్టీ కార్యకర్తలను కలుసుకునేందుకు ప్రయత్నాలు ఈనెల 13వ తేదీన శ్రీ సత్య సాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో ఎమ్మెల్యే దిద్దికుంట శ్రీధర్ రెడ్డి ఇంటి వద్ద నుంచి పార్టీ కార్యకర్తలు, నాయకులతో ర్యాలీగా జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్దకు వెళ్లి కలెక్టర్ కు రైతు సమస్యలపై వినతి పత్రం ఇవ్వనున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో హిందూపురం, మడకశిర, కదిరి వైసీపీ సమన్వయకర్తలు పాల్గొనే అవకాశం ధర్మవరం, పుట్టపర్తి, రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్తలు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొనే అవకాశాలు తక్కువగా ఉన్నాయని తెలియ వచ్చింది. అయితే ఆయా నియోజకవర్గాల నుంచి మండల స్థాయి నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉంది. ఇది ఉండగా శ్రీ సత్య సాయి జిల్లాలో పార్టీ బలోపేతానికి ఉషశ్రీ చరణ్ సన్నాహాలు చేస్తోంది అని, అవకాశం దొరికినప్పుడల్లా ఫీల్డ్ కి వెళ్లి కార్యకర్తలకు భరోసా ఇస్తోంది అని అభిప్రాయము కూడా ఉంది.. ఒకానొక సమయంలో పోలీస్ స్టేషన్ కూడా వెళ్లి తమ పార్టీ కార్యకర్తలకు, నాయకులకు జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నించిన సంఘటనలు కూడా ఉన్నాయి. పెనుగొండ, హిందూపురం, మడకశిర, పుట్టపర్తి నియోజకవర్గాల్లో పార్టీ జిల్లా అధ్యక్షులు హోదాల్లో ఉషశ్రీ చరణ్ కొద్దిమేర పర్యటించి కార్యకర్తలు కలుసుకున్నట్లు సమాచారం.. ఇంట గెలిచి రచ్చ గెలవాలని సామెత తరహాలో పార్టీ సమన్వయకర్తగా ఉన్న పెనుగొండ నియోజకవర్గం లో పట్టు కోసం ఉషశ్రీ చరణ్ యత్నిస్తోంది. పెనుకొండ నియోజకవర్గంలో మాజీ మంత్రి శంకర్ నారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. పట్టు కోసం ఇద్దరు నేతల వర్గీయులు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఇటీవల శంకర్ నారాయణ వర్గానికి చెందిన ముగ్గురు నాయకులను వైసీపీ అధిష్టాన వర్గం సస్పెండ్ చేయడం చర్చనీయాంశమైంది. ఈ సంఘటన తర్వాత అక్కడ గ్రూపు రాజకీయాలు చల్లబడ్డాయి. ఇదిలా ఉండగా పార్టీ బలోపేతం కోసం మండల కమిటీలు, గ్రామ కమిటీలు వేసేందుకు ఉషశ్రీ చరణ్ ప్రయత్నాలు మొదలుపెట్టింది. నేరుగా కొన్ని మండలాలకి వెళ్లి నాయకులతో చర్చించి కమిటీలు వేస్తోంది.. శ్రీ సత్య సాయి జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో ఉషశ్రీ చరణ్ తిరిగి పార్టీ నాయకులతో కలిసి పనిచేయాలని ఆలోచనలో ఉంది. శ్రీ సత్యసాయి జిల్లాలో పుట్టపర్తి, కదిరి, హిందూపురం, ధర్మవరం, మడకశిర, పెనుకొండ, రాప్తాడు నియోజక వర్గాలు ఉన్నాయి.. ఆయా నియోజకవర్గాల సమన్వయకర్తలు , పార్టీ జిల్లా అధ్యక్షురాలు కలిసి ఏ మేరకు కార్యక్రమాలు నిర్వహిస్తారన్నది వేచి చూడాలి.. ఇప్పటికీ ఎమ్మెల్యేలుగా ఫీలయ్యే వాళ్ళు కొందరు నియోజకవర్గంలో ఉన్నారు.

ఎన్నికల్లో ఓడిన కొందరికి బలుపు తగ్గలేదని , అందుకే నియోజకవర్గాల్లో పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారని విమర్శలు ఉన్నాయి. డిసెంబరు, జనవరి నెలలో మూడు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించేందుకు వైసీపీ అధిష్టాన వర్గం ప్రణాళిక రూపొందించింది.

## హస్తం గుర్తుతో ఉన్న తెలంగాణ తల్లి మాకొద్దు

### తెలంగాణ భవన్‌లో పంచామృత అభిషేకం చేసిన కవిత



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 10:** వేలాది ఉద్యమకారులు నాడు తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెట్టుకున్నారని ఎంఎల్‌సి కవిత తెలిపారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎందుకు అంగీకరించడం లేదని ప్రశ్నిం చారు. తెలంగాణ భవన్‌లో తెలంగాణ తల్లికి పాలా భిషేకం, పంచామృత అభి షేకం చేశారు. అనంతరం నిరసన దీక్షలో కవిత, బిఆర్ఎస్ నేతలు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడారు. తెలంగాణ తల్లి విగ్రహ మార్పుపై బిఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. బతుకమ్మ పండుగను విగ్రహంలో ఎందుకు చేర్చలేదని అడిగారు. తొమ్మిది మంది కళాకారులను సన్మనిస్తామన్నారని, కళాకారుల జాబితాలో మహిళలు ఎక్కడ? అని నిలదీశారు. కళాకారులు విమలక్క, మల్లు స్వారాజ్యం, సంధ్యలాంటి వారు కనిపించడంలేదా? అని విమర్శలు గుప్పించారు. తెలంగాణ పేద ప్రజలు ఎప్పటికీ అలాగే ఉండాలా? అని ధ్వజమెత్తారు. మహిళలకు ఇస్తామన్న రూ.2500 హామీ ఏమైందని, స్ఫూర్తి నింపే తెలంగాణ తల్లి విగ్రహం కాదని కాంగ్రెస్ తల్లిని పెట్టుకున్నారని, ఉద్యమ కాలం నాటి ప్రతీకలను అవమానించే యత్నమని, సచివాలయంలో పెట్టిన కాంగ్రెస్ తల్లిని తిరస్కరిస్తున్నామన్నారు. ఉద్యమకారులకు సాయం చేయాలే కానీ అవమానించవద్దని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని మాత్రమే పెట్టుకోవాలని ప్రభుత్వం గెజిట్ ఇచ్చింది. ప్రజల అభిప్రాయాలను గౌరవించాలి. ఉద్యమకాలం నాటి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రజలు కోరుకున్నారని, ప్రభుత్వ ప్రజలను భయపెట్టడం సరికాదని పేర్కొన్నారు. ఈ కార్యమంలో ఎంఎల్‌సి కవిత, బిఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.



ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తుదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న డా.చిన్నారెడ్డి, దివ్య.

## ప్రజావాణికి అందిన దరఖాస్తులు 424

**హైదరాబాద్ (బేగంపేట) డిసెంబరు 10, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 424 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్, గ్రామీణా భివృద్ధి శాఖకు సంబంధించి 108 దరఖాస్తులు, మైనార్టీ సంక్షేమశాఖకు సంబంధించి 100, రెవెన్యూ సమస్యలకు సంబంధించి 65, విద్యుత్‌శాఖకు సంబంధించి 57, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ సంబంధించి 13, ప్రవాసీ ప్రజావాణికి సంబంధించి 5, ఇతర శాఖలకు సంబంధించి 76 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా.చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య ఈ కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్‌కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.



### టిపిఎల్ ఛాంపియన్‌గా
# హైదరాబాద్

**ఢిల్లీ:** టెన్నిస్ ప్రీమియర్ లీగ్ (టీపీఎల్)-2024 టోర్నీలో హైదరాబాద్ స్ట్రయికర్స్ జట్టు చాంపియన్‌గా నిలిచింది. యశ్ ముంబై ఈగల్స్ జట్టుతో జరిగిన ఫైనల్స్‌లో హైదరాబాద్ స్ట్రయికర్స్ 51-44 పాయింట్లతో గెలిచి మూడోసారి టెన్నిస్ ప్రీమియర్ లీగ్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. హరీట్ డార్ట్, బెంజమిన్ లాక్, ఒలింపియన్ విష్ణువర్ధన్లతో కూడిన హైదరాబాద్ స్ట్రయికర్స్ జట్టుకు గ్రాస్‌కోర్టు జాతీయ మాజీ చాంపియన్ సురేశ్ కృష్ణ కోచ్‌గా వ్యవహరించాడు. తొలి మ్యాచ్‌లో జరిగిన మహిళల సింగిల్స్‌లో హరీట్ డార్ట్ 14-11తో జెనెప్ సోన్‌మెజ్‌పై గెలిచి హైదరాబాదుకు శుభా రంభం అందించింది. రెండో మ్యాచ్‌గా జరిగిన పురుషుల సింగిల్స్‌లో ముంబైకు చెందిన కరణ్ సింగ్ 14-11తో బెంజమిన్ లాక్‌పై గెలిచాడు. అలాగే మూడో మ్యాచ్‌గా జరిగిన మిక్స్డ్ డబుల్స్‌లో విష్ణువర్ధన్-హరీట్ డార్ట్ ద్వయం 16-9తో జెనెప్ సోన్మెజ్-జీవన్ నెడుంజెళియన్ జోడీని ఓడించింది. ముంబైకు చెందిన జీవన్ నెడుంజెళియన్-కరణ్, హైదరాబాద్‌కు చెందిన విష్ణువర్ధన్-బెంజమిన్ లాక్‌జోడీల మధ్య నాలుగో మ్యాచ్ జరిగిన పురుషుల డబుల్స్ పోరు 10-10తో టైగా ముగియడంతో హైదరాబాద్ స్ట్రయికర్స్ జట్టుకు టైటిల్ ఖరారైంది.



### మహిళల ఆసియా కప్ హాకీ టోర్నీలో..
# భారత్ రెండో గెలుపు
### మలేసియా 5 గోల్స్ తేడాతో ఓటమి

**ఢిల్లీ:** జూనియర్ మహిళల ఆసియా కప్ హాకీ టోర్నమెంట్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టు వరుసగా రెండో విజయం నమోదు చేసింది. మస్కట్‌లో మలేసియా జట్టుతో జరిగిన గ్రూప్ ఎ రెండో లీగ్ మ్యాచ్‌లో జ్యోతి సింగ్ నేతృత్వంలోని భారత జట్టు 5-0 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. భారత్ తరఫున ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ దీపిక మూడు గోల్స్‌తో హ్యాట్రిక్ నమోదు చేసింది. ఆమె 37వ నిముషం, 39వ నిముషం, 48వ నిముషాల్లో గోల్స్ చేసింది. వైష్ణవి ఫాల్కే 32వ నిమిషంలో, కనిక సివాచ్ 38వ నిమిషంలో ఒక్కో గోల్ అందించారు. మ్యాచ్ మొత్తంలో భారత జట్టుకు ఎనిమిది పెనాల్టీ కార్నర్లు, రెండు పెనాల్టీ స్ట్రోక్‌లు లభించాయి. ఇందులో మూడు పెనాల్టీ కార్నర్లను, ఒక పెనాల్టీ స్ట్రోక్‌ను భారత జట్టు గోల్స్‌గా మలిచింది. మిగతా ఐదు పెనాల్టీ కార్నర్లను, మరో పెనాల్టీ స్ట్రోక్‌ను భారత్ లక్ష్యానికి చేర్చి ఉంటే విజయం తేడా మరింత భారీగా ఉండేది. కాగా మరో మ్యాచ్‌లో దక్షిణ కొరియా 7-2 గోల్స్ తేడాతో చైనీస్ తైపీ జట్టును ఓడించింది. ఐదు జట్లున్న గ్రూప్ ఎలో రెండేసి విజయాలు సాధించిన భారత్, చైనా జట్ల ఖాతాలో ఆరు పాయింట్ల చొప్పున ఉన్నాయి. అయితే చైనా చేసిన గోల్స్ 27 కంటే భారత్ చేసిన గోల్స్ 17 తక్కువగా ఉండటంతో చైనా టాప్ ర్యాంక్‌లోను, భారత్ రెండో ర్యాంక్‌లోను ఉన్నాయి. బుధవారం జరిగే మూడో లీగ్ మ్యాచ్‌లో చైనాతో భారత్ తలపడుతుంది.

# తెలుగు టైటాన్స్‌కు ఘోర అవమానం
### 21 పాయింట్ల తేడాతో హరియానా ఘన విజయం

**ఢిల్లీ:** ప్రొకబడ్డీ లీగ్ (పీకేఎల్)లో తెలుగు టైటాన్స్ జోరుకు హరియాణా స్టీలర్స్ చెక్ పెట్టింది. పుణెలో జరిగిన ఈ ప్రొకబడ్డీ లీగ్ మ్యాచ్‌లో హరియాణా ఏకంగా 21 పాయింట్ల తేడాతో టైటాన్స్‌ను ఓడించింది. స్టీలర్స్ 46-25 స్కోరుతో తెలుగు టైటాన్స్ జట్టును చిత్తు చేసింది. రెయిడర్ వినయ్ (7) ఆరంభం నుంచే క్రమం తప్పకుండా పాయింట్లు తెచిప్పెట్టడంతో హరియాణా ఆధిక్యంలోకి వెళ్లింది. తర్వాత మరో రెయిడర్ శివమ్ పతారే (12) కూతలో పాయింట్ల వేగం పెంచడంతో స్కోరు అమాంతం పెరిగిపోయింది. మిగతా వారిలో ఆల్‌రౌండర్ మొహమ్మద్ రెజా (5), డిఫెండర్లు రాహుల్ (4),సంజయ్ (3) రాణించడంతో స్టీలర్స్ ఎదురులేని విజయం సాధించింది. టైటాన్స్ తరఫున స్టార్ రెయిడర్ ఆశిష్ నర్వాల్ (13) అదరగొట్టాడు. 14 సార్లు కూతకెళ్లిన ఆశిష్ రెయిడింగ్లో 11 పాయింట్లు చేశాడు. ప్రత్యర్థి రెయిడర్లు నిలువరించి రెండు టాకిల్ పాయింట్లు సాధించాడు. కెప్టెన్ విజయ్ మాలిక్ 5, డిఫెండర్ అంకిత్ 2 పాయింట్లు చేశారు. కాగా మొత్తం 12 జట్లు పోటీపడుతున్న ప్రొ కబడ్డీ లీగ్‌లో ఇప్పటి వరకు 18 మ్యాచ్‌లు ఆడి హరియాణా 14 మ్యాచ్‌ల్లో గెలిచింది. కేవలం 4 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. దీంతో 72 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతోంది. కాగా తెలుగు టైటాన్స్ జట్టు 18 మ్యాచ్‌లు ఆడగా, వాటిలో 10 విజయాలు, 8 పరాజయాలతో 54 పాయింట్లు సాధించి ఆరో స్థానంలో నిలిచింది. అనంతరం జరిగిన రెండో మ్యాచ్‌లో దబంగ్ ఢిల్లీ 30-26 స్కోరుతో పుణేరి పల్టన్‌పై గెలుపొందింది. దబంగ్ జట్టును



కెప్టెన్ అశు మలిక్ (13) ముందుండి నడిపించాడు. 19 సార్లు రెయిడింగ్‌కు వెళ్లి 13 పాయింట్లు తెచ్చి పెట్టాడు. కాగా జట్టులోని నవీన్ కుమార్ (4), యోగేశ్ (3), ఆశిష్ (2) స్కోరు చేశారు. పుణేరి జట్టులో అత్యధికంగా రెయిడర్ మోహిత్ గోయత్ 7 పాయింట్లు చేశాడు. మిగతా వారిలో పంకజ్ మోహితె(5), ఆకాశ్ షిండే (4), అమన్ (3) రాణించారు. దబంగ్ ఢిల్లీ 17 మ్యాచ్‌లు ఆడి 8 విజయాలు, 5 పరాజయాలు, 4 టైలతో కలిపి మొత్తం 56 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉంది. పుణేరి పల్టన్ 18 మ్యాచ్‌లు పూర్తి చేసుకుని, అందులో 7 మ్యాచ్‌ల్లో నెగ్గి, 8 మ్యాచ్‌ల్లో ఓడింది. మరో 3 మ్యాచ్‌లను టైగా ముగించి 49 పాయింట్లతో ఏడో ర్యాంక్‌లో ఉంది.



# అత్యంత దీన స్థితిలో టీమిండియా
### భారత్ బ్యాట్స్‌మన్ల ఫెయిల్యూర్
### దెబ్బతిన్న జట్టు ప్రదర్శన
### ఏడు టెస్టుల్లో 50 ఓవర్ల లోపే ఆలౌట్

**ఢిల్లీ:** ఈ ఏడాది టీమిండియా అత్యంత దయనీయ పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతోంది. 2024లో భారత జట్టు ఏకంగా 7 టెస్టు మ్యాచ్‌ల్లో 50 ఓవర్లు కూడా నిలబడలేక కుప్పకూలి ఘోర వైఫల్యాలను మూటగట్టుకుంది. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ 2024-25లో భారత బ్యాట్స్‌మెన్‌ల ప్రదర్శన ప్రత్యేకంగా ఏమీ లేకుండా పోయింది. అడిలైడ్ టెస్టులో కూడా టీమిండియా ఓటమికి అతి పెద్ద కారణం పేలవ బ్యాటింగ్. ఈ ఏడాది టెస్టుల్లో భారత బ్యాట్స్‌మెన్‌లు ఎక్కువ సమయం క్రీజులో ఉండలేకపోతున్నారు. దీని కారణంగా జట్టు ప్రదర్శన కూడా దెబ్బతింది. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ రెండో మ్యాచ్ టీమిండియాకు ఘోరంగా మారింది. ఈ మ్యాచ్‌లో టీమిండియా 10 వికెట్ల తేడాతో ఓటమి చవిచూడాల్సి వచ్చింది. రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ టీమిండియా బ్యాటింగ్ ఓటమికి ప్రధాన కారణం. అడిలైడ్ టెస్టులో భారత్ జట్టు రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ 200 పరుగుల మార్కును అందుకోలేకపోయింది. ఏ బ్యాట్స్‌మెన్ కూడా ఎక్కువ సమయం క్రీజులో గడపలేకపోవడం ఆశ్చర్యకరమైన విషయమైంది. మొత్తంగా పరుగులు చేయడంలో, ఆస్ట్రేలియా బౌలర్లను ఎదుర్కోవడంలో కూడా భారత బ్యాట్స్‌మెన్స్ విఫలమయ్యారు.

అడిలైడ్ టెస్టులో టీమిండియా బ్యాటింగ్ ఎంత దారుణంగా ఉందో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ కలిపి మొత్తం టీమ్ 100 ఓవర్లు కూడా ఆడలేకపోయిందనే వాస్తవాన్ని బట్టి అంచనా వేయవచ్చు. ఈ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా కేవలం 44.1 ఓవర్లలోనే కుప్పకూలింది. అదే సమయంలో రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 36.5 ఓవర్లకే పరిమితమైంది. అయితే ఇది తొలిసారి కాదు. ఈ ఏడాది టెస్టుల్లో 7 సార్లు భారత జట్టు 50 ఓవర్లలోపే ఆలౌట్ కావడం విశేషం. దీంతో టెస్టుల్లో అత్యంత అవసరమైన సహనాన్ని, ఓపికను భారత బ్యాట్స్‌మెన్‌లు టెస్టుల్లో ప్రదర్శించలేకపోతున్నారని స్పష్టమవుతోంది. విదేశాల్లోనే కాకుండా స్వదేశంలో కూడా భారత జట్టు 50 ఓవర్లలోపే చాలాసార్లు ఆలౌట్ అయింది. ఈ ఏడాది ప్రారంభంలో దక్షిణాఫ్రికాతో జరిగిన కేప్ టౌన్ టెస్టులో కేవలం 34.5 ఓవర్లు మాత్రమే ఆడగలిగింది. ఆ తర్వాత, ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన స్వదేశంలో జరిగిన సిరీస్‌లో టీమిండియాకు ఇలాంటి పరిస్థితి ఎదురైంది. పూణె టెస్టులో 45.3 ఓవర్లు ఆడి ఆలౌట్ అయింది. ఇది కాకుండా ముంబై టెస్టులో కేవలం 29.1 ఓవర్లకే పరిమితం కాగా, బెంగళూరు టెస్టులో ఒక ఇన్నింగ్స్‌లో భారత బ్యాట్స్‌మెన్ 31.2 ఓవర్లు మాత్రమే ఆడగలిగింది. ఇక బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీ 2024-25లో టీమిండియా ఇప్పటివరకు కేవలం 2 మ్యాచ్‌లు మాత్రమే ఆడింది. అయితే, ఈ కాలంలో భారత జట్టు 3 ఇన్నింగ్స్‌ల్లో 50 ఓవర్లలోపే ఆలౌట్ అయింది. అడిలైడ్ టెస్టుకు ముందు పెర్త్‌లో కూడా టీమిండియాకు ఇదే పరిస్థితి కనిపించింది. పెర్త్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో కూడా టీమిండియా 49.4 ఓవర్లకే పరిమితమైంది. అయినప్పటికీ భారత జట్టు రెండవ ఇన్నింగ్స్‌లో పునరాగమనం చేసింది. దీంతో ఈ మ్యాచ్‌ను గెలుచుకుంది. అసలు టెస్టుల్లో ఎందుకు భారత్ జట్టు వైఫల్యం చెందుతుందనేదానిపై భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు వర్గాల్లో ప్రస్తుతం చర్చనీయాంశమైంది.





# వన్డేలో వెస్టిండీస్ విక్టరీ
### చిత్తుగా ఓడిన బంగ్లాదేశ్

**ఢిల్లీ:** వెస్టిండీస్ 6 సంవత్సరాల నిరీక్షణకు తెరదించి బంగ్లాదేశ్‌పై తొలి విజయాన్ని సాధించి కమ్ బ్యాక్ ఇచ్చింది. రూథర్‌ఫోర్డ్ 113 పరుగులతో అద్భుత ఇన్నింగ్స్ ఆడగా, కెప్టెన్ షై హోప్ 86 పరుగులతో జట్టును నడిపించాడు. బంగ్లాదేశ్ కెప్టెన్ మెహిదీ హసన్ 74 పరుగులు చేసినప్పటికీ, జట్టు 11 వరుస ఓటముల పరంపరను నిలిపే క్రమంలో వెస్టిండీస్ విజయం సాధించింది. టాస్ గెలిచిన బంగ్లాదేశ్ కెప్టెన్ మెహిదీ హసన్ మిరాజ్ బ్యాటింగ్ ఎంచుకున్నప్పటికీ జట్టు శుభారంభం పొందలేకపోయింది. సౌమ్య సర్కార్ 19 పరుగుల వద్ద అల్జారీ జోసెఫ్ బౌలింగ్‌లో ఔట్ అయ్యాడు. లిటన్ దాస్ రొమారియో షెపర్డ్ బౌలింగ్‌లో కేవలం 2 పరుగులకే ఔటయ్యాడు. ఓపెనర్ తాంజిద్ హసన్ 46 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేశాడు, కానీ సెంచరీకి చేరుకోలేక 60 పరుగుల వద్ద జోసెఫ్ బౌలింగ్‌లో వికెట్ కోల్పోయాడు. అనంతరం మెహిదీ 101 బంతుల్లో 74 పరుగులు చేయగా, చివరి ఓవర్లలో మహ్మదుల్లా అజేయంగా 50 పరుగులు చేసి జట్టుకు మంచి స్కోరు అందించాడు. జాకర్ అలీ కూడా 40 బంతుల్లో 48 పరుగులు చేసి సపోర్ట్ ఇచ్చాడు. జట్టుకు నిర్దేశించిన లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో వెస్టిండీస్ ఆరంభంలోనే బ్రెండన్ కింగ్ (9), ఎవిన్ లూయిస్ (16) వికెట్లను కోల్పోయింది. అయితే కెప్టెన్ షై హోప్ (86) తన పట్టును నిలబెట్టుకుని రూథర్‌ఫోర్డ్‌తో కలిసి భాగస్వామ్యాన్ని చక్కగా కొనసాగించాడు. రూథర్‌ఫోర్డ్ తన అద్భుతమైన ప్రదర్శనతో 80 బంతుల్లో 113 పరుగులు చేశాడు. ఈ ఇన్నింగ్స్‌లో అతను 7 ఫోర్లు, 8 సిక్సర్లు బాదాడు. హోప్, జస్టిన్ గ్రీవ్స్ (41 నాటౌట్) మధ్య జరిగిన భాగస్వామ్యం వెస్టిండీస్‌ను విజయతీరాలకు చేర్చింది. షై హోప్ తన ఆత్మవిశ్వాసంతో జట్టును ముందుకు నడిపాడు, అలాగే గ్రీవ్స్ అవసరమైన వేగాన్ని జోడించాడు.

# వాణిజ్యం

# పర్సనల్ లోన్ రీ-ఫైనాన్స్‌తో ప్రయోజనాలు!

**ముంబై, డిసెంబరు 10:** పర్సనల్ లోన్ రీఫైనాన్సింగ్ అంటే ఇప్పటికే ఉన్న లోన్ స్థానంలో కొత్త లోన్ ఇవ్వడం. కొత్త రుణం సాధారణంగా కొత్త నిబంధనలు, షరతులతో వేరే బ్యాంకు లేదా సంస్థ నుండి తీసుకోబడుతుంది. కొత్త రుణం నుండి పాత రుణం చెల్లించబడుతుంది. మీరు కొత్త నిబంధనలతో రీఫైనాన్స్ చేసిన రుణాన్ని చెల్లించడం ప్రారంభిస్తారు. సాధారణంగా రుణగ్రహీతలు మెరుగైన వడ్డీ రేటును పొందడానికి, తిరిగి చెల్లించే వ్యవధిలో మార్పు లేదా ఆర్థిక భారాన్ని మెరుగైన మార్గంలో నిర్వహించడానికి ఈ ఎంపికను ఎంచుకుంటారు. రీఫైనాన్సింగ్ ఎలా పని చేస్తుంది? రీఫైనాన్సింగ్ అనేది మీ ఫైనాన్స్‌ను ఆప్టిమైజ్ చేయడానికి కఠినమైన పరిశీలన ఉంటుంది. పరిస్థితులు, ఖర్చులు మొదలైన వాటిపై ప్రత్యేక శ్రద్ధ అవసరం. మీప్రస్తుత రుణాన్ని అంచనా వేయండి. రీఫైనాన్సింగ్ ఆప్షన్లను సెర్చ్‌చేయండి. అలాగే నిర్ణయం తీసుకునే ముందు పొదుపులను లెక్కించండి. సరైన వ్యూహంతో రీ ఫైనాన్సింగ్ మీకు ఆర్థిక సౌకర్యాన్ని సాధించడంలో సహాయపడుతుంది. ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు మీ ఆర్థిక సలహాదారులను సంప్రదించడం మర్చిపోవద్దు. రీఫైనాన్సింగ్ ఆప్షన్ బ్యాంకుల వడ్డీ రేట్లను సరిపోల్చండి. రేట్లు లేదా ప్రాసెసింగ్ ఫీజులను తగ్గించే ప్రమోషనల్ ఆఫర్ల కోసం చూడండి. కొత్త రుణ దాతను ఎంచుకున్న తర్వాత, రీఫైనాన్సింగ్ కోసం మీ దరఖాస్తును సమర్పించండి. ఇందులో సాధారణంగా మీరు మీ ప్రస్తుత లోన్ వివరాలు, ఆదాయ పత్రాలు, క్రెడిట్ చరిత్ర, గుర్తింపు మొదలైన వాటి గురించి సమాచారాన్ని అందించాలి. దరఖాస్తు ఆమోదించబడినట్లయితే, కొత్త రుణదాత మీ ప్రస్తుత రుణాన్ని నేరుగా చెల్లిస్తారు లేదా పాత రుణాన్ని సెటిల్ చేయడానికి నిధులను అందిస్తారు. దీని తర్వాత ప్రస్తుత నిబంధనల ప్రకారం కొత్త రుణాన్ని చెల్లించడం ప్రారంభించండి. మీ పాత రుణ ఖాతా క్లోజ్ చేసినట్లు నిర్ధారించుకోండి. మీ మునుపటి బ్యాంకు రుణం పూర్తిగా చెల్లించినట్లయితే ఎన్‌ఓసీ సర్టిఫికేట్ తీసుకోవడం మర్చిపోవద్దు. అన్ని బకాయిలు చెల్లించినట్లు ఈ రుణ దాతలు కొత్త లోన్‌లపై ప్రాసెసింగ్ రుసుములను వసూలు చేయవచ్చు. మీప్రస్తుత లోన్ ప్రీపేమెంట్ పెనాల్టీకి సదుపాయాన్ని కలిగి ఉండవచ్చు. రీఫైనాన్సింగ్ నుండిపొదుపు ఈ ఖర్చులను అధిగమించలేదని నిర్ధారించుకోండి. రీఫైనాన్సింగ్ కోసం దరఖాస్తు చేసిన తర్వాత మీక్రెడిట్ నివేదికను చాలా పరిశీలిస్తుంది బ్యాంకు. ఈ అవసరాలను తీర్చడానికి మీక్రెడిట్ స్కోర్ తగినంత ఎక్కువగా ఉందని ముందుగానే నిర్ధారించుకోండి. ఎందుకంటే క్రెడిట్ స్కోర్ తక్కువఉండి ముందస్తుగా దరఖాస్తు చేసుకుంటే రిజెక్ట్ అయిన తర్వాత మీ క్రెడిట్ స్కోర్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది.




# 32 యేళ్లుగా చలామణిలో అతిపెద్ద నోటు

**న్యూఢిల్లీ, డిసెంబరు 10:** ప్రస్తుతం భారతదేశంలో రూ.500 నోటు అతిపెద్ద నోటు. అయితే దేశంలో రూ.10,000 నోటు చెలామణిలో ఉన్న సమయంఉండి. అది కూడా స్వాతంత్ర్యానికి ముందు. 1938 సంవత్సరంలో రూ.10,000 నోటును విడుదల చేశారు. ఈ నోటు భారతదేశ చరిత్రలోనే అతిపెద్ద నోటు. నోటు ఎందుకు తెచ్చారు? స్వాతంత్ర్యానికి ముందే ఇంత పెద్ద నోటును చలామణిలోకి తీసుకురావడం గొప్ప విషయమనే చెప్పాలి. ఇంత పెద్ద నోట్లు చలామణిలోకి రావడానికి కారణం ఏంటో తెలుసా? ఈనోటు ప్రధానంగా వ్యాపారులు, వ్యాపారవేత్తల కోసం అధిక విలువైన లావాదేవీల కోసం ప్రవేశపెట్టినట్లు తెలుస్తోంది. 1957లో దేశంలో 25పైసలు, 50పైసలు ప్రవేశపెట్టారు. అయితే బ్రిటిష్ ప్రభుత్వం 1954లో ఈనోటు చలామణిని నిలిపివేసింది. హోర్డింగ్‌ను ఎదుర్కోవడం, బ్లాక్‌మార్కెట్ కార్యకలాపాలను అరికట్టడమే దీనిని మూసివేయడం ఉద్దేశ్యమని ప్రభుత్వం పేర్కొంది. నిజానికి, రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభమైన తర్వాత, దేశవ్యాప్తంగా హోర్డింగ్ సంఘటనలు పెరుగుతున్నాయి. అయితే, 1946 జనవరిలో, ప్రవేశపెట్టిన ఎనిమిది సంవత్సరాల తర్వాత, బ్రిటిష్ ప్రభుత్వం రూ.10,000 నోటును ఉపసంహరించుకోవాలని నిర్ణయించింది. రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో పెరిగిన హోర్డింగ్, బ్లాక్ మార్కెటింగ్ కార్యకలాపాలపై ఆందోళనల మధ్య ఈ చర్య తీసుకుంది. అధిక విలువ కలిగిన నోట్ల రద్దు ఈ సమస్యలను అరికట్టేందుకు దోహదపడుతుందని ప్రభుత్వం భావించింది. దీనితో పాటు రూ.5000 నోటు కూడా చెలామణిలోకి తీసుకువచ్చారు. అయితే ఇది 1978లో మరోసారి నిలిపివేశారు. ఈసారి కూడా బ్లాక్‌మార్కెటింగ్‌ను అరికట్టాలన్నదే ప్రభుత్వం ఉద్దేశం. అందుకే ఆ నోట్లను రద్దు చేసింది ప్రభుత్వం. పెద్ద నోట్లు కావడంతో సాధారణ ప్రజలు వీటిని వినియోగించలేరు. ప్రధానంగా వ్యాపారులు వీటిని వినియోగించారు. భారతీయ రిజర్వ్ బ్యాంక్ డేటా ప్రకారం, ఆ సమయంలో ఈ నోట్ల మొత్తం విలువ సుమారు రూ.7,144 కోట్లు.దేశంలో ఈ నోట్లను మళ్లీ చలామణి చేసే అంశాన్ని పరిశీలించారు. రఘురామ్ రాజన్ కమిటీ వారిని వెనక్కి తీసుకురావడాన్ని పరిశీలించాలని సూచించింది. అయితే భారత ప్రభుత్వం ఈ సూచనను అంగీకరించలేదు.




# సిఎన్‌జి కార్లకు యమా డిమాండ్!

**న్యూఢిల్లీ, డిసెంబరు 10:** ఇప్పటికే ఇవికార్లు ప్రజాదరణ పొందినా సీఎన్‌జీ కార్ల అమ్మకాలు కూడా బాగా పెరిగాయి. సీఎన్‌జీ అనేది ఐసీఈశక్తితో నడిచే వాహనాలలో మరింత పర్యావరణ అనుకూలమైన ఎంపిక. అయితే సీఎన్‌జీ కార్లు పెట్రోల్ కార్లల్లా సులభంగా అందుబాటులో లేవు. భారతీయ ప్యాసింజర్ వాహనాల మార్కెట్‌లో కొన్ని ఎంపికలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో సీఎన్‌జీ పెట్రోల్, డీజిల్ కార్ల మధ్య ప్రధాన తేడాలను తెలుసుకుందాం. ఉద్గారాలు, మైలేజ్, ఇంజిన్ జీవితకాలం తక్కువ ఉద్గారాల విడుదలతో పాటు మెరుగైన మైలేజీ సీఎన్‌జీ వాహనాలను యూజర్లకు మరింత చేరువ చేస్తున్నాయి. ఇది మార్కెట్లో అత్యంత పరిశుభ్రమైన శిలాజ ఇంధనం, పెట్రోల్ లేదా డీజిల్ వంటి ఇతర పునరుత్పాదక ఇంధన వనరుల కంటే చౌకగా వస్తుంది. సగటున పెట్రోల్ కార్ల కంటే సమాన మైన ఇంధనంతో సీఎన్‌జీతో నడిచే కార్లు 25 శాతం ఎక్కువ దూరం ప్రయాణించగలవు. క్లీనర్ బర్నింగ్ ఇంధనం కారణంగా పెట్రోల్ కార్లతో పోల్చినప్పుడు సీఎన్‌జీ కార్లు ఎక్కువ ఇంజిన్ జీవితకాలాన్ని అందిస్తాయి. దీని వల్ల ఇంజన్ తక్కువ అరిగిపోతుంది. నిర్వహణ పెట్రోలు ఇంజిన్లు సాధారణంగా సీఎన్‌జీ ఇంజిన్ల కంటే తక్కువ ఖర్చుతో ఉంటాయి. సీఎన్‌జీ ఇంజన్లు ఉన్న కార్లను రిపేర్ చేయడానికి ప్రత్యేక పరికరాలు అవసరం. సీఎన్‌జీ ట్యాంకులు అదనంగా తనిఖీ చేయాలి. అందువల్ల సీఎన్‌జీ కార్లకు నిర్వహణ సమస్యలు ఎక్కువ. పెట్రోల్ కార్ల నిర్వహణకు మెకానిక్‌లు ప్రతిచోటా అందుబాటులో ఉంటారు. అయితే సీఎన్‌జీ మెకానిక్‌లు అంతలా ఉండదు. అందువల్ల నిర్వహణ అనేది భారం అవుతుంది.




# ఫ్రెషర్లకు ఆఫర్ లెటర్ల వెల్లువ


**న్యూఢిల్లీ, డిసెంబరు 10:** దేశంలోని పలు టెక్ కంపెనీలు యువ నిపుణుల (ఫ్రెషర్లు) నియామకానికి ఆసక్తి కనబరుస్తున్నాయి. పెరుగుతున్న సాంకేతిక అవసరాల నేపథ్యంలో ఈట్రెండ్ ఊపందుకుంది. దాదాపు 74 శాతం కంపెనీలు ఇదే విధానం అనుసరిస్తున్నాయి. దీనివల్ల చదువుకున్న పూర్తయిన వెంటనే యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి. తద్వారా జీవితంలో స్థిర పడటానికి, ఉన్నత స్థాయికి చేరుకోవడానికి అవకాశం కలుగుతుంది. ఇటీవల విడుదలైన ఓ సర్వేలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

దేశంలోని పలు కంపెనీలలో యువ నిపుణుల నియామకాలు జోరుగా జరుగుతున్నాయి. దాదాపు 74 శాతం కంపెనీల యజమానులు వీరిపై ఆసక్తి చూపుతున్నారు. ప్రతి ఏటా ఈ నియామకాల శాతం పెరుగుతోంది. గతేడాదితో పోల్చితే ఈ సారి నాలుగు శాతం పెరిగింది. ఇ-కామర్స్, రిటైల్, ఇంజినీరింగ్ తదితర రంగాలలో ఉద్యోగాల కోసం ఎదురు చూసే యువతకు మంచి అవకాశాలు పెరిగాయి. పెరుగుతున్న టెక్నాలజీకి అనుగుణంగా వివిధ నైపుణ్యాల కలిగిన ఉద్యోగుల అవసరాలు కంపెనీలకు పెరిగాయి. వాటికి అనుగుణంగా నిపుణులను నియమించుకునేందుకు వివిధ కంపెనీలు ఎదురు చూస్తున్నాయి. దీంతో కళాశాలనుంచి బయటకు వచ్చే యువతకు స్వాగతం పలుకుతున్నాయి, బెంగళూరు, ముంబై, చెన్నై తదితర నగరాల్లో ఈ వరుసలో ముందున్నాయి. స్టాక్ డెవలప్‌మెంట్, ఎస్‌ఈవో నైపుణ్యం, డిజిటల్ సేల్స్ తదితర ఆదునిక డిజిటల్ నైపుణ్యాలు కలిగిన వారికి అవకాశాలు విపరీతంగా పెరిగాయి. యువ నిపుణులకు ఉద్యోగాలు కల్పించేవాటిలో ఇ-కామర్స్ సంస్థలు, టెక్ స్టార్టప్ లు ముందున్నాయి. ఈ రంగాలకు సంబంధించిన దాదాపు 62శాతం యజమానులు తమ కంపెనీలలో ఫ్రెషర్లకు అవకాశాలు కల్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇంజినీరింగ్, రిటైల్ రంగాల్లో యువతకు అవకాశాలు పుష్కలంగాఉన్నాయి. వీటిలో దాదాపు 54శాతం యజమానులు యువ నిపుణుల కోసం ఎదురుచూస్తున్నారు.



# ఎటిఎంల నుంచి పిఎఫ్ విత్‌డ్రా

**న్యూఢిల్లీ, డిసెంబరు 10:** ఉద్యోగులు పదవీ విరమణ తర్వాత నిరంతర ఆదాయం కోసం వారి ఉపాధితో పాటు ఇపిఎఫ్ఒలో పెట్టుబడి పెట్టే అవకాశం ఉంది. ఇపిఎఫ్ఒలో పెట్టుబడి పెట్టిన మొత్తంలో కొంత భాగాన్ని పదవీ విరమణ తర్వాత పెన్షన్‌గా అందుకుంటారు. ఇప్పుడు ఇపిఎఫ్ఒ నియమాలు మారవచ్చు. ఈ మార్పు తర్వాత పెట్టుబడిదారులు చాలా ప్రయోజనం పొందుతారు. ఇపిఎఫ్ఒ 3.0ని తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇదిఅమలులోకి వచ్చిన తర్వాత ఇపిఎఫ్ఒ నియమాలలో చాలా మార్పులు ఉంటాయి. ఈ మార్పుల తర్వాత పెట్టుబడి దారులు ప్రావిడెంట్ ఫండ్స్ నుండి ఉప సంహరించుకోవడం, పెట్టుబడి పెట్టడంలో మరింత సులభతరం కావచ్చు. ప్రస్తుతం ఉద్యోగులు తమ జీతంలో 12శాతాన్ని మాత్రమే ఇపిఎఫ్ఒకు చేరుతుంది. నివేదికల ప్రకారం ఇపిఎఫ్ఒ 3.0 ప్రాజెక్ట్ అమలు చేస్తే ఉద్యోగులు తమ సహకారం వాటాను కూడా పెంచుకోవచ్చు. అంటే అతను 12శాతం కంటే ఎక్కువ పెట్టుబడి పెంచుకోవచ్చు. చాలామంది ఇపిఎఫ్ఒ ఉద్యోగులు 12 శాతం కంటే ఎక్కువ పెంచుకోవాలని భావిస్తుంటారు. కానీ పరిమితి కారణంగా అలా చేయలేకపోతున్నారు. అయితే ఇపిఎఫ్ఒ 3.0 ప్రారంభించిన తర్వాత వారి కోరిక మేరకు పెట్టుబడి పెట్టవచ్చు. ప్రావిడెంట్‌ఫండ్ నుండి పాక్షిక ఉపసంహరణలు చేయడంలో ఇబ్బంది ఎదుర్కొంటున్న వారి కోసం ఇపిఎఫ్ఒ 3.0 అమలు తర్వాత ఉద్యోగులు ఏటీఎంల ద్వారా ప్రావిడెంట్‌ఫండ్ నుండి డబ్బునుతీసుకోవచ్చు. ఈనిబంధన అమలులోకి వచ్చిన తర్వాత పీఎఫ్ ఖాతా నుంచి డబ్బును విత్‌డ్రా చేయడం సులభం అవుతుంది.




# పెరిగిన విద్యుత్ వినియోగం..

**ముంబై, డిసెంబరు 10:** గత సంవత్సరంతో పోలిస్తే నవంబర్‌లో భారతదేశ విద్యుత్ వినియోగం 5.14 శాతం పెరిగి 125.44 బిలియన్ యూనిట్లకు (బియు) చేరుకుంది. నవంబర్ 2023లో ప్రభుత్వ డేటా ప్రకారం విద్యుత్ వినియోగం 119.30 గిగావాట్లు. ఒక రోజులో అత్యధిక సరఫరా (పీక్ పవర్ డిమాండ్ మెట్) కూడా 2024 నవంబర్‌లో 204.56 గిగావాట్ల నుండి 207.42 జిడబ్ల్యూకి స్వల్పంగా పెరిగింది. గరిష్ట విద్యుత్ డిమాండ్ ఈ ఏడాది మేలో ఆల్ టైమ్ గరిష్ట స్థాయి 250 గిగావాట్లకు చేరుకుంది. రాత్రి సమయంలో ఆల్ టైమ్ హై పీక్ పవర్ డిమాండ్ 243.27 గిగావాట్ల సెప్టెంబర్ 2023లో నమోదైంది. ఈసంవత్సరం ప్రారంభంలో విద్యుత్ మంత్రిత్వ శాఖ మే నెలలో పగటి పూట 235 గిగావాట్ల సాయంత్రం వేళల్లో 225 గిగావాట్ల జూన్‌లో పగటిపూట 240 జీడబ్ల్యూ, సాయంత్రం వేళల్లో 235 గిగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్‌ను అంచనా వేసింది. ఈ వేసవిలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 260 గిగావాట్లకు చేరుకోవచ్చని మంత్రిత్వ శాఖ అంచనావేసింది. అయితే, మంచివాణిజ్య, పారిశ్రామిక కార్యకలాపాలతో పాటు ఉష్ణోగ్రత తగ్గడం వల్ల రాబోయే రోజుల్లో విద్యుత్ వినియోగానికి డిమాండ్ స్థిరంగా ఉంటుందని వారు చెప్పారు.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps